

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 195

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రూ.3,008 కోట్ల పెట్టుబడులు

వర్చువల్‌గా 13 ప్రాజెక్టులకు సీఎం జగన్ భూమి పూజ, ప్రారంభోత్సవాలు

- ఏడు పారిశ్రామిక యూనిట్లు.. ఆరు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు.. 3 ప్రారంభోత్సవాలు, 9 యూనిట్లకు శంకుస్థాపన, ఒక ఎంవోయూ
- పులివెందులలో అరటి ప్రాసెసింగ్ క్లస్టర్, తిరుపతి జిల్లాలో డీపీ చాక్లెట్స్, గ్రీన్ లామ్ సౌత్ కంపెనీ యూనిట్లు ప్రారంభం
- మిగతా ప్రాజెక్టులు మరో ఆర్నెల్ల నుంచి ఏడాదిన్నరలోపే సాకారమయ్యేలా ప్రభుత్వ సహకారం
- పరిశ్రమల రాకతో 14 జిల్లాల్లో 7,000 మందికి పైగా స్థానికులకు నేరుగా ఉపాధి
- ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుతో 91 వేల మంది రైతులకు ప్రయోజనం
- విశాఖ జీఐఎస్‌లో కుదిరిన రూ.13 లక్షల కోట్ల ఒప్పందాలు వేగంగా కార్యరూపంలోకి
- సీఎస్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష.. పారిశ్రామికవేత్తలకు ఏ సమస్య ఎదురైనా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు

2లో

నేడు ఢిల్లీకి సీఎం జగన్

రేపు వామపక్ష తీవ్రవాదంపై కేంద్రం నిర్వహించే సమీక్షకు హాజరుకానున్న సీఎం

2 రోజుల పాటు పర్యటన

2లో

వందే వన్డే క్రికెట్

నేటి నుంచి వరల్డ్ కప్

భారత గడ్డపై వన్డే వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమైంది. 10 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి నేడు నగారా మోగనుంది. గత వరల్డ్ కప్ ఫైనలిస్ట్‌లు ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య జరిగే మ్యాచ్‌కు అహ్మదాబాద్ వేదిక కానుంది. 46 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 51 మ్యాచ్‌లు జరగనున్నాయి. నవంబర్ 19వ తేదీన అహ్మదాబాద్‌లోనే ఫైనల్ నిర్వహిస్తారు.

14లో

దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారు..

సాక్షులను బెదిరిస్తున్నారు



- చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించండి
- స్కిల్ కుంభకోణం అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే సాగింది
- ఆయన 13 సంతకాలతో సహా బలమైన ఆధారాలున్నాయి
- ఏసీబీ న్యాయస్థానాన్ని కోరిన అదనపు ఏజీ పొన్నవోలు
- కేసు విచారణను నేటికి వాయిదా వేసిన న్యాయస్థానం

10లో

ఉద్యోగుల జీపీఎస్‌కు జాతీయ స్థాయిలో

ప్రశంసలు

2004 పెన్షన్ సంస్కరణలను కాపాడుతూనే జీపీఎస్ తెచ్చిన ఏపీ

పలు విషయాలను ప్రస్తావిస్తూ ఆంగ్ల పత్రిక మింట్ బ్యానర్ కథనం

3లో

'కృష్ణా' వివాదం బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే



నీటి పంపకాల బాధ్యత ప్రస్తుత ట్రిబ్యునల్‌కే..

టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం


16లో

రూ.3,008 కోట్ల పెట్టుబడులు..

వర్చువల్‌గా 13 ప్రాజెక్టులకు సీఎం జగన్ భూమి పూజ, ప్రారంభోత్సవాలు

ఏడు పారిశ్రామిక యూనిట్లు.. 6 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

3 ప్రారంభోత్సవాలు, 9 యూనిట్లకు శంకుస్థాపన, ఒక ఎంవోయూ



తిరుపతి జిల్లా నాయుడుపేట ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



శ్రీకాకుళం జిల్లా నరువలో 'నాగార్జున ఆగ్రో కెమికల్స్' యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పరిశ్రమల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదుర్చుకున్న రూ.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను వేగంగా కార్యరూపంలోకి తెస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటయ్యే దాదాపు రూ.3,008 కోట్ల విలువైన 13 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్ బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో పరిశ్రమల రంగానికి చెందిన ఏడు యూనిట్లు రూ.2,294 కోట్ల పెట్టుబడితో పాటు 4,300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించనుండగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆరు యూనిట్ల ద్వారా రూ.714 కోట్ల పెట్టుబడితో 3,155 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా 91,000 మంది రైతులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. పులివెందులలో ఏర్పాటైన అరటి ప్రాసెసింగ్ యూనిట్‌తోపాటు తిరుపతి జిల్లాలో నెలకొల్పిన డీపీ చాక్లెట్స్‌కు చెందిన కోకో బటర్, కోకో పౌడర్ ఉత్పత్తుల తయారీ యూనిట్, గ్రీన్ లామ్ సౌత్ లిమిటెడ్ కంపెనీ యూనిట్లను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

విశాఖ ఒప్పందాలపై ప్రత్యేక కమిటీ

ఈరోజు 13 యూనిట్లకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నాం. ఇందులో ఒక ఎంవోయూ కూడా ఉంది. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదుర్చుకున్న 386 ఎంవోయూలతో దాదాపు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రానుండగా 6 లక్షల మందికి ఉద్యోగాలు లభించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ఇవన్నీ సాధ్యమైనంత త్వరగా కార్యాచరణలోకి తేవాలన్న లక్ష్యంతో సీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించి ప్రతి నెలా సమీక్షిస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందించేలా చర్యలు తీసుకున్నాం. ఎక్కడ, ఎవరికి ఏ అవసరం ఉన్నా దాన్ని ప్రభుత్వం తన అవసరంగానే భావించి పారిశ్రామికవేత్తలను చేయి పట్టుకుని నడిపిస్తూ ఎంవోయూలను కార్యరూపంలోకి తెస్తున్నాం. అందులో భాగంగానే ఇవాళ 3 యూనిట్లకు ప్రారంభోత్సవాలు, 9 యూనిట్లకు శంకుస్థాపన చేస్తున్నాం. ఒక ఎంవోయూపై కూడా సంతకాలు చేశాం. దాదాపు రూ.3,008 కోట్ల పెట్టుబడితో 7 వేల మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించే బృహత్తర కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టాం.

మిగతావి ఆర్నెల్ల నుంచి ఏడాదిన్నరలోపే సిద్ధం

ఈ పరిశ్రమల వల్ల 14 జిల్లాల్లో సుమారు 7 వేల మందికి పైగా స్థానికంగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని మనం చట్టం కూడా చేశాం. దీనివల్ల మన పిల్లలందరికీ మంచి జరుగుతుంది. అక్కడే వీరికి ఉద్యోగాలు రావడం వల్ల స్థానికులందరూ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు పలికి స్వాగతించేలా మనం ఈ చట్టం చేశాం. వీటివల్ల యువతకు ఆరు నెలల నుంచి గరిష్టంగా 18 నెలలలోగా ఈ పరిశ్రమలలో ఉద్యోగాలు రానున్నాయి. అప్పటిలోగా పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉంటాయి. ఇందులో 3 యూనిట్లను ఇప్పటికే ప్రారంభించుకున్నాం. మిగిలినవి ఆరు నెలల నుంచి ఏడాదిన్నరలోపే పూర్తవుతాయి. ఇవాళ ఎంవోయూ చేసుకున్న ప్లాంట్ కూడా ఏడాదిన్నరలోగా అందుబాటులోకి రానుంది.

■ కార్యక్రమంలో ఆయా రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో పాటు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఫోన్ కాల్ దూరంలో..

ఈ సందర్భంగా మీ అందరికీ (పారిశ్రామికవేత్తలు) మద్దతు ఇచ్చే విధంగా నాలుగు మాటలు చెబుతా. పారిశ్రామిక వేత్తల పట్ల మేం అత్యంత సానుకూలంగా ఉన్నాం. మీకు ఎలాంటి సమస్య ఎదురైనా మేం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉన్నామనే విషయాన్ని మనసులో పెట్టుకోండి. అధికార యంత్రాంగం మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని మనస్ఫూర్తిగా చెబుతున్నా. ఈ ప్రభుత్వం మీకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తుంది. కలెక్టర్లు, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి, పరిశ్రమలశాఖ మంత్రి, సీఎస్ సహా అందరూ మిమ్మల్ని చేయి పట్టుకుని నడిపించేలా మీ పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా కృషి చేసిన కలెక్టర్ నుంచి సీఎస్ వరకూ అందరికీ అభినందనలు.

పరిశ్రమల రంగంలో ప్రాజెక్టులివీ..

1. గ్రీన్ లామ్ సౌత్ లిమిటెడ్

తిరుపతి జిల్లా నాయుడుపేట ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో 66.49 ఎకరాల్లో ఏర్పాటైన గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్. ఈ యూనిట్ ద్వారా రూ.800 కోట్ల పెట్టుబడి, దాదాపు 1,050 మందికి ఉద్యోగ అవకాశాలు.

2. ఎకో స్టీల్ ఇండియా లిమిటెడ్

అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం జాజరకళ్లు గ్రామంలో రూ.544 కోట్లతో ఏర్పాటు కానున్న బయో ఇథనాల్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సీఎం జగన్. దీని ద్వారా 500 మందికి ఉద్యోగాలు.

3. ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర వద్ద రూ.250 కోట్లతో ఏర్పాటయ్యే ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి శంకుస్థాపన. ఈ పరిశ్రమ వల్ల 600 మందికి ఉపాధి.

4. శర్వాణి బయో ఫ్యూయల్

బాపట్ల జిల్లా కొరిసపాడు మండలం బుద్దవానిపాలెంలో ఏర్పాటు కానున్న శర్వాణి బయో ఫ్యూయల్ లిమిటెడ్ యూనిట్ శంకుస్థాపన. రూ.225 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉద్యోగ అవకాశాలు.

5. నాగార్జున ఆగ్రో కెమికల్స్

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం నరువ గ్రామంలో 57 ఎకరాల్లో ఏర్పాటు కానున్న నాగార్జున ఆగ్రో కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఏసీఎల్) యూనిట్. దీనిద్వారా బయో పెస్టిసైడ్స్, సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్, ఫ్లోరైన్ ఆధారిత కెమికల్స్ ఉత్పత్తి. రూ.200 కోట్లతో 200 మందికి ఉపాధి.

6. రవళి స్పిన్నర్స్

తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లిలో రూ.150 కోట్లతో ఏర్పాటు కానున్న రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఎస్‌పీఎల్) యూనిట్. దీని ద్వారా సుమారు 1,000 మందికి ఉపాధి.

7.యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమోటివ్

శ్రీసత్యసాయి జిల్లా గుడిపల్లెలో రూ.125 కోట్లతో ఏర్పాటు కానున్న యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమోటివ్ ప్లాస్టిక్స్ ప్రైవేట్ లిమిడెట్ యూనిట్. దీని ద్వారా 750 మంది స్థానికులకు ఉపాధి.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఇవీ ప్రాజెక్టులు..

1.డీపీ చాక్లెట్స్

తిరుపతి జిల్లా వరదాయిపాలెం మండలం కంచర్లపాలెంలో డీపీ చాక్లెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన కోకో బటర్, కోకో పౌడర్ ఉత్పత్తుల తయారీ యూనిట్ ప్రారంభం. రూ.325 కోట్ల పెట్టుబడితో 250 మందికి ఉద్యోగావకాశాలు. ఏటా 40 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి. ఈ యూనిట్ ద్వారా దాదాపు 18వేల మంది రైతులకు లబ్ధి.

2. పులివెందుల అరటి ప్రాసెసింగ్ క్లస్టర్

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం బ్రాహ్మణపల్లిలో అరటి ప్రాసెసింగ్ క్లస్టర్‌లో ఉత్పత్తి ప్రారంభం. రూ.4 కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన ఈ క్లస్టర్ ద్వారా బనానా పౌడర్, స్టెమ్ జ్యూస్, హనీ డిప్డ్ బనానా, కప్స్, ప్లేట్ల తయారీ. 700 మంది రైతులకు ఈ క్లస్టర్‌తో ప్రయోజనం చేకూరుతుంది.

3. ఓరిల్ ఫుడ్స్

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం మద్ది గ్రామంలో ఓరిల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇన్‌స్టెంట్ వెజిటబుల్ చట్నీస్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సీఎం జగన్. రూ.50 కోట్ల పెట్టుబడితో 175 మందికి ఉద్యోగ అవకాశాల కల్పన. ఏటా 7,500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ యూనిట్ ద్వారా 1,000 మంది రైతులకు ప్రయోజనం.

4. నేటివ్ అరకు కాఫీ

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కొడవటిపూడిలో అరకు కాఫీ తయారీ యూనిట్‌కు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపన. రూ.20 కోట్ల పెట్టుబడితో నెలకొల్పే ఈ యూనిట్ ద్వారా 200 మందికి ఉద్యోగావకాశాలు. ఏడాదికి 12 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఈ యూనిట్ ద్వారా దాదాపు 1,000 మంది గిరిజన రైతులకు ప్రయోజనం కలగనుంది.

5. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు

రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా 13 చోట్ల రూ.65 కోట్ల వ్యయంతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపన. పాలకొండ, పార్వతీపురం, చింతపల్లి, భీమిలి, రాజానగరం, రంపచోడవరం, సూళ్లూరుపేట, పీలేరు, జమ్మలమడుగు (రెండు చోట్ల), ఆదోని, నంద్యాల, కదిరిలలో ఈ యూనిట్ల ఏర్పాటు.

6. అయ్యవరంలో '3 ఎఫ్ ఆయిల్స్'

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అయ్యవరంలో ఆయిల్ పామ్ కంపెనీ ఏర్పాటుకు ఎంవోయూ. ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న 3 ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సంజయ్ గోయెంకా, ఏపీఎఫ్‌పీఎస్ సీఈవో శ్రీధర్‌రెడ్డి. రూ.250 కోట్లతో 50 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ద్వారా సుమారు 1,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గంటకు 60 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ యూనిట్ ద్వారా 25 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు మేలు జరగనుంది.



తూర్పుగోదావరి జిల్లా అయ్యవరంలో ఆయిల్ పామ్ కంపెనీ ఏర్పాటుకు సీఎం జగన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్న 3 ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, ఏపీఎఫ్‌పీఎస్ సీఈవోలు



శ్రీసత్యసాయి జిల్లా మడకశిర వద్ద ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి శంకుస్థాపన చేసిన సీఎం



అనంతపురం జిల్లా జాజరకళ్లులో బయో ఇథనాల్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సీఎం జగన్



వివిధ జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా...

నేడు ఢిల్లీకి సీఎం వైఎస్ జగన్

- రెండు రోజుల పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం(నేడు) ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. గురు, శుక్రవారాల్లో ఆయన ఢిల్లీలోనే ఉంటారు. గురువారం ఉదయం 10:30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళతారు. అక్కడ 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బస చేస్తారు. శుక్రవారం ఉదయం విజ్ఞాన్ భవన్‌లో వామపక్ష తీవ్రవాదంపై కేంద్రం నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సీఎం ఢిల్లీ పర్యటన వివరాలు వెల్లడించింది.

సీఎంను కలిసిన భూదాన్ బోర్డు చైర్మన్



సాక్షి, అమరావతి: ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ తాడి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. భూదాన్, గ్రామదాన్ చట్ట సవరణ ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలుచేసేలా నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన చెప్పారు. భూదాన్ బోర్డు కార్యకలాపాలను సీఎంకు వివరించినట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు



స్టీల్‌ప్లాంట్ ఎనర్జీ విభాగం అధికారులను అభినందిస్తున్న సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు 5వ సారి లభించింది. ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఎక్స్‌లెన్స్ కోసం జాతీయ అవార్డు పోటీ హైదరాబాద్‌లో నిర్వహించగా, ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్యం, గ్రీన్ హౌస్ గ్యాస్ తగ్గింపు కోసం చేసిన కృషికి గుర్తింపుగా స్టీల్‌ప్లాంట్‌కు ఈ అవార్డును ప్రకటించారు. స్టీల్‌ప్లాంట్ 2017 నుంచి 2023 వరకు వరుసగా 7వ సారి ఎక్స్‌లెంట్ ఎనర్జీ ఎఫీషియంట్ యూనిట్ అవార్డును అందుకుంది. ఏ సంస్థ అయిన గత మూడేళ్లుగా వరుసగా ఎక్స్‌లెంట్ ఎనర్జీ ఎఫీషియెంట్ యూనిట్ అవార్డును గెలుచుకుంటే నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు జాతీయ స్థాయిలో పొందనుంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో భారత ప్రభుత్వం, విద్యుత్ మంత్రిత్వశాఖ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ అధికారుల చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ అధికారులు అవార్డును అందుకున్నారు. సీఐఐ గోద్రెజ్ గ్రీన్ బిజినెస్ సెంటర్ ద్వారా వరుసగా గెలుచుకోవడం ఇది ఐదవ సారి కావడం విశేషం. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సిబ్బందిని సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

మోడల్ స్కూల్స్ సిబ్బంది పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం

సాక్షి, అమరావతి: ఏపీ మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న 14 మంది పీజీటీలను ప్రిన్సిపాళ్లుగా, 261 మంది టీజీటీలను పీజీటీలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియను విద్యా శాఖ ప్రారంభించింది. ఈ మేరకు అభ్యర్థుల సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. అభ్యంతరాలు తెలిపేందుకు నిర్ణీత తేదీలను వెబ్‌సైట్‌లో ఉంచామని, పూర్తి వివరాలకు cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

శ్రీసిటీలో కాలుష్య రహిత పరిశ్రమల నిర్వహణ భేష్

- ఐజీబీసీ, సీఐఐ సంస్థల కితాబు



అజీత్ చోర్డియా

వరదయ్యపాలెం (తిరుపతి జిల్లా): శ్రీసిటీలో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు కావడం అభినందనీయమని, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంస్థలు కితాబిచ్చాయి. బుధవారం ఈ 2 సంస్థలు సంయుక్తంగా 'కాలుష్య రహిత స్థిరమైన హరితహిత పద్ధతులు' అనే అంశంపై శ్రీసిటీ వ్యాపార వాణిజ్య కేంద్రంలో సదస్సు నిర్వహించాయి. స్థిరత్వ విధానాలు, జీరో పొల్యూషన్ సాధన, రోడ్ మ్యాప్, గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ 2023 అంశాలపై సదస్సులో చర్చ జరిగింది. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ ప్రసంగిస్తూ.. పర్యావరణ పరిరక్షణ కార్పొరేట్ బాధ్యతను దృష్టిలో పెట్టుకుని పరిశ్రమల స్థాపన, ఇతర సామాజిక మౌలిక సదుపాయాల కోసం నిబద్ధతతో ముందుకు సాగుతున్న శ్రీసిటీ ప్రస్థానాన్ని వివరించారు. ఐజీబీసీ చెన్నై చాప్టర్ చైర్మన్, ఒలంపియా గ్రూప్ ఇండియా ఎండీ అజీత్ చోర్డియా మాట్లాడుతూ..శ్రీసిటీ, వివిధ పరిశ్రమలు అమలు చేస్తోన్న సుస్థిరత కార్యక్రమాలను ప్రశంసించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ తదితర శ్రీసిటీ పర్యావరణ అనుకూల విధానాలను వివరించారు.

పునరుద్ధరణ దిశగా ప్రకాశం డెయిరీ

- రూ.108.32 కోట్ల పాత బకాయిలు చెల్లిస్తున్న ప్రభుత్వం
- రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అమూల్ ముందుకు..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో సహకార డెయిరీ పునరుద్ధరణకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే దేశంలోనే రెండో అతిపెద్ద పాల కర్మాగారంగా పేరొందిన చిత్తూరు విజయ డెయిరీ పునరుద్ధరణకు జూలై 4న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేసిన విషయం విదితమే. తాజాగా ప్రకాశం డెయిరీని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అమూల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని నవంబర్‌లో భూమిపూజకు ఏర్పాట్లు చేస్తోంది.

అమూల్ రూ.400 కోట్ల పెట్టుబడి

ప్రకాశం డెయిరీకి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 95.42 ఎకరాల భూములతోపాటు కోట్లాది రూపాయల విలువైన యంత్ర పరికరాలు ఉన్నాయి. 2013 ఫిబ్రవరి 13న టీడీపీ హయాంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇండియన్ కంపెనీస్ యాక్టు–1956 కింద పీడీసీఎంపీయూ లిమిటెడ్ పేరిట కంపెనీగా మార్చిన ఈ డెయిరీని ఆ తర్వాత దశల వారీగా నిర్వీర్యం చేశారు. ఈ డెయిరీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. డెయిరీకి చెందిన పాత బకాయిలు రూ.108.32 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. కాగా, ఇక్కడ రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అమూల్ సుముఖత వ్యక్తం చేసింది. పాల ఫ్యాక్టరీతో పాటు వెన్న తయారీ యూనిట్, నెయ్యి ప్లాంట్, మిల్క్ పౌడర్ ప్లాంట్, యూహెచ్‌టీ ప్లాంట్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే బాలామృతం తయారీ యూనిట్ ఏర్పాటు చేయబోతున్నారు.

అప్పట్లో పథకం ప్రకారం నిర్వీర్యం

సహకార డెయిరీ రంగాన్ని పథకం ప్రకారం గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. సహకార స్ఫూర్తితో ఏర్పాటైన పాల యూనియన్లను ప్రభుత్వ అనుమతి లేకుండానే మాక్స్ సొసైటీలుగా.. ఆ తర్వాత కంపెనీలుగా మార్చుకున్నారు. ఇలా 2016 జనవరి 6న విశాఖ మిల్క్ యూనియన్, 2013 జూన్ 18న గుంటూరు, 2013 ఫిబ్రవరి 13న ప్రకాశం జిల్లా యూనియన్లు కంపెనీల యాక్టు–1956 కింద మార్చేశారు. 2017 జనవరి 23న పులివెందుల డెయిరీ, 2018 జూలై 31న రాజమండ్రి డెయిరీ, 2018 నవంబర్ 30న కంకిపాడు మినీ డెయిరీ, 2019 మార్చి 15న మదనపల్లి డెయిరీ ఇలా వరుసగా 8 సహకార డెయిరీలు మూతపడ్డాయి. వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న ప్రభుత్వం.. మూతపడిన డెయిరీలకు పూర్వ వైభవం తెచ్చేందుకు పునరుద్ధరణను వేగవంతం చేసింది. ఇప్పటికే మదనపల్లి డెయిరీని అందుబాటులోకి తీసుకొచ్చింది. 2021 నుంచి దీనిని అమూల్ సంస్థ విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్తూరు డెయిరీకి ఉన్న రూ.182 కోట్ల అప్పులను తీర్చిన ప్రభుత్వం అమూల్ సహకారంతో పూర్వవైభవం తెచ్చేందుకు జూలై 4న సీఎం భూమి పూజ చేశారు. ఇక్కడ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. దేశంలోనే అతిపెద్ద ఐస్‌క్రీం ప్లాంట్‌తో పాటు పాల కర్మాగారం, బటర్, పాలపొడి, చీజ్, పన్నీర్, యాగర్ట్ స్వీట్స్, యూహెచ్‌టీ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. 10 నెలల్లో లక్ష టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తోంది.

సాధారణ చార్జీలతోనే దసరా ప్రత్యేక బస్సులు

సాక్షి, అమరావతి: అదనపు చార్జీల భారం లేకుండా దసరా పండుగ ప్రత్యేక బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ నిర్ణయించింది. సాధారణ చార్జీలతోనే దసరా ప్రత్యేక బస్సులు నడపనుంది. దసరా కోసం ఈ నెల 13 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేకంగా 5,500 బస్సు సర్వీసులు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆర్టీసీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలతోపాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు ఈ దసరా ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది.

- ■ దసరా పండుగకు ముందుగా ఈ నెల 13 నుంచి 22 వరకు 2,700 బస్సు సర్వీసులు నిర్వహిస్తారు. దసరా అనంతరం ఈ నెల 23 నుంచి 26 వరకు 2,800 బస్సు సర్వీసులు నడుపుతారు.
- ■ అంతర్‌రాష్ట్ర సర్వీసులకు సంబంధించి హైదరాబాద్ నుంచి 2,050, బెంగళూరు నుంచి 440, చెన్నై నుంచి 153 బస్సు సర్వీసులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఏర్పాటు చేశారు.
- ■ విశాఖపట్నం నుంచి 480, రాజమహేంద్రవరం నుంచి 355, విజయవాడ నుంచి 885, రాష్ట్రంలోని ఇతర జిల్లా కేంద్రాల నుంచి 1,137 బస్సు సర్వీసులు నిర్వహిస్తారు.
- ■ చార్జీలకు చిల్లర సమస్య లేకుండా ఉండేందుకు యూటీఎస్ మెషిన్ల ద్వారా టికెట్ల జారీ విధానాన్ని ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు ఫోన్ పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా టికెట్లు తీసుకోవచ్చు.
- ■ దసరా ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా కల్పించింది.
- ■ బస్సులకు జీపీఎస్ ట్రాకింగ్, 24 గంటల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కాల్ సెంటర్ నంబర్లు 149, 0866–2570005.
- ■ దసరా ప్రత్యేక బస్సుల ద్వారా ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు తెలిపారు.



సీఎం జగన్‌తో సబ్‌స్ట్రేట్ కంపెనీ సీఈవో మన్‌ప్రీత్ ఖైరా తదితరులు

అనకాపల్లి జిల్లాలో ఏఐ పరికరాల తయారీ యూనిట్

ముందుకొచ్చిన అమెరికాకు చెందిన సబ్‌స్ట్రేట్

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన కంపెనీ సీఈవో మన్‌ప్రీత్ ఖైరా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి అమెరికాకు చెందిన సబ్‌స్ట్రేట్ కంపెనీ ముందుకొచ్చింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఏపీఐఐసీ సెజ్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి సబ్‌స్ట్రేట్ ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం సబ్‌స్ట్రేట్ సీఈవో ఫౌండర్ మన్‌ప్రీత్ ఖైరా సీఎం వైఎస్ జగన్‌ను కలిసి.. పెట్టుబడి ప్రతిపాదలను వివరించారు. ఈ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామంటూ సబ్‌స్ట్రేట్ ప్రతినిధులకు సీఎం హామీ ఇచ్చారు. అనంతరం మన్‌ప్రీతా ఖైరా మాట్లాడుతూ సీఎం జగన్‌తో సమావేశం చాలా స్ఫూర్తిదాయకంగా జరిగిందన్నారు. విశాఖలో ఏఐ ఆధారిత హౌసింగ్, ఏఐ ఆధారిత తయారీ పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనలతో పాటు, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి కూడా పరిశీలించాల్సిందిగా కోరారు. కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా స్థానిక యువతలో ప్రతిభను పెంపొందించేలా విశాఖలో ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్నీ పరిశీలించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సబ్‌స్ట్రేట్ క్యాపిటల్ పార్ట్‌నర్ సిడ్నీ న్యూటన్, సబ్‌స్ట్రేట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మన్‌దీప్ ఖైరా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ప్యాకేజ్డ్ వస్తువులపై వివరాలు ముద్రించాలి

పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ

సాక్షి, అమరావతి: సూపర్ మార్కెట్లలో విక్రయించే ప్యాకేజ్డ్ వస్తువులపై కచ్చితంగా వివరాలు ముద్రించాలని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హెచ్.అరుణ్ కుమార్ అన్నారు. బుధవారం సూపర్ మార్కెట్ల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విక్రయించే వస్తువులపై తయారీదారు పేరు, చిరునామా, పరిమాణం, తయారీ, వినియోగ గడువు తేదీ, ఎమ్మార్పీ తదితర వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా తూకం యంత్రాలను తూనికలు, కొలతల శాఖ ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు.

నారాయణ పిటిషన్‌లో విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ శ్రీనివాసరెడ్డి

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో జరిగిన అక్రమాలపై నమోదు చేసిన కేసులో విచారణకు రావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని కోరుతూ మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంలో విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి తప్పుకున్నారు. ఈ వ్యాజ్యాన్ని మరో న్యాయమూర్తికి పంపేందుకు కేసు ఫైళ్లను ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందు ఉంచాలని రిజిస్ట్రీని జస్టిస్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అలాగే ఈ నెల 6న నారాయణ వ్యాజ్యం విచారణకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీకి స్పష్టంచేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రాగానే న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి ఈ వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. సీఐడీ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి స్పందిస్తూ.. నారాయణ విజయవాడలోనే ఉన్నారని, విచారణకు వస్తానని సమాచారం కూడా ఇచ్చారని తెలిపారు. నారాయణ తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ.. ఈ కేసులో నారాయణను ఇంటి వద్దే విచారించాలని గతంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ నెల 4న విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు ఇచ్చిందని, అందువల్ల ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవాలని కోర్టును కోరారు. తాను కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నందున ఎలాంటి ఆదేశాలూ ఇవ్వడం సాధ్యంకాదని న్యాయమూర్తి తేల్చి చెప్పారు.

12 వరకు లోకేశ్‌ను అరెస్టు చేయొద్దు: హైకోర్టు

ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ 12కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంలో తదుపరి విచారణ ఈ నెల 12కి వాయిదా పడింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు ఇంకా అందలేదని, అందువల్ల విచారణ వాయిదా వేయాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టును కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరిస్తూ విచారణను 12కి వాయిదా వేసింది. ఈ కేసులో లోకేశ్‌ను ఈ నెల 4వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దంటూ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను 12వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ నుంచి మెట్రో నగరాలకు అదనపు విమానాలు

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సూచన



గోపాలపట్నం: విశాఖ నుంచి మెట్రో నగరాలకు అదనపు విమాన సర్వీసులు నడపాలని విమానాశ్రయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సూచించారు. విమానాశ్రయంలో బుధవారం సలహా మండలి సమావేశం జరిగింది. తొలుత ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజారెడ్డి ఇప్పటివరకు సాధించిన ప్రగతి, భవిష్యత్ ప్రణాళికను వివరించారు. విశాఖ నుంచి పలు నగరాలకు 27 నుంచి 30 వరకు సర్వీసులు నడుపుతున్నట్టు వెల్లడించారు. ఇందులో హైదరాబాద్‌కు 89 శాతం, ఢిల్లీకి 93.94 శాతం, బెంగళూరుకు 87.65 శాతం, ముంబైకి 86.66 శాతం, చెన్నైకి 80.47 శాతం, సింగపూర్‌కు 84.44 శాతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ ఉందన్నారు. విశాఖ విమానాశ్రయం రూ.23.75 కోట్ల లాభాలతో నడుస్తోందన్నారు. నవంబర్ 15 నుంచి మార్చి 31 వరకు రాత్రి 9 నుంచి ఉదయం 8 వరకు రన్‌వే మూసివేస్తున్నట్టు చెప్పారు. ఈ సమయంలో రన్‌వే ఆధునీకీకరణ పనుల చేపడుతున్నామన్నారు. ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. రద్దీగా ఉన్న ఐదు మెట్రో నగరాలకు అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. తక్షణమే ఉన్నతాధికారులకు తీర్మానం పంపాలని ఆదేశించారు. వీటితో పాటు దుబాయ్, వారణాసి, మలేషియాకు విమాన సర్వీసులు నడపాలన్నారు. 90 శాతంపైనే ఆక్యుపెన్సీ ఉన్న నగరాలకు సర్వీసులు పెంచడం అవసరమన్నారు. డీసీపీ ఆనందరెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ద్వారా ప్రీపెయిడ్ ట్యాక్సీలు నడిపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కిరీటి, సలహా మండలి ప్రత్యేక ఆహ్వానితుడు ఒ.నరేష్, గంట్ల శ్రీనుబాబు, కె.విజయ్‌మోహన్, డీఎస్ వర్మ, పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బేబికి దివ్యాంగ పెంఛన్ అందజేస్తున్న వలంటీరు శాంతి



తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరెడ్డికండ్రిగ ఏపడబ్ల్యూకు చెందిన వై సుబ్రమణ్యంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి



నెల్లూరు మూలాపేటకు చెందిన మస్తాన్‌బీకి పింఛను నగదు అందజేస్తున్న వలంటీర్ హరిబాబు



ఏలూరులో అల్లిపిల్లి అమ్మోరమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ డి.రోజా

ఉద్యోగుల జీపీఎస్‌కు జాతీయ స్థాయిలో ప్రశంసలు

2004 పెన్షన్ సంస్కరణలను కాపాడుతూనే జీపీఎస్ తెచ్చిన ఏపీ

ఉద్యోగులకు 50% పెన్షన్ గ్యారెంటీ

డీఆర్, ఉద్యోగుల హెల్త్ స్కీం జీపీఎస్‌లో అదనం

- పాత పెన్షన్ స్కీముకు వెళితే భవిష్యత్తులో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి
- జీతాలూ చెల్లించలేక మొదటికే మోసం
- అందుకే లోతుగా అధ్యయనం చేసి ఉద్యోగులకు మేలు చేసేలా జీపీఎస్
- ఈ విషయాలను ప్రస్తావిస్తూ ఆంగ్ల పత్రిక మింట్ బ్యానర్ కథనం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా దానిపై లోతుగా అధ్యయనం చేస్తారు. నిబంధనలను అనుసరిస్తూనే, లబ్ధిదారులకు సాధ్యమైనంత ఎక్కువ మేలు చేసేలా దానిని రూపొందిస్తారు. ఇటువంటిదే ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ పెన్షన్ స్కీము (ఏపీజీపీఎస్). కేంద్ర ప్రభుత్వం 2004లో చేసిన పింఛను సంస్కరణలను కాపాడుతూనే దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా అటు ఉద్యోగులకు, ఇటు ప్రభుత్వానికి మేలు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఈ స్కీమ్‌పై జాతీయ స్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ స్థాయి పత్రికలు కూడా వైఎస్ జగన్ తెచ్చిన జీపీఎస్‌ను మంచి పథకంగా అభివర్ణిస్తున్నాయి. దీనిపై ప్రముఖ ఆంగ్ల పత్రిక 'మింట్' బ్యానర్ కథనమే ప్రచురించింది. ఏపీజీపీఎస్ పింఛను సంస్కరణలను ఎలా కాపాడుతోందో ఈ కథనం వివరించింది. పదవీ విరమణ చేసిన తరువాత చివరి నెల డ్రా చేసిన మూల వేతనంలో 50 శాతం పింఛను వచ్చేలా ఉద్యోగులకు ఏపీజీపీఎస్ ద్వారా గ్యారెంటీ కల్పిస్తూనే, మరో పక్క రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా ఆర్థిక భారం పడకుండా సరికొత్త సంస్కరణలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిందని మింట్ పత్రిక ప్రశంసించింది.

వివేచనతో వ్యవహరించిన ఏపీ ప్రభుత్వం

పాత పింఛను పథకంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భవిష్యత్‌లో మోయలేని ఆర్థిక భారం పడుతుందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2004లో జాతీయ పెన్షన్ స్కీము ద్వారా పింఛను సంస్కరణలు తెచ్చింది. మెజారిటీ రాష్ట్రాలు కూడా 2004 నుంచి జాతీయ పెన్షన్ స్కీమును అమలు చేస్తున్నాయి.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ 2004 నుంచి ప్రభుత్వంలో చేరిన ఉద్యోగులందరికీ జాతీయ పెన్షన్ స్కీము అమలు చేస్తున్నారు. దీనినే ఎంప్లాయీస్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీముగా (సీపీఎస్) కూడా పేర్కొంటారు. ఇందులో పింఛను ఎంత వస్తుందనేది మార్కెట్ పరిస్థితులనుబట్టి ఉంటుంది. కచ్చితంగా ఎంత వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఉద్యోగులు పాత పెన్షన్ స్కీము అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వీటిపై లోతుగా అధ్యయనం చేసింది. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, పెన్షన్ సంస్కరణలపై రాజీపడకుండా మధ్యే మార్గంగా ఏపీజీపీఎస్‌ను తీసుకువచ్చిందని మింట్ పత్రిక ప్రశంసించింది. ఒక వేళ భవిష్యత్ తరాల గురించి ఆలోచన చేయకుండా పాత పింఛను పథకాన్నే అమలు చేస్తే పదేళ్ల తరువాత ఉద్యోగులకు జీతభత్యాలిచ్చే పరిస్థితి కూడా ఉండదని, మొదటికే మోసం వస్తుందని తెలిపింది. రాజకీయం కోసం ఆలోచన చేయకుండా భవిష్యత్ తరాల కోసం, ఉద్యోగుల డిమాండ్‌లో కూడా న్యాయం ఉందని భావించి సుదీర్ఘ కసరత్తు చేయడంతోపాటు వివేచనతో ఏపీ ప్రభుత్వం వ్యవహరించింది. ఇటు ఉద్యోగులకు పెన్షన్ గ్యారెంటీ ఇస్తూనే, మరోవక్క రాష్ట్రం భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకుండా ఏపీజీపీఎస్‌ను హైబ్రీడ్ మోడల్‌లో అమలుకు నిర్ణయం తీసుకుంది. తద్వారా 2004 పెన్షన్ సంస్కరణలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాపాడింది. పాత పింఛను స్కీమును అమలు చేస్తే 2041 కల్లా అప్పు కూడా పుట్టని దశకు రాష్ట్రం చేరుతుంది. అంతే కాకుండా 2050కల్లా ద్రవ్యలోటు 8 శాతానికి చేరుతుంది.

ఇవీ పింఛను స్కీములు

పాత పింఛను విధానం

పాత పెన్షన్ స్కీము అమలు చేయడం కేంద్రంపైన, రాష్ట్రాలపైన ఆర్థికంగా పెనుభారం పడుతుంది. దీన్ని భవిష్యత్‌లో కొనసాగించడం సాధ్యం కాదు. పెన్షన్ల భారం 4.5 రెట్లు పెరుగుతుంది. రాబోయే రోజుల్లో జీతభత్యాలు కూడా ఇవ్వలేనంతగా భారం అవుతుంది.


2004లో తెచ్చిన జాతీయ పింఛను పథకం

జాతీయ పెన్షన్ స్కీము కింద ఉద్యోగులకు వచ్చే పెన్షన్ పరిమాణాన్ని మార్కెట్ పరిస్థితులు నిర్ణయిస్తాయి. ఎంత పెన్షన్ వస్తుందనేది కచ్చితంగా చెప్పలేరు. అయితే ఈ స్కీము రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఏపీ ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ జీపీఎస్ ఉద్యోగుల పదవీ విరమణ చేసిన తరువాత చివరి నెలలో డ్రా చేసిన మూల వేతనంలో 50 శాతం పెన్షన్‌కు గ్యారెంటీ ఇస్తోంది. ఉద్యోగి మరణిస్తే జీవిత భాగస్వామికి ఆ పెన్షనలో 60 శాతం వస్తుంది. ద్రవ్యోల్బణం ప్రకారం డీఆర్ వస్తుంది. హెల్త్ స్కీము కూడా వర్తిస్తుంది.

రాజకీయ లబ్ధి కోసం పసి పిల్లల్నీ వదలని టీడీపీ



వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: నీచ రాజకీయాల కోసం తెలుగుదేశం పార్టీ పసి పిల్లలను కూడా వదలడంలేదని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి మండిపడ్డారు. టీడీపీ నేతలు వారి స్వార్థం కోసం పసి మెదళ్లలోనూ విషం నింపుతున్నారని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. పసివాడి చేతికి మైక్ ఇచ్చి పెద్ద మాటలు మాట్లాడించి శునకానందం పొందుతున్నారని అన్నారు. ఈ లోకంలో లేని వైఎస్సార్‌ని తిట్టిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ధ్వజమెత్తారు.

స్కిల్ కుంభకోణంపై బాబు అర్థంలేని వాదన

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సాక్ష్యాలు బలంగా ఉన్నందువల్లే ఈ కేసులో అరెస్టయిన చంద్రబాబు కోర్టుల్లో అర్థంలేని వాదనలు వినిపిస్తున్నారని విజయసాయిరెడ్డి చెప్పారు. అసలు నేరం చేశారా లేదా అన్న విషయం జోలికే బాబు వెళ్లడంలేదని అన్నారు. స్కిల్ కుంభకోణంపై విచారణ 2018కి ముందే ప్రారంభమైందని సీఐడీ వివరణ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి లేకుండా అరెస్టు చేయకూడదన్న వాదన మాత్రమే వినిపిస్తున్నారని తెలిపారు.

మొబైల్ తయారీ రంగంలో భారత దేశం నంబర్ 1 స్థానానికి చేరాలి

ప్రైవేటు కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడంతో భారత దేశం ప్రపంచంలోనే మొబైల్ తయారీ రంగంలో రెండో స్థానంలో ఉందని, మొదటి స్థానంలో నిలిచేందుకు త్వరితగతిన ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు దేశం నుంచి 5.5 బిలియన్ డాలర్లు విలువైన మొబైల్స్ ఎగుమతి చేసినట్లు విజయసాయిరెడ్డి చెప్పారు.

చిరుద్యోగులపై దొంగ ఏడుపులు

గత సర్కారుతో పోలిస్తే మూడు రెట్లు పెరిగిన చిరుద్యోగుల జీతాల వ్యయం.. ఠంచన్‌గా చెల్లింపులు.. ఏజెన్సీలు, దళారులే లేరు

- పారదర్శకంగా ప్రత్యేక వ్యవస్థను తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- పథకాలకు ఆదాయ పరిమితిని రెట్టింపు చేసిందీ ఈ ప్రభుత్వమే
- దగా చేసిందీ.. కమీషన్లు కాజేసింది టీడీపీ హయాంలోనే

చిరుద్యోగులకు గత సర్కారు హయాంలో జీతాల వ్యయం రూ.1,100 కోట్లు!

మరిప్పుడు వారి జీతాల కోసం చెల్లిస్తున్న మొత్తం ఏకంగా రూ.3,300 కోట్లు!!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిరుద్యోగుల పట్ల ఉదారంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీల నుంచి 108 డ్రైవర్ల దాకా పలు వర్గాల జీతాలను పెద్ద ఎత్తున పెంచింది. జీతాల ఖర్చు మూడు రెట్లు పెరగడం కళ్లెదుటే కనిపిస్తున్నా చిరుద్యోగులకు దగా చేస్తున్నారంటూ కడుపు నొప్పితో కళ్లనీళ్ల పెట్టుకునే వారిని ఏమనాలి? మరిలాంటి దుష్ప్రచారం ఈనాడులో చేస్తున్నారు కాబట్టి రామోజీనే అనుకోవాలేమో!! జీతాలు పెంచాలని చిరుద్యోగులు గత ప్రభుత్వ హయాంలో గగ్గోలు పెట్టిన విషయం ఆయనకు గుర్తున్నా తెలియనట్లే నటిస్తున్నారు!!

- సాక్షి, అమరావతి

పారదర్శకంగా నియామకాలు, చెల్లింపులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు, జీతాల చెల్లింపుల్లో పూర్తి పారదర్శకతను తీసుకొస్తూ దళారీ వ్యవస్థ నిర్మూలనకు ఆప్కాస్ కార్పొరేషన్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. లంచాల ప్రసక్తే లేకుండా శాశ్వత ఉద్యోగుల కంటే ముందే ఠంచనుగా ప్రతి నెలా ఒకటో తేదీనే వారికి జీతాలిచ్చే పద్ధతిని తెచ్చింది. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్‌ను వర్తింప చేసింది. దీనికి అనుగుణంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను కూడా పెంచారు. వీరికి గరిష్టంగా రూ.28 వేల వరకూ చెల్లిస్తున్నారు. మరి టీడీపీ సర్కారు ఇలాంటి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి చిరుద్యోగులను ఎందుకు ఆదుకోలేదు? వారి పోస్టులకు తగ్గట్టుగా పూర్తి జీతాలను ఎందుకు ఇవ్వలేదు? ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పొట్టగొట్టి ఏజెన్సీ కమీషన్ల పేరుతో జీతాలను గుంజుకుంటే ఈనాడుకు కనపడలేదా?

మనసున్న ప్రభుత్వం ఎవరిది?

నాలుగున్నరేళ్ల పాటు చిరుద్యోగుల జీతాలను పెంచాలనే ఆలోచన కూడా చేయని చంద్రబాబు సర్కారు గత ఎన్నికలకు ఆర్నెల్ల ముందు అరకొరగా పెంచిన జీతాలను కొందరికి మాత్రమే అమలు చేసింది. మరి కొందరికి పెంపు కాగితాలపైనే పరిమితమైంది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జీతాలను మరింత పెంచి మొదటి రోజు నుంచే అమలు చేసింది. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, శానిటేషన్ వర్కర్లు, గిరిజన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, హోంగార్డులు, మధ్యాహ్న భోజన పథకం ఆయాలు లాంటి చిరుద్యోగుల విషయంలో సీఎం జగన్ మనసు పెట్టి జీతాలు పెంచారు. గత సర్కారు హయాంలో రూ.1,100 కోట్లు మాత్రమే ఉన్న వారి జీతాల వ్యయం ఇప్పుడు ఏకంగా రూ.3,300 కోట్లకు పెరగడమే అందుకు తిరుగులేని నిదర్శనం.



ఉదారంగా అర్హతల సడలింపు

ప్రభుత్వ పథకాల అమలులో అర్హతలను సడలిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వక్రీకరిస్తూ ఈనాడు దుష్ప్రచారం చేస్తోంది. పథకాలను మరింత మందికి అందజేయాలనే ఉద్దేశంతో ఆదాయం, భూమి, కరెంటు వినియోగం తదితర అంశాలలో ఉదారంగా వ్యవహరిస్తూ లబ్ధిదారులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. గత ప్రభుత్వంలో పథకాలను పొందేందుకు గ్రామాల్లో నెలకు కనీస ఆదాయ పరిమితి రూ.5 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6 వేలుగా ఉండేది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలను నెలవారీ ఆదాయ పరిమితిగా నిర్ణయించి ప్రభుత్వం మరింత మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చింది. కరెంట్ వినియోగంపై గతంలో 200 యూనిట్ల పరిమితి విధించగా ఇప్పుడు 300 యూనిట్లకు పెంచారు. వివాహాల అనంతరం వేరుగా ఉంటున్న వారిని విడి కుటుంబాలుగా పరిగణిస్తున్నారు. ఆ మేరకు వారికి విడిగా రేషన్ కార్డులను జారీ చేస్తూ వివిధ పథకాలకు అర్హత కల్పిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వేల సంఖ్యలో అందిన ఇలాంటి దరఖాస్తులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించింది.

చిరుద్యోగులకు సీఎం జగన్ వేతనాలను పెంచారిలా..

- అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు 2019 ఎన్నికలకు మూడు నెలల ముందు వరకూ రూ.7వేలు ఉంటే ఇప్పుడు రూ.11,500కు పెంచారు. హెల్పర్ల జీతాలు రూ.4 వేల నుంచి రూ.7 వేలకు పెరిగాయి.
- గ్రామ సంఘాల సహాయకులు, యానిమేటర్స్ జీతాలను రూ.2 వేల నుంచి ఏకంగా రూ.10 వేలకు పెంచారు.
- మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల జీతాలను రూ.12 వేల నుంచి రూ.18 వేలకు తీసుకుని వెళ్లారు.
- ఆశావర్కర్ల జీతాలను రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచారు.
- గిరిజన సంక్షేమశాఖ కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల జీతాలను రూ.400 నుంచి ఏకంగా రూ.4 వేలకు పెంచి అండగా నిలిచారు.
- పోలీస్ శాఖలో పనిచేసే హోంగార్డుల జీతాలను రూ.18 వేల నుంచి రూ.21,300కు పెంచారు.
- పాఠశాల విద్యాశాఖలో కుక్ కం హెల్పర్లకు చెల్లించే రూ.వెయ్యి గౌరవ వేతనాన్ని రూ.3 వేలకు పెంచారు.
- 108 డ్రైవర్ల జీతాలను రూ.13 వేల నుంచి రూ.28 వేలకు పెంచారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల జీతాలను రూ.17,500 నుంచి రూ.20 వేలకు తీసుకుని వెళ్లారు.
- 104 డ్రైవర్ల జీతాలను రూ.26 వేలకు పెంచారు.
- ఆస్పత్రుల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల జీతాలను రూ.8 వేల నుంచి రూ.16 వేలకు పెంచారు.

ఉద్దేశ పూర్వకంగా 'నిమ్మగడ్డ' రాద్ధాంతం

- గతంలో కాంట్రాక్టు ఉద్యోగులు బీఎల్‌ఓలుగా చేయలేదా?
- అప్పుడులేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు?
- మీది సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీనా లేక సిటిజన్ ఫర్ యాంటి డెమోక్రసీనా?
- నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న మమ్మల్ని అనుభవం లేదంటారా?
- ఎస్ఈసీ మాజీ కమిషనర్ నిమ్మగడ్డపై గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండిపాటు

సాక్షి, అమరావతి: సిటిజన్ ఫర్ డెమోక్రసీ పేరుతో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎన్నికల విధులకు సంబంధించి ఇటీవల చేస్తున్న రాద్ధాంతంపై గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ తీవ్రంగా తప్పుబట్టింది. ఉద్దేశపూర్వకంగా సచివాలయ ఉద్యోగుల సామర్థ్యాన్ని శంకిస్తూ రాజకీయ కోణంలో ఆయన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎన్నికల విధుల నుండి తొలగించాలని వినతిపత్రం ఇచ్చారంటూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో ప్రైవేట్ లేదంటే కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నికల విధుల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ)లుగా పనిచేసినప్పుడు లేని అభ్యంతరాలు, ఇప్పుడు అదే విధుల్లో సచివాలయాల ఉద్యోగులు పనిచేస్తున్నప్పుడు ఎందుకొస్తున్నాయంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. 'మీరు మా మీద మచ్చవేయడం మంచి పద్ధతి కాదు' అంటూ నిమ్మగడ్డకు ఆయన హితవు పలికారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న లక్షా ముప్పై నాలుగు వేల మంది ప్రభుత్వోద్యోగుల మనోభావాలు దెబ్బతీసేలా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫోరమ్ ప్రవర్తించిందని ఆయన మండిపడ్డారు.

అనుభవం లేదనడం సరికాదు..

ఇక ఎన్నికల విధుల్లో సచివాలయాల ఉద్యోగులకు అనుభవంలేదని, తప్పులు చేస్తున్నారని.. రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నారన్న ఆరోపణలు అసత్యాలని ఆయన తెలిపారు. నిజానికి.. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇప్పటికే నాలుగేళ్ల అనుభవాన్ని గడించారని.. ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి ఐదో ఏడాదిలోకి అడుగుపెట్టిన ఈ సందర్భంలో అనుభవరాహిత్యం అనడం తమకు ఇబ్బంది కలిగిస్తోందంటూ జానీపాషా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు రాజకీయ ఒత్తిళ్లకులోనై పొరపాటు చేసే అవకాశమే లేదని ఆయన స్పష్టంచేశారు.

సచివాలయ సిబ్బంది ప్రభుత్వోద్యోగులు కారా?

'వలంటీర్లతో సచివాలయాల ఉద్యోగులు భాగస్వామ్యులై బీఎల్ఓ విధులు నిర్వహిస్తున్నారని మీరు అనడం తీవ్ర అభ్యంతరకరం. ఎక్కడా అలా విధులు నిర్వహించడంలేదు. అలా ఎక్కడన్నా జరిగి ఉంటే, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరాలి. మీది సిటిజన్స్ ఫర్ డెమోక్రసీనా లేక యాంటి డెమోక్రసీనా? గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రభుత్వోద్యోగులు కాదా? మేము ఎన్నికల విధులు నిర్వర్తించలేమా? ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యాఖ్యానిస్తున్నారు' అంటూ జానీపాషా మండిపడ్డారు. ప్రభుత్వ సర్వీసులో పనిచేసిన వ్యక్తిగా మీ మాటలు ప్రభుత్వ సర్వీసులోకి కొత్తగా వచ్చిన యువతను ప్రోత్సహించేలా ఉండాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.

పీటీ వారెంట్‌పై విచారణను నిరోధించలేం

- ఏసీబీ కోర్టుకు అటువంటి ఉత్తర్వులివ్వలేం
- చంద్రబాబుకు తేల్చిచెప్పిన హైకోర్టు
- ఫైబర్‌గ్రిడ్ కేసులో బాబు ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో జరిగిన ఆర్థిక అక్రమాలపై నమోదు చేసిన కేసులో సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌పై విచారణ జరపకుండా ఏసీబీ కోర్టును నిరోధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు ఇప్పటికే నిరాకరించిన విషయాన్ని సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌తో పాటు సీఐడీ దాఖలు చేసిన పోలీసు కస్టడీ పిటిషన్‌పై కూడా వాదనలు కొనసాగుతున్నాయని ఏజీ వివరించారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వొద్దని అభ్యర్థించారు. దీనికి హైకోర్టు స్పందిస్తూ.. గురువారం ఉదయం నుంచే చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు వింటామని తెలిపింది. ఇరుపక్షాలూ ఆరోజే వాదనలు పూర్తి చేయాలని స్పష్టం చేస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో అక్రమాలపై నమోదు చేసిన కేసులో సీఐడీ చంద్రబాబును 25వ నిందితునిగా చేర్చింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సురేష్ రెడ్డి బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఈ కేసులో ఫిర్యాదుదారు అయిన ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎండీ తరఫున తాను న్యాయవాదిగా ఉన్నప్పుడు వాదనలు వినిపించానని, అందువల్ల ఈ కేసును విచారించడంపై ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని ఇరుపక్షాల న్యాయవాదులను కోరారు. తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చంద్రబాబు న్యాయవాదులు స్పష్టంగా చెప్పడంతో విచారణ కొనసాగించారు. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాలకు, వాటిలో లోటుపాట్లకు అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును బాధ్యుడిగా చేయడానికి వీల్లేదన్నారు. టెరాసాఫ్ట్ సంస్థకు టెండర్ ఖరారు చేసిన కమిటీలో, పనులు అప్పగించిన కమిటీలో చంద్రబాబు సభ్యుడు కాదన్నారు. సీఐడీ 2021లో కేసు నమోదు చేసి, ఇన్నాళ్లూ మౌనంగా ఉందన్నారు. ఏనాడూ చంద్రబాబుకు నోటీసు ఇవ్వలేదని, మొన్నటి వరకు నిందితునిగా కూడా చేర్చలేదని తెలిపారు. అకస్మాత్తుగా ఆయన్ని 25వ నిందితునిగా చేర్చారని తెలిపారు. తమ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెలువరించేంత వరకు పీటీ వారెంట్‌పై ఏసీబీ కోర్టు విచారణ జరపకుండా ఉత్తర్వులివ్వాలని కోరారు. అగర్వాల్ అభ్యర్థనపై ఏజీ శ్రీరామ్ అభ్యంతరం తెలిపారు. సుప్రీంకోర్టును సైతం ఇదే రకమైన కోరిక కోరారని, అందుకు సుప్రీంకోర్టు నిరాకరించిందని ఏజీ చెప్పారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. ఏసీబీ కోర్టులో బెయిల్, పోలీసు కస్టడీ పిటిషన్లపై విచారణ ముగిసిందా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదని శ్రీరామ్ తెలిపారు. ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పీటీ వారెంట్ విషయంలో ఏసీబీ కోర్టును నిరోధిస్తూ ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించారు.



సాక్షి
గురువారం, 5 అక్టోబర్ 2023

మనకు కొత్త సవాలు

తరచూ రాజకీయ సంక్షోభాలు చవిచూసే ద్వీపసమూహ దేశం మాల్దీవుల్లో ఈసారి శాంతియుతంగా అధికార మార్పిడి జరిగింది. అది సంతోషజనకమే అయినా, ఈ తాజా అధ్యక్ష ఎన్నిక ఫలితాలు భారత్‌లో కొత్త ఆందోళన రేపుతున్నాయి. చైనాకు అనుకూలుడైన ప్రతిపక్ష అభ్యర్థి దేశాధ్యక్షుడు కానుండడమే అందుకు కారణం. మాల్దీవులకు కొత్త అధ్యక్షుడి రాకతో, ఇప్పటి దాకా అక్కడున్న పలుకుబడి, పట్టు భారత్ కోల్పోనుంది. అది గణనీయమైన నష్టమే. రక్షణ రంగం, ప్రాథమిక వసతుల ప్రాజెక్టుల్లో మాల్దీవులతో భారత సంబంధాలే ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాంశం కావడం గమనార్హం. మాల్దీవులపై డ్రాగన్ దేశం మరోసారి పట్టు సాధించే అవకాశం రావడంతో ఢిల్లీ – మాల్దీవుల బంధానికి ఇది పరీక్షా సమయం. ప్రభుత్వం మారినా, కీలకమైన మాల్దీవుల్లో తన ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయడం భారత్‌కు ఇప్పుడు తప్పనిసరి. అంతేకాక, గడచిన రెండు దశాబ్దాలుగా చైనా తన ప్రాబల్యం పెంచుకొంటూ, మన పెరట్లో తన పట్టు బిగిస్తున్న వైనాన్ని గమనించి జాగ్రత్తపడక తప్పదని మరోసారి రుజువైంది.

భారత్‌కు దక్షిణంగా సుమారు 450 మైళ్ళ దూరంలో, కేవలం 5 లక్షల జనాభా ఉండే మాల్దీవులు చిరు ద్వీపదేశమే. అయితే, హిందూ మహాసముద్రంలో రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గంలో నెలకొన్నందున వ్యూహాత్మకంగా చాలా కీలకం. అందుకే, ఆ దేశాధ్యక్ష పదవికి ఎన్నికలు అనేసరికి భారత, చైనాల్లో ఆసక్తి నెలకొంది. ఒక విధంగా చూస్తే ఈ ఎన్నికలు... ద్వీపదేశంపై భారత, చైనాల్లో ఎవరికి పట్టు ఎక్కువుందో తెలియపరిచే ప్రజాభిప్రాయ సేకరణ పోటీ లాంటివి. రాజధాని మాలే నగరానికి ప్రస్తుతం మేయర్‌గా ఉంటూ, దేశాధ్యక్ష పదవికి పోటీ పడ్డ ముయిజు మొదటి నుంచి చైనాతో సన్నిహిత సంబంధాల్ని కోరుకుంటున్నారు. నిజానికి, జనంతో క్రిక్కిరిసిన రాజధానిలో జాగా కొరత వల్ల తలెత్తిన గృహవసతి సమస్య, తరిగిపోతున్న డాలర్ రిజర్వులు సహా అనేక అంశాలు ఈ ఎన్నికల ప్రచారంలో ముందుకు వచ్చాయి. అయితే, చివరకు మాల్దీవుల భవిత్పై ఆసియాలోని రెండు అగ్రదేశాల ప్రభావం చుట్టూరానే ఓటింగ్ సరళి సాగింది. దాదాపు 85 శాతానికి పైగా ఓటింగ్‌లో పాల్గొన్న ఈ ఎన్నికల్లో ఓటర్లు భారత, చైనా వర్గాలుగా చీలిపోయారని చెప్పవచ్చు.

ఇరుగుపొరుగు దేశాల్లో పలుకుబడిని పెంచుకొనే ప్రయత్నాలు భారత, చైనాలు రెంటికీ కొత్త కాదు. 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బీఆర్ఐ) కింద అభివృద్ధి రుణాలతో మాల్దీవుల్లో చైనా ముందుగా అడుగేసింది. ఇటీవల కొన్నేళ్ళుగా భారత్ తన పట్టు చాటింది. నిరుడు శ్రీలంక ఆర్థిక వ్యవస్థ పతనమైనప్పుడు వందల కోట్ల డాలర్ల సాయం అందించిన ఢిల్లీ 2018లో సోలిహ్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి ద్వీపదేశంలో తన ఉనికిని విస్తరించింది. ప్రాజెక్టులూ పెరిగాయి. నిజం చెప్పాలంటే – గతానికి భిన్నంగా గత అయిదేళ్ళలో భారత అనుకూల సోలిహ్ పాలనలో మాల్దీవుల్లో శాంతి, స్వేచ్ఛ నెలకొన్నాయి. అంతకు ముందు అయిదేళ్ళు ప్రస్తుతం అవినీతి ఆరోపణలపై జైలులో ఉన్న చైనా అనుకూల అబ్దుల్లా యమీన్ పాలన సాగింది. అయితే, ప్రస్తుత సర్కార్ మాల్దీవుల సార్వభౌమాధికారాన్ని భారత్‌కు తాకట్టు పెడుతోందనే భావనను జనంలో ప్రతిపక్ష కూటమి కల్పించగలిగింది. 'ఇండియా అవుట్' అనే దాని నినాదాల భావోద్వేగం ఫలించింది.

సెప్టెంబర్ మొదట్లో జరిగిన తొలి రౌండ్ ఓటింగ్‌లో 8మంది అభ్యర్థుల్లో సోలిహ్‌కు 36 శాతం, ముయిజుకు 46 శాతం వచ్చినా, ఎవరూ అర్ధశతం దాటలేదు. అలా అదనపు రెండో విడత ఓటింగ్ అవసరమైంది. ఈసారి ప్రతిపక్ష ముయిజు స్పష్టమైన విజేతగా నిలిచారు. బ్రిటన్‌లో చదువుకొని, సివిల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేసి, ఇప్పుడు అధ్యక్షుడిగా ఎన్నికైన 45 ఏళ్ళ ముయిజు రాజకీయాల్లోకి రాక ముందు ప్రైవేట్ రంగంలో ఇంజనీర్. మాలేకు మేయర్ అవడానికి ముందు ఆయన గృహ నిర్మాణ శాఖ మంత్రిగా వ్యవహరించారు. తాజా ఎన్నికల్లో ముయిజు గెలుపునకు సోలిహ్ తప్పులూ కారణమే. దేశానికి భారత్ నుంచి పెట్టుబడులు, అభివృద్ధి సాయం అందుతున్న మాట అటుంచి, ఓ చిన్న భారత సైనికదళాన్ని దేశంలోకి తెచ్చారన్న ప్రత్యర్థుల ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టలేకపోయారు. అలాగే, దేశాధ్యక్షుడయ్యేందుకు తనకు సాయపడ్డ బాల్యమిత్రుడు పార్టీని చీల్చి, కొత్త కుంపటి పెట్టే పరిస్థితి తెచ్చుకున్నారు. ఆ పార్టీ 7 శాతం ఓట్లు సాధించడం పెద్ద దెబ్బ అయింది.

భారత్ సంగతికొస్తే ఈ ఫలితాల్ని అతిగా అంచనా వేసినా తప్పే! అలాగని తక్కువగా అంచనా వేసినా చిక్కే!! భౌగోళిక సామీప్యం, ఉమ్మడి భద్రతా ప్రయోజనాలు, సాంస్కృతిక సాన్నిహిత్యం రీత్యా మాలేతో మనది లోతైన బంధం. కానీ, ఇండో– పసిఫిక్, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో చైనా తన ఛాయను విస్తరిస్తూ, ఆర్థిక – వ్యూహాత్మక గణితంలో మాలేను తెలివిగా భాగం చేసుకుంది. సోలిహ్ పాలనలో గణనీయంగా పెట్టుబడులు పెట్టి, 'గ్రేటర్ మాలే కనెక్టివిటీ ప్రాజెక్ట్' సహా అనేక ప్రాథమిక వసతులకు ఆర్థిక సాయం చేసిన భారత్ ఇప్పుడు చాకచక్యంగా వ్యవహరించాలి. మాలేతో మనది ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేని సుస్థిర బంధమని చాటాలి. కొత్త సర్కారుతో స్నేహానికి భారత విదేశాంగ విధాన వ్యవస్థ శ్రమించాలి. భారత వ్యతిరేక అపోహలు పోగొట్టేలా రాజకీయంగా అన్ని పార్టీలతో సుహృద్భావం పెంచుకోవాలి. ఇండియా పొడ గిట్టని యమీన్ రేపు మళ్ళీ తెర వెనుక చక్రం తిప్పుతారని భావిస్తున్న వేళ... కొత్త అధ్యక్షుడికి ఇప్పటికే అభినందనలు తెలిపిన భారత్ అంతటితో ఆగక మరింత ముందడుగు వేయాలి. హిందూ మహాసముద్రంలో మన వ్యూహాత్మక ప్రయోజనాలకు దెబ్బ తగలకపోవడమే ప్రాథమ్యం కావాలి!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.8.46 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మృగశిర రా.11.27 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.37 వరకు తదుపరి ప.2.37 నుండి 3.23 వరకు, **అమృత ఘడియలు:** ప.2.21 నుండి 4.02 వరకు.



సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.45
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

బిల్లు ఆమోదంతోనే సరిపోతుందా?

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహిళల శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా ఉపయోగించుకొనేందుకు బహుముఖ వ్యూహాలను అనుసరిస్తున్నారు. లింగ వైవిధ్యం కలిగిన రంగాలు వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇది చట్ట సభలకు సైతం వర్తిస్తుంది. ఎక్కువ మంది మహిళలు భాగస్వాములైతే – నేర, అవినీతిమయ స్వభావాల నుంచి ప్రేమ, వాత్సల్య స్వభావాలకు రాజకీయాలను మార్చడానికి దోహదపడుతుందని సామాజికవేత్తల అంచనా. మహిళా బిల్లు ఆమోదం పొందడం ఓ చరిత్రాత్మక ఘట్టమే. కానీ, ఈ చట్టం విజయవంతం కావాలంటే పార్టీల స్వరూప స్వభావాలు మారాలి. అన్ని పార్టీలూ మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి, వారి నాయకత్వాన్ని ప్రోత్సహించాలి.

చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఎట్టకేలకు పార్లమెంట్ ఆమోదం పొందడం దేశ చరిత్రలో మైలురాయి. పార్టీలకు అతీతంగా విస్తృత స్థాయిలో ఈ బిల్లుకు ఆమోదం లభించినందున రెండో దశలో కనీసం 15 రాష్ట్రాల అసెంబ్లీలు ఈ బిల్లుకు అడ్డు చెప్పేందుకు ఆస్కారం లేదు. ఆ ప్రక్రియ కూడా పూర్తయితే 2026 నుంచి రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. ఆ లోగా కులగణన, నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలు ముగియాలి. ఎంతో వ్యవధి పట్టే ఈ కార్యక్రమాలు 2026 లోపు పూర్తవుతాయా? అందుకే కాబోలు, కాంగ్రెస్ నేత ఒకరు ఈ బిల్లును 'పోస్ట్ డేటెడ్ చెక్'తో పోల్చారు. ప్రాంతీయ పార్టీలపై నెపాన్ని నెట్టి 2004–14 మధ్య పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును అటకెక్కించింది. ఆ విధంగా చూసినపుడు చెల్లని చెక్కు కంటే పోస్ట్ డేటెడ్ చెక్ మేలు కదా? తాము అధికారంలో ఉన్నప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేసే అవకాశాన్ని జారవిడుచుకొన్నామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ బిల్లులో ఓబీసీ మహిళలకు ఉపకోటా ఉండాలన్న డిమాండ్ దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు చేస్తున్నందున భవిష్యత్తులో అందుకు అవసరమైన సవరణలు జరుగుతాయనే ఆశించాలి.

భారతదేశంలో అనాది నుంచి మహిళల పట్ల భిన్నమైన దృక్పథాలు చూపడం కనిపిస్తుంది. ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు మహిళను మాతృమూర్తిగా చూపిస్తూ ఉన్నత స్థానాన్ని కల్పించాయి. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ సిరులు పండుతాయని భారతీయులు పవిత్రంగా భావించే వేదాలు ఘోషించాయి. అదే సమయంలో 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హసి' అంటూ మహిళల స్వేచ్ఛను అణచివేసే అనేక దురాగతాలు భారత ఉపఖండంలో జరిగాయి.

స్వాతంత్ర్యానంతరం వివిధ చట్టాల ద్వారా బాల్య వివాహాలు, సతీసహగమనం, వితంతు వివాహాల నిషేధం వంటి దురాచారాలను సరిదిద్దడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ చట్టాల కంటే సంప్రదాయాలకే మొగ్గుచూపే భారతీయ సమాజంలో చట్టాల వల్ల ఒనగూరిన ప్రయోజనం తక్కువే! చట్టాల అమలు కంటే ప్రజా చైతన్యం ద్వారా మొదలయిన సంస్కరణోద్యమాలు చక్కని ఫలితాలు అందించాయి. సావిత్రీబాయి ఫూలే మహిళా విద్య కోసం చేసిన కృషి, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి రచయితలు, సంఘసంస్కర్తలు తెలుగునాట వితంతు వివాహాలు జరగడానికి చేసిన కృషి చెప్పుకోదగ్గది. జాతీయోద్యమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడానికి గాంధీజీ కృషిచేశారు. ఆయన తన సతీమణి కస్తూర్బాను వివిధ ఉద్యమాలలో పాల్గొనేలా ప్రోత్సహించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలలో మహిళలు గణనీయ



సంఖ్యలో పాలుపంచుకొన్నారు. గొప్ప కవయిత్రిగా పేరు తెచ్చుకొన్న సరోజినీ నాయుడు గాంధీజీ చొరవతోనే అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలై, రాజకీయాలలో మహిళలు ప్రవేశించడానికి ప్రేరణగా నిలిచారు. ప్రపంచంలోనే అతిగొప్ప ఉద్యమాలలో ఒకటిగా చెప్పుకొనే తెలంగాణ సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రాంత గ్రామీణ పేద మహిళలు ప్రముఖ పాత్ర పోషించారు. వీరమహిళ చాకలి ఐలమ్మ ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారు. ఇందిరా గాంధీ, జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ, విజయరాజె సింధియా వంటి వారు రాజకీయాలలో మహిళలు చురుకైన భాగస్వామ్యం వహించడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

ఇక 1983లో నందమూరి తారక రామారావు మహిళలకు తండ్రి ఆస్తిలో సగభాగం దక్కేలా చట్టం చేయడం, స్థానిక సంస్థలలో తొలిసారిగా 9 శాతం రిజర్వేషన్లు అందించడం చారిత్రాత్మక ఘట్టాలుగానే పరిగణించాలి. ఆ తర్వాత డా. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా అమలు చేసిన మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, అభయహస్తం వంటి పథకాలు మహిళల్ని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని రకాల నామినేటెడ్ పదవులలో పార్టీ పరంగా 40 శాతంకు పైగా అందిస్తూ, చిత్తశుద్ధి ఉంటే మహిళలకు రిజర్వేషన్లే ఉండాలన్న నిబంధన అవసరం లేదని రుజువు చేశారు.

'జిందా తిలిస్మాత్' కాదు!

మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఒక్క ఎంఐఎం తప్ప పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడం విశేషం. దీనిని బట్టి ఆయా పార్టీలలో ఉన్న పురుషాధిక్యత తొలగిపోయిందనుకుంటే పొరపాటే! ముఖ్యంగా అధికార భారతీయ జనతా పార్టీ ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవడం ద్వారా మహిళల సమస్యలన్నింటినీ పరిష్కరించేసినట్లు ప్రచారం చేసుకొంటోంది. కాంగ్రెస్ పార్టీ, ఇంకా కొన్ని పార్టీలు తాము ఎక్కడ వెనకబడిపోతామో అనే భయంతో అసలు మహిళా బిల్లును ముందుకు తెచ్చింది 'మేమంటే మేము' అని తమను తామే అభినందించుకోవడం విడ్డూరం. చట్టసభలలో మహిళల సంఖ్య పెరిగినంత మాత్రాన వారికి సంబంధించిన సమస్యలన్నీ పరిష్కారం కాజాలవు. అదే నిజమైతే స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్లు పొందుతున్న మహిళలు తమ ప్రాంతాలలో ఏవైనా అద్భుతాలు సాధించారా? వారికి ఆ అవకాశం లభించకపోవడానికి కావడమేమిటి? జిల్లా పరిషత్‌ల పరిధిలో బాలికల విద్య, వైద్యం, ఉపాధికి సంబంధించి ఏవైనా ప్రత్యేక ప్రణాళికలు అమలు జరుగుతున్నాయా? ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు తగినన్ని మరుగుదొడ్లు లేనందున 'డ్రాపవుట్లు' ఎక్కువగా ఉంటున్నాయి. స్థానిక ప్రభుత్వాలలో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగినప్పటికీ ఎందువల్ల మహిళలకు సముచిత న్యాయం జరగడం లేదు? కొన్ని ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను మహిళల పేరిట అందజేస్తున్న మాట నిజమేగానీ, మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, గృహ హింస, మహిళల అదృశ్యం (ఉమెన్ ట్రాఫికింగ్) మొదలైన కేసుల్లో ఎంతో వెనుకబడి ఉన్నాం.

మహిళా బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడం ఓ చారిత్రాత్మక ఘట్టమే. కానీ, ఈ చట్టం విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీల స్వరూప స్వభావాలు మారాలి. సమ సమాజమే ధ్యేయం అని చెప్పుకొంటూ మహిళల సమస్యలపై ఉద్యమించడానికి ప్రత్యేక అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసుకొన్న కమ్యూనిస్టు పార్టీల పొలిట్ బ్యూరోలలో, సెంట్రల్ కమిటీలలో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రం. మహిళా బిల్లు ఘనత తమదేనని చాటుకొంటున్న బీజేపీ కార్యవర్గంలోకి 33 శాతం మంది మహిళల్ని ఎప్పుడు నియమిస్తారు? రాజకీయ పార్టీలలో ముందుగా భాగస్వామ్యం లేకుండా వారిని చట్టసభలకు పంపడం ఏ విధంగా సాధ్యపడుతుంది? మహిళా బిల్లు అమలు కావడానికి ఇంకా సమయం ఉంది కనుక, ఈలోపే అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి వారి నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. కీలకమైన పదవులలో వారికి స్థానం కల్పించాలి. ప్రతి నిర్ణయంలో వారికి భాగస్వామ్యం ఉండాలి. ఇదంతా ఓ సుదీర్ఘ ప్రక్రియ. ఇందుకు భారతీయ జనతా పార్టీతోపాటు అన్ని రాజకీయ పార్టీలు తగిన కార్యాచరణ చేపడితేనే, మహిళా సాధికారత పట్ల వారికున్న చిత్తశుద్ధి తేటతెల్లం అవుతుంది. ఈ రాజకీయ ప్రక్రియ లేకుండా మహిళా బిల్లును కేవలం ఓ 'స్కీమ్'లా అమలు చేయాలని చూస్తే ఫలితాలు అందవు. లేకుంటే, ఆపరేషన్ విజయవంతమేగానీ రోగి బతకలేదన్నట్టు ఇదొక ప్రహసనంలా మిగిలిపోతుంది.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే ముఖ్యం



తన తీరం నుంచి ఇండియా సైనికులు వెళ్లిపోవాలన్న మాల్దీవుల నిర్ణయాన్ని మనం గౌరవించాలి. కానీ ఈ విధానం చైనాకు కూడా వర్తింపజేయాలని ఇప్పుడూ, తర్వాతా నొక్కి చెప్పాలి. – హేవీమాన్ జాకబ్, ప్రొఫెసర్

జీవిత కథ



'ద కైట్ రన్నర్' నవల వచ్చి 20 ఏళ్ల యింది. ఈ నవల నాకు చాలా ప్రత్యేకమైనది. అది నా జీవితాన్ని మార్చేసింది. ఇంకా ముఖ్యంగా, అన్ని జాతులు, సంస్కృతుల పాఠకులకు అఫ్గాన్ జీవితాన్ని లోతుగా, సూక్ష్మంగా అర్థం చేసుకోవడంలో సాయపడింది. – ఖాలీద్ హొస్సేనీ, రచయిత

అద్భుత భారత్



ఇండియాలో మొదటిసారి ప్రదర్శన ఇవ్వడం అద్భుత అనుభవం! ఘన చరిత్ర, రుచికరమైన వంటలు, గొప్ప వాదనలు పంచుకున్నందుకు ఇండియాకు ధన్యవాదాలు. ఢిల్లీ, ముంబయిల్లోని షోలకు వచ్చి మరిచిపోలేకుండా చేసిన అందరికీ థాంక్యూ. బెంగళూరు! మన కథ ఇంకా కాలేదు. మరోసారి వస్తాను. దాన్ని గొప్ప షోగా చేద్దాం (అక్కడ షో రద్దయింది). – ట్రివర్ నోవా, దక్షిణాఫ్రికా కమెడియన్

బాధ్యత లేదా?



బెంగళూరులో ట్రివర్ నోవా షో రద్దవడానికి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సమస్యలుంటాయని అర్థం చేసుకోగలను. ప్రతి కళాకారుడికి నిర్దిష్టమైన అవసరాలుంటాయి. బాధ్యత గల కళాకారుడు ప్రదర్శనకు ముందే 'సౌండ్‌చెక్' చేసుకోవాలి. 'వేదిక రెక్కీ' జరపాలి. ట్రివర్ అవేమీ చేయకుండా నిర్లక్ష్యం చూపారు. అభిమానులు నష్టపోయారు. – రిక్కీ కేజ్, మ్యుజీషియన్

కారణాలు పట్టవా?



మహారాష్ట్ర, నాందేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఔషధాల కొరతతో 31 మంది నవజాత శిశువులు మరణించారు. ఇది వైద్యుల కన్నా, పరిపాలనా సంబంధ వైఫల్యం. సంఘటన వెనుక కారణాలు తెలుసుకోవాల్సింది పోయి, డీన్ డాక్టర్ శ్యామ్‌రావు వాకోడేతో (శివసేన) ఎంపీ హేమంత్ పాటిల్ టాయ్‌లెట్లు శుభ్రం చేయించారు. చూడ్డానికి కూడా బాధేసింది. దేశంలో వైద్యుల పరిస్థితి ఇలా ఉంది. – ధ్రువ్ చౌహాన్, వైద్యుడు

ఎవరికి అమ్మేస్తున్నారు?



రేపు ప్రపంచ కప్ మొదలవుతున్న నేపథ్యంలో.. మన దేశంలో జరిగే ఏ క్రికెట్ ఉత్సవ సందర్భంగానైనా తన వికృత రూపంతో తలెత్తే ఒక ప్రశ్న ఉంటుంది. టికెట్లు ఇచ్చే ప్రక్రియ, అది ఎలా ఒక సాధారణ అభిమానిని దోచుకుంటున్నది అనేది. ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో జారీ చేసే టికెట్ల ప్రక్రియ పారదర్శకంగా ఉంటోంది. అలాంటి ఒక మంచి విధానానికి మారడం అంత కష్టమా? – రాహుల్ రవీంద్రన్, నటుడు

ఏ వినాశనానికి?



చూస్తుంటే, సిక్కింలో తీస్తా నది మీద నిర్మించిన పూర్తి జలవిద్యుత్ ప్రాజెక్టు కొట్టుకుపోయినట్టుంది. 'జీఎల్ఓఎఫ్'(హిమానీ నదాల వల్ల ఉన్నట్టుండి వరద పోటెత్తడం) లేదా తీవ్ర వాతావరణంతో భారీ వినాశనం ఉండొచ్చని నిపుణులు 2013 లోనే హెచ్చరించారు. హిమాలయాలు భారీ మౌలిక సదుపాయాల కోసం కాదని మనం ఎప్పుడు నేర్చుకుంటాం? – బహార్ దత్, కన్జర్వేషన్ బయాలజిస్ట్

ఇన్ బాక్స్

ఓ ఆదివాసీ వీరనారి పోరాటం

మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి వీరమరణం పొందిన ఆదివాసీ వీరనారి రాణి దుర్గావతి. మధ్యప్రదేశ్‌లోని గోండు తెగకు చెందిన బుందేల్ ఖండ్ సంస్థానాధీశుడు చందవేల్‌కు 1524 అక్టోబర్ 5న దుర్గావతి జన్మించింది. దుర్గావతి భర్త దళపత్ షా గోండు రాజ్యాన్ని పాలిస్తూ మరణించాడు. కుమారుడు వీరనారాయణ్ మైనర్ కావడంతో దుర్గావతి గోండ్వానా రాజ్య పాలన చేపట్టింది. రాణి దుర్గావతి పైనా, ఆమె పాలిస్తున్న గోండ్వానా రాజ్య సంపద పైనా మనసు పారేసుకున్న అక్బర్ సేనాని ఖ్వాజా అబ్దుల్ మజీద్ అసఫ్ ఖాన్... అక్బర్ అనుమతిని తీసుకొని గోండ్వానాపై దండెత్తాడు. సుశిక్షితులైన వేలాది మొఘల్ సైనికులు ఒకవైపు, అసంఘటితమైన ఆదివాసీ సైన్యం ఒకవైపు యుద్ధ రంగంలో తలపడ్డారు. మొఘల్ సైన్యానికి ఆధునిక ఆయుధాలు ఉన్నాయి. కానీ ఆదివాసీ సైనికులకు సంప్రదాయ ఆయుధాలే దిక్కయ్యాయి.

మొఘల్ సైన్యం రాకను తెలుసుకున్న దుర్గావతి రక్షణాత్మకంగా ఉంటుందని భావించి 'నరాయ్' అనే ప్రాంతానికి చేరుకొంది. ఇక్కడ ఒకపక్క పర్వత శ్రేణులు ఉండగా మరోపక్క గౌర్, నర్మద నదులు ఉన్నాయి. ఈ లోయలోకి ప్రవేశించిన మొఘల్ సైన్యంపై గెరిల్లా దాడులకు దిగింది దుర్గావతి. ఇరువైపులా సైనికులు మరణించారు. దుర్గావతి ఫౌజ్‌దార్ అర్జున్ దాస్ వీరమరణం పొందాడు. ఆమె గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తే సైనికాధికారులు రాత్రి గుడ్డి వెలుతురులో ప్రత్యక్ష యుద్ధం చేయాలని సలహా ఇచ్చారు. మరుసటిరోజు ఉదయానికి పెద్ద తుపాకులను వాడమని మొఘల్ సైన్యాధికారి అసఫ్ ఖాన్ సైనికులను ఆదేశించాడు. రాణి ఏనుగునెక్కి మొఘల్ సైనికులపై విరుచుకుపడింది. యువరాజు వీర్ నారాయణ్ కూడా యుద్ధరంగంలోకి దూకి మొఘల్ సైనికులను మూడుసార్లు వెనక్కి తరిమాడు. కానీ అతడు తీవ్రంగా గాయపడడంతో సురక్షితమైన ప్రదేశానికి వెళ్లిపోయాడు. రాణి దుర్గావతికి కూడా చెవి దగ్గర బాణం తగిలి గాయపడింది. ఆ తర్వాత ఒక బాణం ఆమె గొంతును చీల్చివేసింది. వెంటనే ఆమె స్పృహ కోల్పోయింది. స్పృహ వచ్చిన తర్వాత ఆమె ఏనుగును తోలే మావటి యుద్ధ రంగం నుంచి సురక్షిత ప్రదేశానికి తప్పించుకు వెళదామని సలహా ఇచ్చాడు. ఆమెకు అపజయం ఖాయం అని అర్థమయ్యింది. శత్రువుకు భయపడి పారిపోవడం లేదా అతడికి చిక్కి మరణించడం అవమానకరం అని భావించి తన సురకత్తిని తీసుకుని పొడుచుకొని ప్రాణాలు వదిలింది రాణి. దీంతో ఒక మహోజ్వల ఆదివాసీ తార నేలకొరిగినట్లయ్యింది.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ,
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి
(నేడు రాణి దుర్గావతి 500వ జయంతి)

భారత్‌లో మైనార్టీలు భద్రంగా లేరా?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

భారతదేశంలో మైనార్టీల హక్కులకు భంగం కలుగుతోందని అమెరికా 'అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్' (యూఎస్‌సీఐఆర్ఎఫ్) భారత దేశ సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా రిపోర్టులను తయారు చేసిన విషయం ఈ దేశ ప్రజలలో చాలా మందికి తెలియదు. అమెరికా మత, రాజకీయ ప్రయోజనాలను కాపాడడం కోసం 1998లో అమెరికా ఫెడరల్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న ఒక సలహా సంస్థే ఈ యూఎస్‌సీఐఆర్ఎఫ్. అమెరికా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎక్కడ కార్యక్రమాలు జరిగినా, ఆగమేఘాలపై రిపోర్టులను తయారు చేసి, ఐక్యరాజ్యసమితి ముందు ప్రవేశపెట్టి, ప్రపంచంలోని సార్వభౌమాధికార దేశాలను ఇబ్బంది పెట్టడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. తాజాగా ఐక్యరాజ్యసమితిలో ఈ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ, భారత దేశంలో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు తదితర మైనార్టీ మతాలవారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, వారి కనీస హక్కులకు భంగం కలిగించేలా భారతదేశంలో పరిస్థితులు ఉన్నాయని పేర్కొనడం గమనార్హం.



గత ప్రభుత్వాలు ఉన్నప్పుడు అమెరికా ఆయిల్, ఫార్మా, డిఫెన్స్ లాబీయింగ్ యథేచ్ఛగా నిర్వహించి, తన దేశ ప్రయోజనాలను నెరవేర్చుకునేది. మోదీ ప్రభుత్వంలో ఇవి సాగడం లేదు. ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని భారతదేశం తనకు అనుకూలంగా మలుచుకుని, తక్కువ ధరలకు రష్యా నుండి ఆయిల్‌ను సమకూర్చుకోవడం, తక్కువ ధరలకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఆయుధాలను తూర్పు ఆసియా దేశాలకు అమ్మడం, కరోనా టీకాను ప్రపంచంలో అన్ని దేశాల కంటే ముందు ప్రవేశపెట్టడం ఇత్యాది విషయాలన్నీ అమెరికాకు కోపం తెప్పించేవే.

నిజంగా భారతదేశంలో మైనార్టీలు భద్రంగా లేరా అనే విషయాన్ని ఒకసారి పరిశీలిద్దాం. మొదట ముస్లింల సంగతి చూద్దాం. ప్రపంచంలో ఏ దేశంలో లేని భద్రత భారతదేశంలోని ముస్లింలకు ఉంది. వారి ఓటు బ్యాంకు కోసం అన్ని రాజకీయ పార్టీలూ సాగిలపడడం మనం చూస్తూనే ఉన్నాం! ఇక నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ముస్లింలకు భద్రత కరువైందని చెప్పడం ఒక దుష్ప్రచారం. వక్రబుద్ధితో కూడిన విష ప్రచారం. ఈ దేశంలో భద్రత లేకపోతే బర్మా, బంగ్లాదేశ్‌ల నుండి లక్షల సంఖ్యలో ముస్లింల అక్రమ వలసలు ఎందుకు జరుగుతున్నట్టు? 1947లో మతం ప్రాతిపదికగా ముస్లింలకు పాకిస్తాన్ ఏర్పాటయ్యింది అనేది వాస్తవం కాదా? అటువంటి పాకిస్తాన్‌లో మైనారిటీలైన హిందువుల పరిస్థితి ఎలా ఉందో ప్రపంచానికి తెలియని విషయమేమీ కాదు. ఇక క్రైస్తవుల విషయానికొస్తే – ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాలు క్రైస్తవ మెజార్టీ రాష్ట్రాలుగా ఎలా రూపుదిద్దుకున్నాయి? ఇక మోదీ ప్రభుత్వం ప్రభుత్వ పథకాల అమలు చేయడంలో మతపరమైన వివక్షతలను ఎక్కడా చూపడం లేదనే విషయం స్పష్టం. కాశ్మీరు లోయ నుండి 3 లక్షల మంది హిందువులను తరిమి వేయడం, అనేక మందిని హత్య చేయడం వంటి విషయాలను ఏనాడు ప్రశ్నించని అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ నిప్పు లేకుండానే పొగ ఎందుకు పెట్టింది అనే మర్మాన్ని ఈ దేశ ప్రజలు త్వరలోనే గ్రహిస్తారు.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

దానం – ధర్మం

ప్రతి మనిషి కష్టపడి తన బతుకును తాను బతకాలి. తనపై ఆధారపడిన వారిని కూడా పోషించాలి. వారి ఆలన పాలన సరిగా చూసుకోవాలి. దీనంతటికీ డబ్బు కావాలి. న్యాయమైన మార్గంలో డబ్బు సంపాదించాలి. అలా సంపాదించిన సొమ్ములో కొంతైనా దానధర్మాలకు వెచ్చించాలి. తరతరాలుగా ఇది పెద్దలు చెబుతూ వస్తున్న మాట. తాను కష్టపడి సంపాదించుకొన్న సొమ్ము అయినప్పటికీ, అనుకున్నది అనుకున్నట్లుగా జరిగి, చేసే పని సఫలం చెంది, సంపాదన తనది కావడం మాత్రం దైవ కృప లేకుండా జరుగదన్నది ఆ మాటల వెనక దాగి ఉన్న పరమార్థం. అందుచేతనే, భాగ్యవశాన సమకూడిన దైవకృపకు కృతజ్ఞతగా, సంపాదించుకున్న



సొమ్ములో తన శక్తి మేరకు దానధర్మాలకు వెచ్చించడమన్నది నియమంగా పెట్టుకొనడం మంచిదని పెద్దలు చెప్పారు.

అలా కాకుండా సంపాదించినదంతా 'నా సొంతకష్టంతోనే కాబట్టి, మొత్తాన్ని నేనే అనుభవిస్తాను, నా పొట్ట నేనే నింపుకుంటాను తప్ప దాన ధర్మాలకు ఖర్చు చేయను' అని అనుకుంటే, ఆ ఆలోచన సరైనది కాదని, అలా ఆలోచించి తదనుగుణంగా నడుచుకునే వ్యక్తి కంటె కాయకష్టం చేసి మనిషికి సహాయపడే మూగజీవాలు మేలైనవనే ఆలోచన కొన్ని శతాబ్దాల క్రితం నుండి ప్రజల మనసులలో ఆమోదం పొంది ఉంది. ఆ ఆలోచననే క్రీ.శ. 15–16 శతాబ్దాలకు చెందిన కవి కొఱవి గోపరాజు తాను రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యం, షష్ఠాశ్వాసంలోని ఈ కింది ఆటవెలది పద్యంలో చెప్పాడు.

దానధర్మములకు బూనక తన పొట్ట
నినుపుకొన దలంచు జనుడె పశువు
పసరమైన మెఱుగు బండియీడుచు దున్ను
నంతకంటె గష్టుదండ్రు బుధులు.

'దానం, ధర్మం అనే ఆలోచన ఏమాత్రం చేయకుండా, ఎప్పుడూ తన పొట్టను మాత్రమే నింపుకోవాలనే ఆలోచన చేసే వాడు... బండి లాగుతూ వ్యాపారస్థుడికీ, సగటు మనిషికీ, పొలం దున్నుతూ వ్యవసాయదారుడికీ ప్రతి రోజూ సాయపడే గోమహిష జాతిదైన మూగజీవి కంటె తక్కువైన వాడని పెద్దలు చెబుతారు' అని పై పద్యం భావం.

– భట్టు వెంకటరావు

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ


డాక్టర్ రమణప్రసాద్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు కిచెన్ సూపర్‌వైజర్, రెస్టారెంట్ కెప్టెన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించేందుకు తిరుపతిలోని తమ కళాశాలలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత పర్యాటక శాఖ, ఏపీ పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తమ కళాశాలను నిర్వహిస్తున్నామన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా తమ కళాశాలలో పైన పేర్కొన్న 2 కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత భోజనం, వసతి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. యువతీ యువకులకు వేర్వేరుగా వసతి సౌకర్యం ఉంటుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్‌తో పాటుగా 100% ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ లేదా ఐటీఐ ఉత్తీర్ణులై 18–28 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10లోగా 91609 12690 నంబర్‌కు సంప్రదించాలని చెప్పారు.

బీసీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలి

- రాష్ట్ర బీసీ శాసన సభ కమిటీ చైర్మన్ రమేష్ యాదవ్ వెల్లడి


రమేష్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

తిరుపతి సిటీ: అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ బీసీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాసన సభ కమిటీ చైర్మన్ రమేష్‌యాదవ్ రాజగొల్ల పేర్కొన్నారు. బుధవారం తిరుపతి శ్రీపద్మావతి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్‌రెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారుల కార్యాలయాల్లో వెనుకబడిన తరగతుల కులాలకు సంబంధించిన పోస్టుల భర్తీపై అమలు చేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. వెనుకబడిన తరగతులకు సంబంధించిన రోస్టర్ పాయింట్లలో అందుకు సంబంధించిన కేటగిరీ వారిని మాత్రమే నియమించాలని ఆదేశించారు. అనంతరం కమిటీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం కమిటీ చైర్మన్, సభ్యులు పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు. కాగా, రమేష్ యాదవ్ తొలుత తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎక్కడికైనా వస్తుంది.. కల్తీని పట్టేస్తుంది

ఆహార కల్తీ నివారణే లక్ష్యంగా 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్'

- రాష్ట్రంలో అందుబాటులోకి రానున్న మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్
- ఒక్కో వాహనం ఖరీదు రూ.45 లక్షలు
- రెండు దశల్లో 14 మొబైల్ ల్యాబ్స్ కొనుగోలు
- ఇందులో 80 రకాల పరీక్షలు చేసే అవకాశం


మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్



సాక్షి, అమరావతి: ఆహార కల్తీ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దుకాణాలు, హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో ఆహార కల్తీని సులభంగా గుర్తించేలా 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' పేరిట ల్యాబ్‌తో కూడిన మొబైల్ వాహనాలు త్వరలో రాష్ట్రంలో అందుబాటులోకి రానున్నాయి. వీటిద్వారా ఆహార కల్తీని అప్పటికప్పుడే కనిపెట్టే సౌకర్యం అందుబాటులోకి రాబోతుంది. రెండు దశల్లో 14 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. తొలి దశలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం రీజియన్‌లకు ఒక్కొక్కటి, స్టాండ్‌బై కింద ఒక వాహనం చొప్పున మొత్తం నాలుగు కొనుగోలు చేస్తున్నారు. ఇక రెండో దశలో 10 వాహనాలను కొనుగోలు చేయనున్నారు. రెండు దశల్లో 14 వాహనాలు అందుబాటులోకి వచ్చాక ఉమ్మడి 13 జిల్లాల ప్రాతిపదికన పాత జిల్లా కేంద్రంలో ఒక్కొక్క వాహనాన్ని అందుబాటులో ఉంచనున్నారు. ఒక్కో వాహనం కొనుగోలుకు రూ.45 లక్షల చొప్పున ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. తొలి దశలో 4 వాహనాల కొనుగోలుకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఐడీసీ) టెండర్లు ఆహ్వానించింది.

ప్రతి వాహనంలో 80 రకాల పరీక్షలు

మొబైల్ ఫుడ్ టెస్టింగ్ వాహనంలో 80 రకాల పరీక్షలు చేసే సౌకర్యం ఉంటుంది. పాల కల్తీని నివారించడానికి యూరియా, డిటర్జెంట్, ఇతర రసాయనాలను కలిపారా? లేదంటే పాలల్లో కొవ్వు, సాలిడ్ నాట్ ఫ్యాట్ (ఘన పదార్థాలు) స్థాయిలను తెలుసుకోవడానికి మిల్క్ అనలైజర్ అందుబాటులో ఉంటుంది. హోటళ్లు, రెస్టారెంట్‌లలో వాడిన వంట నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారేమో తెలుసుకోవడానికి టీపీసీ, ఆహార పదార్థాల తయారీలో ఫుడ్ కలర్స్ ఆనవాళ్లు పసిగట్టడానికి, ఉప్పులో అయోడిన్ వంటి పరీక్షలు చేయడానికి మ్యాజిక్ బాక్స్, టిష్యూపేపర్ టెస్ట్‌లు మొబైల్ ల్యాబ్‌లో నిర్వహించవచ్చు. డిజిటల్ మల్టీ పారామీటర్, హ్యాండ్ మిల్లీమీటర్ (పీహెచ్ కండెక్టివిటీ, టీడీఎస్, టెంపరేచర్), డిజిటల్ రీ ఫ్యాక్టో మీటర్, డిజిటల్ బ్యాలెన్స్, హాట్ ప్లేట్, హాట్ ఎయిర్ ఓవెన్, రాపిడ్ మిల్క్ స్క్రీనింగ్ తదితర పరికరాలు ఉంటాయి. ఫుడ్ పాయిజన్, డయేరియా వంటి ఘటనల్లో నీటిలో బ్యాక్టీరియా ఆనవాళ్లను గుర్తించడానికి శాంపిళ్లను నిర్దేశిత టెంపరేచర్‌లో భద్రపరిచి సెంట్రల్ ల్యాబ్‌కు తరలించడానికి వీలుంటుంది.

కల్తీ నియంత్రణ చర్యల్లో భాగంగా..



ఆహార కల్తీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. కల్తీని తక్షణమే పసిగట్టి బాధ్యులపై చర్యలు తీసుకునే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న విధానంలో శాంపిళ్లు సేకరించి ల్యాబ్స్‌కు పంపి పరీక్షించి ఫలితాలు రావడానికి సమయం పడుతోంది. ఈ కాలయాపనకు ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్‌తో చెక్ పడుతుంది. పాఠశాలలు, హాస్టళ్లు, ఇతర ప్రదేశాల్లో ఫుడ్ పాయిజన్, డయేరియా కేసులు నమోదైనప్పుడు సత్వరమే స్పందించడానికి మొబైల్ ల్యాబ్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి.
– జె.నివాస్, కమిషనర్, రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ

కౌశల్-2023 పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీసీవోఎస్టీ మెంబర్ సెక్రటరీ అపర్ణ తదితరులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీఓఎస్టీ), భారతీయ విజ్ఞాన మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న కౌశల్–2023 పోస్టర్‌ను ఏపీసీఓఎస్టీ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. అపర్ణ బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని అన్నింటా ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌశల్ రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటూ అత్యంత ప్రతిభను కనబరుస్తున్న తీరు ఎంతో హర్షణీయమన్నారు. భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ కాస్ట్ ఈ సంవత్సరం కూడా పోటీలను దిగ్విజయంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ జేడీ రావు, కౌశల్ కోఆర్డినేటర్లు స్వర్ణ వెంకటేశ్వరరావు, పద్మావజి, డాక్టర్ రావి అరుణ, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ నటి మెహరీన్



తిరుమల: తిరుమల శ్రీవారిని సినీనటి మెహరీన్ బుధవారం దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్న వారిలో సినీ నటుడు విక్రాంత్ తదితరులు ఉన్నారు. కాగా, డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది.

'అవినీతి' ఖైదీ బాబుకు మద్దతు సిగ్గుచేటు

1,102వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అవినీతి, అక్రమాల కేసుల్లో అరెస్టై రాజమండ్రి జైల్లో ఉన్న ఖైదీ చంద్రబాబుకు అమరావతి ఉద్యమ నేతలమని చెప్పుకుంటున్న కుహనావాదులు మద్దతు తెలపడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,102వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. 29 గ్రామాల అభివృద్ధిని ఓ కులానికీ, ఓ పార్టీకి తాకట్టు పెట్టిన కులవాదులతో నడిచిన ఫేక్ ఉద్యమం ఆంతర్యం ఏమిటో రాజమండ్రి ఖైదీకి మద్దతుగా వెళ్లినపుడే ప్రజలకు అర్థమైందన్నారు. కోట్ల రూపాయలు ఖర్చుచేసి పెయిడ్ ఆర్టిస్టులను పెట్టి బాబు చేసిన అవినీతి దందా భాగోతం బట్టబయలయ్యిందని చెప్పారు. సూట్‌కేసులు తీసుకొని బాబుకు వత్తాసు పలుకుతున్న పావలాకళ్యాణ్.. రాజధానిలో బహుజనులకు జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ రికమండేషన్‌తో రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను చేర్చారనే చులకన వ్యాఖ్యలు చేసి..బహుజనుల దేవుడిని కించపరిచిన పవన్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు. నాయకులు పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్

- ఫార్మా కంపెనీలో బాయిలర్ ఏర్పాటుకు రూ.5.50 లక్షలు డిమాండ్
- రూ.2.10 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


నగదు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నాగభూషణం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్‌జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొండపల్లి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియా (ఐడీఏ)లో ఏసీబీ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడి చేశారు. స్థానిక సెంటారస్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో నూతన బాయిలర్ ఏర్పాటు అనుమతులకు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సత్యనారాయణ అసిస్టెంట్ నాగభూషణం రూ.2.10 లక్షలు నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సెంటారస్ ఫార్మా కంపెనీలో నూతన బాయిలర్ ఏర్పాటుకు కంపెనీ యజమాని బాలిరెడ్డి అర్జీ పెట్టుకోగా అనుమతులు ఇచ్చేందుకు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రూ.5.50 లక్షలు డిమాండ్ చేశాడు. రూ.3.50 లక్షలు ఇచ్చేందుకు బాలిరెడ్డి ఒప్పందం కుదుర్చుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు ఇచ్చిన నగదు రూ.2.10 లక్షలను సత్యనారాయణ అసిస్టెంట్ నాగభూషణం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయంపై ఏసీబీ అడిషనల్ ఎస్పీ స్నేహిత మాట్లాడుతూ బాయిలర్ ఫిటింగ్ చార్జీలు రూ.లక్ష, అదనంగా మరో 1.10 లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. నాగభూషణం చెప్పిన వివరాల మేరకు సత్యనారాయణను కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఏసీబీ డీఎస్పీ శరత్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకటగిరి పోలేరమ్మ జాతర



పోలేరమ్మ అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తులు

సైదాపురం(వెంకటగిరి)(తిరుపతి జిల్లా): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర బుధవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వెంకటగిరి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ సారి కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారి నగరోత్సవం కార్యక్రమానికి భక్తులు పెద్దెత్తున తరలివచ్చారు. అత్తిగారిల్లు అయిన చాకలి చావడి నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు అమ్మవారిని తీసుకుని వచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల్లో స్థిరపడిన వెంకటగిరీయులు సైతం జాతరకు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాలుగో రోజు క్రాకర్స్ షో అత్యంత వైభవంగా నిర్వహించారు.

సీఎం చొరవతో యువకుడికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్

కోలుకున్న యువకుడికి ఉద్యోగం ఇచ్చేందుకు చర్యలు


కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలసిన రోగి శ్రీనివాసరావు, అతని తల్లి మార్తమ్మ

ఒంగోలు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఒక పేద యువకుడికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగి ప్రాణాలు నిలబడ్డాయి. బుధవారం ఆ యువకుడు తల్లితో కలిసి ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వి.మార్తమ్మకు ఇద్దరు కుమారులు. భర్త మరణించడంతో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పెద్ద కుమారుడు శ్రీనివాసులు బీఎస్సీ నర్సింగ్ చేశాడు. అతనికి కిడ్నీ పూర్తిగా చెడిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం కార్యక్రమంలో పాల్గొనేందుకు మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసుకున్నారు. స్పందించిన ముఖ్యమంత్రి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించడంతో మార్తమ్మ కిడ్నీని వైద్యులు ఆమె కుమారుడికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. దీంతో కోలుకున్న కుమారుడితో తల్లి మార్తమ్మ బుధవారం కలెక్టర్‌ను కలిసి.. ఒక కిడ్నీతో గతంలో మాదిరి శారీరక శ్రమ చేయలేడని, ఉద్యోగం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరింది. స్పందించిన కలెక్టర్.. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం కూడా అందిస్తామని భరోసా ఇచ్చారు.

అమ్మ ఒడికి చేరిన పసికందు

24 గంటల్లో కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు


చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్

పట్నంబజారు: గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో కిడ్నాప్ అయిన ఎనిమిది రోజుల పసికందును 24 గంటల్లో పోలీసులు తల్లి ఒడికి చేర్చారు. జీజీహెచ్‌లోని 106వ వార్డులో గుంటూరు కొబ్బరికాయల సాంబయ్యకాలనీకి చెందిన షేక్ రోష్ని బిడ్డను మంగళవారం ఒక గుర్తుతెలియని మహిళ అపహరించుకెళ్లింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగారు. సీసీ ఫుటేజీ ద్వారా ఆ మహిళ ఆస్పత్రి ఎదుట ఎక్కిన ఆటో నంబరు తెలుసుకుని, దాని ఆధారంగా డ్రైవర్ శ్రీనివాస్‌ను పట్టుకుని విచారించారు. మహిళను పల్నాడు మార్కెట్ సెంటర్‌లో వదలిపెట్టినట్లు అతడు చెప్పటంతో సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ ప్రారంభించిన పోలీసులు ఆమె నరసరావుపేట బస్సు ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. ఈ అపహరణ విషయం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. పసికందును ఎత్తుకెళ్లిన మహిళ ఫొటో బహిర్గతమైంది. ఈ క్రమంలో నరసరావుపేట రూరల్ పరిధిలో ఉప్పలపాడు ప్రాంతంలోని నాయుడుపేటలో ఆ మహిళను గుర్తించిన ఒక వలంటీర్ కొత్తపేట పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళను కంభాల లక్ష్మిగా గుర్తించారు. కిడ్నాప్ చేసిన పసికందును అదే ప్రాంతంలో పిల్లల్లేని సమీప బంధువు వెంకటేశ్వరమ్మకు ఇచ్చినట్లు గుర్తించారు. ఆ చిన్నారిని తమ చేతుల్లోకి తీసుకుని సురక్షితంగా గుంటూరు జీజీహెచ్‌కి తీసుకొచ్చారు. గుంటూరు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ, జీజీహెచ్ సూపరింటెండెంట్ వై.కిరణ్‌కుమార్ ఆ చిన్నారిని బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసులను అభినందించారు.

నేదురుమల్లి పద్మనాభరెడ్డి కన్నుమూత


పద్మనాభరెడ్డి (ఫైల్)

వాకాడు: రాజకీయ భీష్ముడు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీజీసీ సభ్యుడు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి (91) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. దీంతో ఈ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. పద్మనాభరెడ్డి మృతికి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన పెదనాన్న మరణవార్త తెలియగానే వెంకటగిరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి వాకాడు చేరుకున్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎల్లసరి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, పీఏసీసీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.


వైఎస్ కుటుంబంతో విడదీయరాని బంధం

పద్మనాభరెడ్డికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతో విడదీయరాని బంధం ఉంది. వైఎస్సార్ పాదయాత్రలో పద్మనాభరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలో వైఎస్సార్‌ను వాకాడులోని తన నివాసానికి తీసుకొచ్చారు. రాజశేఖరరెడ్డి మరణం తర్వాత తాను ఎంతో ప్రేమించే వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ఓదార్పు యాత్రలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలో రెండుసార్లు పద్మనాభరెడ్డి ఇంట్లో జగన్‌మోహన్‌రెడ్డి బసచేశారు. ఈ తరుణంలో తన వర్గంతోపాటు కుమారుడు నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డితో కలిసి పద్మనాభరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి కష్టపడి పనిచేస్తున్న పద్మనాభరెడ్డికి సీజీసీ సభ్యుడిగా పార్టీ సముచిత స్థానం కల్పించింది. ఆయన కుమారుడికి మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించింది. ఇటీవల తన ఇంట్లో బాత్‌రూములో కాలుజారి పడిన పద్మనాభరెడ్డి అప్పటినుంచి అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటూ తుది శ్వాస విడిచారు.

నానో ప్రపంచం దగ్గరయింది

క్వాంటమ్ డాట్స్‌తో బహుముఖ ప్రయోజనాలు

బంగారం ఏ రంగులో ఉంటుందో తెలుసు కదా? ముదురు పసుపునకు కొంత కాంతి చేరిస్తే ఉండే రంగు. కానీ, ఇదే బంగారాన్ని నానోస్థాయిలో.. అంటే మన వెంట్రుకలో పదివేల వంతు సూక్ష్మస్థాయిలో చూస్తే దాని రంగు ఎరుపు లేదా వంగపూతగా కనిపిస్తుంది! అదెలా అని ఆశ్చర్యపోనవసరం లేదు. ఇలా నానోస్థాయిలో పదార్థాల ధర్మాల ఆసరాతో అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ తయారీకి మార్గం చూపిన శాస్త్రవేత్తలకు ఈ ఏడాది రసాయన శాస్త్ర నోబెల్ బహుమతి దక్కిందని మాత్రం తెలుసుకోవాలి! ఆ విశేషాలేమిటో చూసేద్దాం..


అలెక్సీ ఎకిమోవ్

క్వాంటమ్ డాట్స్ తయారీకి బాటలు

నానోటెక్నాలజీ మనకేమీ కొత్త కాదు. చాలా కాలంగా వేర్వేరు రంగాల్లో వాడకంలో ఉన్నదే. స్పష్టమైన, పలుచని ఎల్ఈడీ స్క్రీన్ల తయారీ మొదలుకొని శరీరంలోని కేన్సర్ కణితులను కత్తిరించడం వరకూ రకరకాలుగా నానో టెక్నాలజీ ఉపయోగపడుతోంది. ఈ అత్యద్భుతమైన టెక్నాలజీ ఆవిష్కరణలకు బీజం వేసిన క్వాంటమ్ డాట్స్‌ను తయారు చేసేందుకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేశారు కాబట్టే స్వీడిష్ నోబెల్ అవార్డు కమిటీ.. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన మౌంగి బావెండీ, కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్త లూయిస్ బ్రూస్, నానో క్రిస్టల్స్ టెక్నాలజీ ఇన్‌కార్పొరేషన్‌కు చెందిన అలెక్సీ ఎకిమోవ్‌లకు ఈ ఏడాది రసాయన శాస్త్ర నోబెల్ అవార్డు ప్రకటించింది.

సూక్ష్మస్థాయి కణాల ఉత్పత్తి

రసాయన శాస్త్రం చదువుకున్న వారు ఎవరికైనా మూలకాల ధర్మాలు వాటిలోని ఎలక్ట్రాన్ల సంఖ్యపై ఆధారపడి ఉంటాయని తెలిసే ఉంటుంది. అయితే మూలకం నానోస్థాయికి చేరిందనుకోండి... సాధారణ స్థితిలో ఉండే ధర్మాల స్థానంలో క్వాంటమ్ స్థాయి తాలూకా ప్రభావం కనిపించడం మొదలవుతుంది. మూలకం సైజును బట్టి ఈ ధర్మాలుంటాయి. ఉదాహరణకు పైన చెప్పుకున్న బంగారం రంగు! అలాగే సైజును బట్టి మూలకాల యాంత్రిక, ఉపరితల, అయస్కాంత, ఎలక్ట్రానిక్, ఆప్టికల్, ఉత్ప్రేరక ధర్మాలు కూడా మారిపోతాయి. సాధారణ సైజులో విద్యుత్తు ప్రవాహాన్ని అడ్డుకోని పదార్థాలు సైజు తగ్గుతున్న కొద్దీ సెమీ కండక్టర్లుగా మారిపోవచ్చు. మరికొన్ని పదార్థాలు సాధారణ సైజులో సెమీకండక్టర్లుగా ఉన్నప్పటికీ నానోస్థాయిలో సూపర్ కండక్టర్లుగా వ్యవహరించవచ్చు. ఇంతటి సూక్ష్మస్థాయిలో ఉండే కణాలను ఉత్పత్తి చేయడంలో ఈ ఏటి రసాయన శాస్త్ర నోబెల్ అవార్డు గ్రహీతలు విజయం సాధించారు. నానో ప్రపంచంలో మూలకాల ధర్మాలు మారిపోతాయని చాలాకాలంగా తెలుసు కానీ..



మౌంగి బావెండీ

వీటితో వాస్తవిక ప్రయోజనం తక్కువని అనుకునేవారు. 1980లో అలెక్సీ ఎకిమోవ్ రంగుల గాజులో క్వాంటమ్ ఎఫెక్ట్‌ను సృష్టించడంలో విజయం సాధించారు. కణం సైజు ఆధారంగా రంగు మారుతుందని ఆయన నిరూపించడంతో క్వాంటమ్ డాట్స్‌పై ఆసక్తి పెరిగింది. కొన్నేళ్ల తరువాత ఒక ద్రవంలో స్వేచ్ఛగా కదులుతున్న కణాల సైజుకు అనుగుణంగా క్వాంటమ్ ఎఫెక్ట్స్ మారుతాయని మొట్టమొదటిసారి నిరూపించగలిగారు.

భవిష్యత్తులో సురక్షితమైన సమాచార వ్యవస్థ!

1993లో మౌంగి బావెండీ రసాయనికంగా క్వాంటమ్ డాట్స్‌ను ఉత్పత్తి చేయడం మొదలు పెట్టడంతో వీటిని మన ప్రయోజనాలకు వాడుకోవడం సులువు అయ్యింది. ఇప్పుడు మన కంప్యూటర్ మానిటర్లు, క్యూఎల్ఈడీ స్క్రీన్‌లో విస్తృత స్థాయి రంగులు వెదజల్లడం ఈ క్వాంటమ్ డాట్స్ పుణ్యమే. అలాగే మన ఎల్ఈడీ బల్బుల రంగులు మారడానికి కూడా ఇవే కారణం. శరీరంలోని కణజాలాన్ని స్పష్టంగా గుర్తించేందుకు బయో కెమిస్టులు, వైద్యులు ఇప్పుడు క్వాంటమ్ డాట్స్‌ను వాడుతున్నారు. భవిష్యత్తులో ఈ క్వాంటమ్ డాట్స్ ద్వారా ఎటు కావాలంటే అటు మడిచే సుకోగల ఎలక్ట్రానిక్స్, అతి సూక్ష్మమైన సెన్సార్లు, పలుచటి సోలార్ సెల్స్ తయారీతో పాటు అత్యంత సురక్షితమైన సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసుకునేందుకూ ఉపయోగపడుతుందని అంచనా.

– సాక్షి, నేషనల్ డెస్క్


లూయిస్ బ్రూస్

క్వాంటమ్ డాట్స్‌పై పరిశోధనలకు నోబెల్

రసాయన శాస్త్రంలో ముగ్గురు అమెరికా సైంటిస్టులకు ప్రతిష్టాత్మక బహుమతి

స్టాక్‌హోమ్: రసాయన శాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతిని 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' బుధవారం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక బహుమతి ఈసారి ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలను వరించింది. నానో టెక్నాలజీకి సంబంధించిన క్వాంటమ్ డాట్స్ ఆవిష్కరణలో పరిశోధనలకు గాను మౌంగి బావెండీ, లూయిస్ బ్రూస్, అలెక్సీ ఎకిమోవ్‌లకు రసాయన శాస్త్ర నోబెల్ ప్రైజ్ లభించింది. క్వాంటమ్ డాట్స్ విశ్లేషణ, ఆవిష్కరణలో, నానో పార్టికల్స్ అభివృద్ధిలో ఈ ముగ్గురు సైంటిస్టులు కీలక పాత్ర పోషించారని నోబెల్ కమిటీ తెలియజేసింది. 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' అధికారికంగా విజేతల పేర్లు ప్రకటించకముందే ముగ్గురు సైంటిస్టుల పేర్లను స్వీడన్ మీడియా సంస్థలు బహిర్గతం చేయడం కలకలం రేపింది.

ఢిల్లీ మద్యం కేసులో 'ఆప్' ఎంపీ అరెస్ట్

- సంజయ్ సింగ్‌ను నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న అధికారులు
- బీజేపీవి ప్రతీకార రాజకీయాలు: ఆప్

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి మరో షాక్ తగిలింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం అరెస్ట్ చేసింది. ఈ కుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఉదయం నుంచి 10 గంటలకు పైగా ఎంపీ నివాసంలో ఈడీ సోదాలు జరిపింది. అనంతరం సా యంత్రం ఆయనను అదుపులోకి తీసుకుంది. ఈడీ కార్యాలయంలో ఆయన వాంగ్మూలం నమోదు చేశారు. గురువారం మ ధ్యాహ్నం కోర్టులో ప్రవేశపెట్టి విచారణ నిమిత్తం కస్టడీ కోరే అవకాశముంది. ఇప్పటికే ఇద్దరు ఆప్ అగ్ర నేతలైన మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టయిన సంగతి తెలిసిందే. జైన్‌ను 2022 మేలో మనీ లాండరింగ్ కేసులో, సిసోడియా ఈ ఏడాది ఫిబ్రవరిలో మద్యం కేసులో అరెస్టయ్యారు. మద్యం కేసులో ఇప్పటికే అరెస్టై అప్రూవర్ గా మారిన దళారీ దినేశ్ అరోరా స్టేట్ మెంట్ ఆధారంగా సంజయ్ అరెస్టు జరిగింది. ఆయనను 2020లో ఒక రెస్టారెంట్ లో కలిశానని అందులో అరోరా చెప్పారు. ''ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ కు నిధుల కోసం రెస్టారెంట్ యాజమానుల నుంచి ఫండ్స్ సేకరించాల్సిందిగా సంజయ్ నన్ను కోరారు. ఆ మీదట ఆయనకు రూ.82 లక్షలకు చెక్ ఇచ్చా. అమిత్ అరోరా అనే అతను మద్యం దుకాణాన్ని సంజయ్ సింగ్ ద్వారా అప్పటి ఎక్సయిజ్ మంత్రి మనీశ్ సిసోడియాకు చెప్పి షిఫ్ట్ చేయించా'' అని చెప్పారు. కేజ్రీవాల్ ను కూడా ఒకసారి ఆయన నివాసంలోనే కలిశానని, సియోసియతో నాలుగైదుసార్లు ఫోన్లో మాట్లాడనని అన్నారు.


ఎంపీ సంజయ్ సింగ్‌ను అరెస్ట్‌చేసి తీసుకెళ్తున్న దృశ్యం

అవినీతిని ప్రశ్నించినందుకే: ఆప్

సంజయ్ అరెస్టును ఆప్ తీవ్రంగా ఖండించింది. అదానీ గ్రూప్ అవినీతి తదితరాలపై పార్లమెంట్‌లో గళమెత్తినందుకే ఆయనను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించింది. 2024 లోక్ సభ ఎన్నికల్లో ఓటమి తథ్యమని తేలడంతో బీజేపీ ఇలాంటి పనులకు దిగిందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ దుయ్యబట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇలాంటి అరెస్టులు ఇంకా చాలా జరుగుతాయని జోస్యం చెప్పారు. తాము బెదిరేది లేదన్నారు. ''మద్యం విధానంలో కుంభకోణం జరిగిందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. వెయ్యి సార్లకు పైగా సోదాలు, ఎన్నో అరెస్టులు చేశారు. కానీ ఇప్పటిదాకా ఒక్క పైసా కూడా రికవర్ కాలేదు. నిన్న జర్నలిస్టులను కూడా ఇలాగే అక్కసుతో నిర్బంధించారు'' అని మండిపడ్డారు. సంజయ్ నివాసంలోనే గాక స్వగ్రామంలో, ఆఫీస్ లో, ఇంకెక్కడ సోదాలు చేసినా ఏమీ దొరకదని ఆప్ నేతలు అన్నారు. విపక్ష ఇండియా కూటమి నేతలు కూడా అరెస్టును ఖండించారు. ఇలాంటి చర్యలు విపక్ష కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు.

ఇక కేజ్రీవాల్ వంతు: బీజేపీ

ఆప్, విపక్షాల విమర్శలను బీజేపీ తోసిపుచ్చింది. మద్యం కుంభకోణానికి కేజ్రీవాలే సూత్రధారి అని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. 'ఆయన కుడి భుజం సిసోడియా ఇప్పటికే జైల్లో ఉన్నారు. ఇప్పుడు ఎడమ భుజం సంజయ్ అదే బాట పట్టారు. ఇక కేజ్రీవాల్ చేతులకూ బేడీలు పడే రోజులు ఎంతో దూరం లేవు' అని జోస్యం చెప్పారు.

'ఉజ్వల' లబ్ధిదారులకు మరో రూ.100 రాయితీ

ఒక్కో సిలిండర్‌పై రూ.300కు చేరిన రాయితీ



న్యూఢిల్లీ: 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' కింద వంట గ్యాస్ సిలిండర్లపై రాయితీని మరో రూ.100 పెంచాలని కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయించింది. దీంతో ఒక్కో సిలిండర్‌పై మొత్తం రాయితీకి రూ.300కు చేరుకుంది. ఉజ్వల యోజన కింద కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా 12 రాయితీ సిలిండర్లు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ (14.2 కిలోలు)పై రూ.200 చొప్పున కేంద్రం రాయితీ ఇస్తోంది. ఈ రాయితీని మరో రూ.100 పెంచినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా 9.6 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని తెలియజేశారు. ఉజ్వల పథకం లబ్ధిదారులు ప్రస్తుతం ఒక్కో సిలిండర్ కోసం రూ.703 ఖర్చు చేస్తున్నారు. ఇకపై రూ.603 చొప్పున వెచ్చించాల్సి ఉంటుంది. త్వరలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. తాము అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఉజ్వల యోజన లబ్ధిదారులకు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మరో రూ.100 పెంచడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సోనియాకు రాహుల్ సర్‌ప్రైజ్ గిఫ్ట్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన తల్లి సోనియాగాంధీకి ఒక సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. ఒక బుజ్జి కుక్క పిల్లను కానుకగా ఇచ్చారు. ఆ కుక్క పిల్లకి నూరీ అని పేరు పెట్టారు. బుధవారం ప్రపంచ జంతు దినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లి సోనియాకు కుక్కపిల్లని ఇచ్చి ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఇదంతా వీడియో తీసి యూట్యూబ్‌లో ఉంచారు. అమ్మకి ఒక సర్‌ప్రైజ్ అంటూ రాహుల్ గాంధీ సోనియాను బయటకు తీసుకురావడంతో వీడియో మొదలవుతుంది. రాహుల్ ఇచ్చిన బాక్స్ తీసి చూసిన సోనియా గాంధీ అందులో బుజ్జి కుక్క పిల్ల ఉండడంతో సంతోషంతో ఉప్పొంగిపోయారు. చాలా క్యూట్‌గా ఉందంటూ మురిసిపోయారు. ఇప్పుడు తమ కుటుంబంలోకి మరో సభ్యురాలు వచ్చిందంటూ రాహుల్ చెబుతున్నారు. జాక్ రస్సెల్ టెర్రియర్ జాతికి చెందిన ఈ ఆడకుక్క పిల్లను రాహుల్ గోవా నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చారు.

భారత వాయుసేనలోకి తేజస్



సాక్షి, బెంగళూరు: భారత వాయుసేన అమ్ముల పొదిలో మరో కొత్త అస్త్రం చేరింది. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) మొట్ట మొదటి రెండు సీట్లున్న తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌ను బుధవారం భారత వైమానిక దళానికి అప్పగించింది. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ పాల్గొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ తయారీ రంగాన్ని రక్షణ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఏఎల్ కృషిని ఆయన కొనియాడారు. ప్రపంచ స్థాయి విమానాల డిజైన్, అభివృద్ధి తయారీలో మన దేశానికి అమోఘమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని గుర్తు చేశారు. భారత వాయుసేనలో శిక్షణ ఇవ్వడానికి తేజస్ అన్ని రకాల సామర్థ్యాలు కలిగి ఉందని, అవసరమైతే యుద్ధ రంగంలో కూడా సేవలు అందిస్తుందని హాల్ వెల్లడించింది. తక్కువ బరువు కలిగి ఉండి అన్ని రకాల వాతావరణాలను తట్టుకోగలిగిన 4.5 జనరేషన్‌కు చెందిన యుద్ధ విమానం తేజస్. రెండు సీట్లు ఉండేలా డిజైన్ చేయడం వల్ల అప్పుడే వాయుసేనలో అడుగు పెట్టిన పైలెట్లకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడుతుంది.

వాతావరణ మార్పులతో కోట్ల డాలర్ల నష్టం

న్యూఢిల్లీ: వాతావరణంలో వస్తున్న భారీ మార్పులు ప్రపంచ దేశాలను ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాయి. ప్రకృతి విపత్తుల కారణంగా ప్రపంచంలోని మౌలిక సదుపాయాల రంగంలో ఏడాదికి సగటున 30,000వేల కోట్ల డాలర్ల నుంచి 33 వేల కోట్ల డాలర్ల వరకు నష్టం వస్తోందని కొయిలేషన్ ఫర్ డిజాస్టర్ రెసిలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ) నివేదిక వెల్లడించింది. ఆరోగ్యం, విద్యా రంగానికి సంబంధించిన భవంతులు ఇతర సదుపాయాలకు జరిగిన నష్టాన్ని కూడా చేరిస్తే 73,200 కోట్ల డాలర్ల నుంచి 84 వేల కోట్ల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. 2021–22లో ప్రపంచ స్థూల ఆదాయం పెరుగుదలలో ఈ నష్టం ఏడో వంతు వరకు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

రణ్‌బీర్‌కపూర్‌కు ఈడీ సమన్లు



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు రణ్‌బీర్‌కపూర్ ఆన్‌లైన్ గేమింగ్ ఉచ్చులో చిక్కుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నమోదైన మహదేవ్ బెట్టింగ్ యాప్ మనీ ల్యాండరింగ్ కేసుకు సంబంధించి శుక్రవారం విచారణకు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రణ్‌బీర్‌కు సమన్లు జారీ చేసింది. బెట్టింగ్ యాప్ గురించి ఆన్‌లైన్‌లో ప్రచారకర్తగా ఉన్న రణ్‌బీర్‌కపూర్‌కు ప్రమోటర్ల నుంచి హవాలా మార్గంలో డబ్బులు అందాయని ఈడీ అధికారులు ఆరోపించారు. రాయపూర్‌లో ఉన్న ఈడీ కార్యాలయానికి ఈ నెల 6న హాజరు కావాలని రణ్‌బీర్‌కపూర్‌కు సమన్లు పంపినట్టుగా వెల్లడించారు. మహదేవ్ బెట్టింగ్ అప్లికేషన్‌ను దుబాయ్ కేంద్రంగా సౌరభ్ చంద్రకర్, రవి ఉప్పల్ అనే ఇద్దరు నడుపుతున్నారు. ఈ బెట్టింగ్ యాప్ ముసుగులో మనీలాండరింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టుగా ఈడీ ఇటీవల గుర్తించింది. బెట్టింగ్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆఫ్‌షోర్ ఖాతాలకు తరలించడానికి యాప్ ప్రమోటర్లు హవాలా మార్గాన్ని అనుసరిస్తున్నట్టుగా ఈడీ ఆరోపించింది.

ఇటలీలో బ్రిడ్జిపై నుంచి పడిన బస్సు.. 21 మంది దుర్మరణం

వెనిస్: ఇటలీలోని వెనిస్ నగర సమీపంలో మంగళవారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న బస్సు అదుపు తప్పి, 50 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడిపోయింది. అనంతరం బస్సులో మంటలు చెలరేగడంతో 21 మంది ప్రయాణికులు మరణించారు. మరో 15 మంది గాయపడ్డారు. వీరిలో 9 మంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది విదేశీ పర్యాటకులే. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. మంటలు ఆర్పేశారు. సహాయక చర్యలు ప్రారంభించారు. బస్సు ప్రమాదంలో 21 మంది మృతిచెందడం పట్ల వెనిస్ సిటీ మేయర్ బ్రుగ్నారో సంతాపం ప్రకటించారు.

దేశం విడిచి వెళ్లండి

అక్రమంగా అఫ్గాన్ నుంచి వచ్చిన శరణార్థులకు పాక్ ఆదేశం

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్ నుంచి పాకిస్తాన్‌కు అక్రమంగా వచ్చిన శరణార్థులు వెంటనే దేశం వీడి వెళ్లాలంటూ పాక్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాలిబన్ల పరిపాలనతో విసిగి వేసారిపోయిన అఫ్గాన్లు లక్షల సంఖ్యలో చట్టవిరుద్ధంగా పాక్‌కు చేరుకున్నారు. అలా వచ్చిన వారు 17 లక్షల మంది ఉంటారని ప్రభుత్వం అంచనా వేసింది. వారందరూ నవంబర్‌లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు దేశాల సరిహద్దుల్లో ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోతున్నాయి. అఫ్గాన్‌లో తాలిబన్ల కనుసన్నల్లో ఉన్న ఉగ్రవాదులే దాడులకు పాల్పడుతున్నారని పాక్ ఆరోపి స్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నవంబర్ 1లోగా అక్రమంగా వచ్చిన వారంతా వెళ్లకపోతే భద్రతా బలగాలతో వారిని దేశం నుంచి బహిష్కరిస్తామని పాకిస్తాన్ ప్రభుత్వం తేల్చి చెప్పింది.

స్పీకర్‌నే దించేసుకున్నారు!

- ఉద్వాసనకు గురైన ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెకార్తీ
- రిపబ్లికన్ పార్టీకి సొంత నేతల షాక్
- అమెరికా చరిత్రలోనే తొలిసారి

వాషింగ్టన్: అమెరికాలో విపక్ష రిపబ్లికన్ పార్టీ సంక్షోభంలో చిక్కుకుంది. ప్రతినిధుల సభ స్పీకర్ పదవి నుంచి రిపబ్లికన్ నేత కెవిన్ మెకార్తీని సొంత పార్టీకి చెందిన సభ్యులే సాగనంపారు! అగ్రరాజ్య చరిత్రలో స్పీకర్ ఇలా ఉద్వాసనకు గురవడం ఇదే తొలిసారి. ఆయనపై రిపబ్లికన్ నేత మాట్ గేట్జ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఆ పార్టీకి చెందిన మరో ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు మద్దతివడం ద్వారా అధికార డెమొక్రటిక్ పార్టీతో చేతులు కలిపారు. దాంతో మంగళవారం మధ్యాహ్నం (అమెరికా కాలమానం ప్రకారం) జరిగిన ఓటింగ్‌లో 216–210 ఓట్లతో మెకార్తీ ఓటమి చవిచూశారు. ఈ ఏడాది జనవరిలో ఏకంగా నాలుగు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన 15 రౌండ్ల ఓటింగ్ అనంతరం మెకార్తీ స్పీకర్‌గా నెగ్గడం తెలిసిందే. పది నెలలు తిరక్కుండానే ఆయన ఇలా అవమానకరంగా తప్పుకోవాల్సి వచ్చింది. ఇప్పుడిక తదుపరి స్పీకర్ ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

కొంప ముంచిన షట్‌డౌన్


కెవిన్ పార్టీలో అందరి నమ్మకమూ కోల్పోయారని గేట్జ్ ఆరోపించారు. సైద్ధాంతికంగా తనతో అన్ని విషయాల్లోనూ విభేదించే తమ పార్టీ సభ్యులు కూడా ఆయన్ను దించేసే విషయంలో కలసి రావడమే ఇందుకు రుజువని చెప్పారు. ఆర్థిక షట్‌డౌన్‌ను తాత్కాలికంగా నివారించే సాకుతో అధికార పార్టీతో కెవిన్ చేతులు కలిపారన్నది గేట్జ్ వర్గం ఆరోపణ. ఈ మేరకు అధ్యక్షుడు జో బైడెన్‌తో ఆయన చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించింది. స్పీకర్‌కు ఉద్వాసనను కనీవినీ ఎరుగని ఘటనగా డెమొక్రటిక్ పార్టీ కాంగ్రెస్ సభ్యుడు, ఇండియన్ అమెరికన్ అమీ బెరా అభివర్ణించారు. రిపబ్లికన్ల మధ్య నెలకొన్న పరస్పర అపనమ్మకానికి ఇది తాజా నిదర్శనమన్నారు.

రిపబ్లికన్ల ఇంటిపోరు వల్లే...

గేట్జ్ సారథ్యంలోని రైట్ వింగ్ రిపబ్లికన్ సభ్యులకు నిజానికి కెవిన్ మీద ఆది నుంచీ వ్యతిరేకతే! జనవరిలో స్పీకర్‌గా ఆయన ఎన్నిక కావడాన్ని వారు చివరిదాకా వ్యతిరేకించారు. దాంతో తనను తొలగించాలని ఒక్క రిపబ్లికన్ సభ్యుడు కోరినా దానిపై ఓటింగ్‌కు అనుమతిస్తానని వారితో ఒప్పందం చేసుకుని మెకార్తీ స్పీకర్‌గా నెగ్గారు. చివరికి అదే ఒప్పందం కారణంగా పదవిని కోల్పోయారు! అయితే సొంత పార్టీలోనే ఇప్పుడు కెవిన్ ఉద్వాసనను తీవ్రంగా తప్పుబడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. గేట్జ్ చర్య ద్రోహపూరితమని వారు ఆరోపిస్తున్నారు. వారిమీద కఠిన చర్యలకు డిమాండ్ చేస్తుండటంతో రిపబ్లికన్ పార్టీలో సంక్షోభం కాస్తా రసకందాయంలో పడింది!

ఇప్పుడేంటి?

- తదుపరి స్పీకర్ ఎవరన్నది ఆసక్తికరంగా మారింది.
- అమెరికా కాంగ్రెస్‌లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్లకే మెజారిటీ దక్కడం తెలిసిందే.
- గత జనవరిలో జరిగిన ఓటింగ్‌లో గేట్జ్ సారథ్యంలోని రైట్ వింగ్ వ్యతిరేకులను బుజ్జగించి మెకార్తీ కనాకష్టంగా స్పీకర్ అయ్యారు.
- అక్టోబర్ 11న కొత్త స్పీకర్ ఎన్నిక జరగాల్సి ఉంది.
- తాజా పరిస్థితుల నేపథ్యంలో మరోసారి పోటీకి మెకార్తీ ససేమిరా అంటున్నారు.
- రిపబ్లికన్లలో ఇంటి పోరు తీవ్రంగా సాగుతుండటంతో స్పీకర్ అభ్యర్థిపై ఏకాభిప్రాయం కష్టంగానే కనిపిస్తోంది.
- ప్రస్తుతానికి రిపబ్లికన్ నేతలు స్టీవ్ స్కలైస్ (లూసియానా), టామ్ ఎమ్మర్ (మిన్నెసోటా) పేర్లు వినిపిస్తున్నాయి.


కెవిన్ మెకార్తీ


ఉత్తర సిక్కిం జిల్లాలో భారీ వర్షాల ధాటికి కొట్టుకుపోయిన రహదారి

సిక్కింలో భీకర వర్షాలు.. ముంచెత్తిన వరదలు

- 10 మంది మృతి
- 22 మంది జవాన్లు సహా 82 మంది గల్లంతు

గాంగ్‌టక్: భారీ వర్షాలు, వరదలతో ఉత్తర సిక్కిం వణికిపోతోంది. ఆకస్మిక వర్షాల కారణంగా తీస్తా నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో తీర ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాలు, వరదల ధాటికి కనీసం 10 మంది మరణించారు. 22 మంది జవాన్లు సహా మొత్తం 82 మంది గల్లంతయ్యారని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. మంగళవారం అర్ధరాత్రి తర్వాత వరద బీభత్సం ప్రారంభమైంది. చుంగ్‌థాంగ్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయడంతో పరిస్థితి మరింత భీతావహంగా మారిందని తెలియజేశాయి. 22 మంది సైనికులు, 47 మంది సాధారణ పౌరులు కనిపించకుండా పోయారని అధికారులు చెప్పారు. వారి ఆచూకీ కనిపెట్టేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 18 మంది క్షతగాత్రులు సహా వరదల్లో చిక్కుకున్న 45 మందిని రక్షించామని అన్నారు. రాజధాని గాంగ్‌టక్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని సింగ్‌తామ్ ఉక్కు వంతెన బుధవారం తెల్లవారుజామున పూర్తిగా కొట్టుకుపోయిందంటే వరద ప్రవాహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు నీట మునిగాయి. రహదారులపై రాకపోకలు స్తంభించాయి. సిక్కిం రాష్ట్రాన్ని దేశంలోని ఇతర భూభాగంతో అనుసంధానించే పదో నెంబర్ జాతీయ రహదారి పలుచోట్ల పూర్తిగా ధ్వంసమైంది. వర్షాలు, వరద విలయాన్ని సిక్కిం ప్రభుత్వం ప్రకృతి విపత్తుగా ప్రకటించింది. మాంగాన్, గాంగ్‌టక్, పాక్‌యోంగ్, నామ్చీ జిల్లాల్లో పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 8 దాకా సెలవు ప్రకటించింది. ఉత్తర బెంగాల్‌కు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. తీస్తా నది ప్రవాహ ప్రాంతాల్లో జనం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్సీపీ ఎంపీ ఫైజల్‌పై మళ్లీ అనర్హత వేటు

న్యూఢిల్లీ: ఎన్సీపీకి చెందిన లక్షద్వీప్ లోక్ సభ సభ్యుడు పీపీ మహమ్మద్ ఫైజల్‌పై మళ్లీ అనర్హత వేటు పడింది. హత్యాయత్నం కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసేందుకు కేరళ హైకోర్టు తాజాగా నిరాకరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు లోక్ సభ సచివాలయం బుధవారం ప్రకటించింది. ఈ రద్దు నిర్ణయం 2023 జనవరి 11వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించాలంటూ బులెటిన్ విడుదల చేసింది. ఈ కేసులో ఫైజల్ పై అనర్హత వేటు పడటం ఇది రెండోసారి. ఆయనతో పాటు మరో నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కవరత్తీ సెషన్స్ కోర్టు తీర్పు ఇవ్వడం తెలిసిందే. దాంతో వెంటనే గత జనవరి 25వ తేదీన తొలిసారిగా ఫైజల్ లోక్ సభ సభ్యత్వంపై వేటు పడింది. కవరత్తీ కోర్టు తీర్పును, శిక్షను కేరళ హైకోర్టు సస్పెండ్ చేయడంతో మార్చి నెల 28వ తేదీన ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. ఇది లోపభూయిష్టమైన తీర్పు అంటూ సుప్రీంకోర్టు ఆగస్టులో తప్పుబట్టడమేగాక ఆ తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో రెండోసారి లోక్‌సభ సచివాలయం ఆయన సభ్యత్వాన్ని రద్దుచేస్తూ బులెటిన్ ఇచ్చింది. ఆయనపై వేటు వేయడంతో లోక్‌సభలో ఖాళీల సంఖ్య ఐదుకు పెరిగింది. లోక్‌సభ ఎన్నికలు ఏడాది లోపు ఉంటే ఉప ఎన్నికలు నిర్వహించరాదు. కనుక వచ్చే మే లోపలే లోక్‌సభ ఎన్నికలు జరగనున్నందున లక్షద్వీప్‌కు ఉపఎన్నిక జరగబోదు.

తాను వేసిన ఉచ్చులో..

- యాంకర్ చైన్‌కు ఢీకొన్న చైనా అణుజలాంతర్గామి
- 55 మంది నావికులు మృతి

లండన్: చైనాకు సమీపంలోని ఎల్లో సముద్రంలో పశ్చిమ దేశాల జలాంతర్గాములను నిరోధించడానికి తాను వేసిన ఉచ్చులో డ్రాగన్ దేశానికి చెందిన అణు జలాంతర్గామి చిక్కుకుంది. ఈ ప్రమాదంలో చైనాకు చెందిన 55 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి యూకే ఇంటెలిజెన్స్ రహస్య నివేదిక తమ దగ్గర ఉందని డెయిలీ మెయిల్ ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆగస్టులో ఎల్లో సముద్రంలో చైనా షాన్‌డాంగ్ ప్రావిన్స్ సమీపంలో ప్రమాదం జరిగింది. ఆ ప్రాంతానికి సమీపంలో క్వింగ్‌డావ్ నౌకాదళ స్థావరం ఉంది. అక్కడికి అమెరికా, బ్రిటన్‌ల జలంతర్గాములు రాకుండా చైనా ఏర్పాటు చేసిన యాంకర్ ఉచ్చులో దాని సబ్‌మెరైన్ చిక్కుకుందని డెయిలీ మెయిల్ తన కథనంలో పేర్కొంది.

ప్రమాదం ఎలా జరిగిందంటే.. !

ఈ సబ్‌మెరైన్ ప్రమాదానికి సంబంధించి యూకే ఇంటెలిజెన్స్ సవివరమైన నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో ఉన్న వివరాల ప్రకారం ఎల్లో సముద్రంలో ఆగస్టు 21 ఉదయం 8.12 గంటల సమయంలో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీకి చెందిన అణు జలంతర్గామి 093 చిక్కుకుపోయింది. అమెరికా, దాని మిత్రపక్షాల జలాంతర్గాముల్ని అడ్డుకోవడానికి వేసిన యాంకర్ చైన్‌ను డ్రాగన్ జలంతర్గామి ఢీ కొట్టడంతో అందులో ఎయిర్ ప్యూరిఫయర్, ఎయిర్ ట్రీట్‌మెంట్ వ్యవస్థలు ఆగిపోయి ఉండవచ్చు. సబ్‌మెరైన్‌లో ప్రయాణిస్తున్న సిబ్బంది ఆరుగంటల సేపు శ్రమించి ప్రత్యామ్నాయ వ్యవస్థకు మార్చినా ఫలితం లేకుండా పోయింది. జలాంతర్గామిలో ఉన్న ఆక్సిజన్ విషతుల్యమై హైపాక్సియా అనే పరిస్థితి ఏర్పడి అందులో ప్రయాణిస్తున్న 55 మంది ఉసురు తీసింది. మృతి చెందిన వారిలో జలాంతర్గామి కెప్టెన్ కల్నల్ జీ యాంగ్‌పెంగ్ సహా 22 మంది అధికారులు, ఏడుగురు ఆఫీసర్ కేడెట్స్, 9 మంది పెట్టీ ఆఫీసర్స్, 17 మంది సిబ్బంది ఉన్నారు. ఆగస్టులో ఈ ప్రమాదం గురించి కొన్ని అంతర్జాతీయ పత్రికలు రాసినా అప్పట్లో చైనా, తైవాన్‌లు దీనిని తోసిపుచ్చాయి. జలంతర్గాముల్లో హైడ్రోజన్ నుంచి ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే వ్యవస్థలు ఉంటాయి. బహుశా చైనా జలాంతర్గామిలో ఆ వ్యవస్థ లేకపోయి ఉండవచ్చునని బ్రిటన్ నిపుణులు చెబుతున్నట్టుగా డెయిలీ మెయిల్ తన కథనంలో పేర్కొంది. ప్రమాదం జరిగిన సమయంలో సబ్‌మెరైన్‌నుంచి ఎన్‌క్రిప్టెడ్ ఆటోమేటిక్ సిగ్నల్ పొరుగు దేశాలకు అందాయని బ్రిటన్ నిపుణులు వెల్లడించారు. అదే సమయంలో బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రసంగం మధ్యలో వెళ్లిపోయారు. అధ్యక్షుడు ప్రసంగ పాఠాన్ని ఆ దేశ వాణిజ్య మంత్రి కొనసాగించారని, ఈ ప్రమాదమే దానికి కారణమన్న విశ్లేషణలు కూడా వస్తున్నాయి.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన మెట్టు బలరామిరెడ్డి, వెంకమ్మలు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



నృసింహస్వామి పానకం ఆదాయం

మంగళగిరి : పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పానకం హక్కులకు బుధవారం వేలం నిర్వహించగా రూ.20 లక్షల 40 వేలు అదనపు ఆదాయం సమకూరింది.



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు నున్న మ్యాంగో మార్కెట్‌లో అమ్మవారి ప్రతిమలను సిద్ధం చేస్తున్న చిత్రమిది.

చిక్కుముళ్లకు చెల్లుచీటీ!

- గందరగోళంగా ఉన్న విద్యుత్ తీగల స్థానంలో ఓవర్ హెడ్ కేబుల్స్
- విజయవాడ వన్‌టౌన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా పనులు
- మరికొన్ని అర్బన్ ప్రాంతాల్లో తీగల మార్పునకు సన్నాహాలు
- ఇండోర్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏర్పాటు



విజయవాడ వన్‌టౌన్‌లో పనులు పరిశీలిస్తున్న సీఎండీ పద్మ జనార్దనరెడ్డి, విద్యుత్ అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: చిక్కుముళ్లను తలపించేలా గజిబిజిగా ఉన్న విద్యుత్ వైర్లకు చెల్లుచీటీ చెప్పే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రధానంగా వీటి వల్ల తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం కలుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) పరిధిలో ఓవర్ హెడ్ కేబుల్స్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. విజయవాడలో పైలెట్ ప్రాజెక్టుగా పనులు చేపట్టారు. ఇందులో భాగంగా వన్‌టౌన్ ప్రాంతంలోని శివాలయం వీధిలో రూ.70 లక్షలతో పనులు చేపట్టారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఈఈ సుధాకర్ పనులు ప్రారంభించారు. అవి తుది దశకు చేరాయి. ముఖ్యంగా వన్‌టౌన్ ప్రాంతం ఇరుకు సందుల్లో వైర్లు కిందికి వేలాడుతూ, గందరగోళంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాలు ప్రయాణిస్తున్నప్పుడు విద్యుత్తు వైర్లు తెగిపడి ప్రమాదాలు సంభవించడంతో పాటు విద్యుత్ సరఫరాకు తరచూ అవాంతరం కలుగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థ చేసిన వినూత్న ప్రయోగం ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తోంది. వన్‌టౌన్ ప్రాంతంలోని 30 వీధుల్లో ఓవర్‌హెడ్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని విజయవాడ, మచిలీపట్నం, నరసరావుపేట, బాపట్ల, చీరాల, తెనాలి, రేపల్లి, పొన్నూరు, సత్తెనపల్లి, చిలకలూరిపేట పట్టణాలతో పాటు మరికొన్ని అర్బన్ ప్రాంతాల్లోని ఇరుకు సందుల్లోనూ విద్యుత్ తీగల మార్పునకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.



విజయవాడ వన్‌టౌన్ శివాలయం ప్రాంతంలో గజిబిజిగా ఉన వైర్లు, మార్చిన తర్వాత దృశ్యం

డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌లు ఏర్పాటు.....

ఇరుకు రోడ్లలో అటుపక్క ఇటుపక్క విద్యుత్తు స్తంభాలకు వేలాడుతున్న సర్వీసు వైర్లను తొలగించి, వాటి స్థానంలో క్రమ పద్ధతిలో ఓవర్ హెడ్ కేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. పోల్‌కుపోల్‌కు మధ్యలో డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌లు ఏర్పాటు చేసి, ఆబాక్స్ నుంచి నీట్‌గా కేబుల్స్ వెళ్లేలా చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో ఇండోర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన నిప్పు రవ్వలు రావటం వంటివి ఉండవు. మన ఇంటి ముందు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామనే గొడవలు ఉండవు. ఓపెన్ కండక్టర్ బదులు కేబుల్ వాడటం వలన వర్షం వచ్చినప్పుడు ట్రిప్పు కాదు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగదు. పొరపాటున వైర్లకు తగిలినా ప్రమాదాలు సంభవించవు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలకు చోటుండదు. మంచి ఓల్టేజీతో విద్యుత్తు సరఫరా జరుగుతుంది. విద్యుత్ రిపేర్లు చేయాల్సి వచ్చినప్పుడు ఆ ప్రాంతం మొత్తం సరఫరా ఆపివేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఏపోల్ పరిధిలో అంతరాయం ఏర్పడిందో, అక్కడి వరకు మాత్రమే సరఫరా ఆపి, మిగతా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుంటుంది.

విద్యుత్ సరఫరాలో నాణ్యత



ఓవర్ హెడ్ కేబుల్స్ ఏర్పాటు చేయటం వలన విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరుగుతుంది. ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్‌లకు అవకాశం ఉండదు. నగర సుందరీకరణకు ఉపయోగపడుతుంది. అంతరాయం లేని సరఫరా జరుగుతుంది. ఓల్టేజీ హెచ్చుతగ్గు సమస్యలుండవు. పైలెట్ ప్రాజెక్టుగా విజయవాడ వన్‌టౌన్ శివాలయంలో ఈ కేబుల్స్ ఏర్పాటు చేస్తున్నాం. దశల వారీగా మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తాం.

– జె.పద్మ జనార్దనరెడ్డి, సీఎండీ, ఏపీసీపీఎస్‌పీడీసీఎల్

సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం



వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ తలశిల, కలెక్టర్ ఢిల్లీరావు

ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగ్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని శాసనమండలి సభ్యులు, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని సచివాలయం-2 వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో కలిసి పరిశీలించారు. తొలుత జగనన్న సురక్ష వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్, ల్యాబ్ టెస్టింగ్, మందుల కౌంటర్లను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్సీ తలశిల రఘురాం మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే గొప్ప సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. నిరుపేదలు సైతం ధనికులతో సమానంగా కార్పొరేట్ వైద్యం అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, తద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు ఏది అవసరమో తెలుసుకుని ఇంటి ముంగిటకే తీసుకొచ్చిన మనసున్న మనిషి అని పేర్కొన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా వైద్య సేవలు, మందులు అందిస్తున్నట్లు వివరించారు.

అందుబాటులో స్పెషలిస్టు వైద్యులు

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని 14 రూరల్ మండలాల్లో నవంబర్ 9వ తేదీ వరకు విలేజ్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో 257 క్యాంపులు, ఈ నెల 5వ తేదీ నుంచి నవంబర్ 16 వరకు అర్బన్‌లోని యూపీహెచ్‌సీ పరిధిలో 47 క్యాంప్‌లను నిర్వహిస్తామని వెల్లడించారు. ఆయా వైద్య శిబిరాల్లో గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, పిడియాట్రిక్ వంటి స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ జె.సుమన్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉషారాణి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ బి.భార్గవి, పంచాయతీ కార్యదర్శి స్వరూపరాణి, బీఎల్ శేషగిరిరావు (ఇఓ అండ్ ఆర్‌డీ), ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగవరపు శివాజి, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, గేరా సుమన్ కుమార్, ఎంపీటీసీలు పైలా ఆదినారాయణ, కేతుపల్లి దావీదు తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో వచ్చిన వృద్ధుడి వద్దకు వెళ్లి పరీక్షిస్తున్న వైద్యులు

న్యూస్‌రీల్

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత



భవానీపురం(విజయవాడపశ్చిమ): గోడౌన్స్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు (ఈవీఎం) కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోగల ఈవీఎం గోడౌన్‌ను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజినీర్ల పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటీపీ)ను నిర్వహిస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్ 29 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ పది రోజులపాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన 5,700 బ్యాలెట్ యూనిట్లు, అలాగే 4180 కంట్రోల్ యూనిట్లు, 5,460 వీవీ ప్యాట్స్ ఓటింగ్ యంత్రాలను గోడౌన్‌లో ఉంచామని చెప్పారు. వాటిని పకడ్బందీగా భద్రపరచాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఈవీఎం ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రారంభవుతుందన్నారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ మధు పాల్గొన్నారు.

8న ఖోఖో జట్ల ఎంపిక

గుడివాడ టౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో అండర్-18 బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తామని కృష్ణా జిల్లా ఖో-ఖో సంఘం కార్యదర్శి మడకా ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎస్ఎస్‌కె ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ఈ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 2006 జనవరి 1 తదుపరి జన్మించిన వారై ఉండాలన్నారు. వీరి ఎత్తు, వయస్సు, బరువు మొత్తం 250 పాయింట్లు మించకూడదన్నారు. అభ్యర్థులు మధ్యాహ్నం 2 గంటల లోపు రిపోర్టు చేయాలని సూచించారు. 10వ తరగతి మార్కుల లిస్ట్, జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు తప్పక తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమర్రి గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పూర్తి వివరాలకు 98482 45468 నంబర్లో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోటలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాణిగారితోట-1,2,3,7,8 కేంద్రాలను, భాస్కరరావుపేట-1 కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహార నాణ్యతను తనిఖీ చేశారు. చిన్నారులతో కొంచెం సేపు ముచ్చటించి వారితో అక్షరాలు, రైమ్స్ చెప్పించారు. చిన్నారుల తల్లులకు ఫోన్ చేసి పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

7న బాలబాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపిక

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఈ నెల 7వ తేదీ శనివారం అండర్-14, 17 బాలబాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి తోట అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనమలూరులోని బ్లూమింగ్ డెల్ ఇంటర్నేషనల్ స్కూల్లో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పిల్లల వివరాలను అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో ఆన్‌లైన్ చేసి ఉదయం 9 గంటల నుంచి పోటీలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 8499814311 నంబర్లో సంప్రదించాలన్నారు.

యార్డుకు 40,677 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 40,677 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 38,822 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనం తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

జుజ్జూరు(వీరులపాడు): ఆరోగ్యకరమైన భావితరాలను అందించాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్ మోహనరావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సర్పంచ్ రమావత్ కోటి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, నాయకులు ఆకుల అంజయ్య, పూలా రాంబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

- జిల్లాలో ఇప్పటి వరకూ 45 శిబిరాలు నిర్వహణ
- 16685 మందికి వైద్య పరీక్షలు
- ఉచితంగా మందులు పంపిణీ



మెగా ఆరోగ్య మేళాలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న మెగా ఆరోగ్య మేళాలకు అనూహ్య స్పందన లభిస్తుంది. వ్యాధులతో బాధపడుతున్న వారు వచ్చి స్పెషలిస్టు వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకుంటున్నారు. వైద్య పరీక్షల అనంతరం మందులు అందిస్తుండగా, ఆస్పత్రిలో చికిత్సలు అవసరమైన వారికి అక్కడే అందుబాటులో ఉన్న ఆరోగ్య మిత్రలు వారు ఏ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలో సూచిస్తున్నారు. దీంతో జిల్లాలో మెగా ఆరోగ్య మేళాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. సెప్టెంబరు 30 మెగా ఆరోగ్య మేళాలు ప్రారంభం కాగా, బుధవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. 16685 మందికి పరీక్షలు చేయగా, వారిలో 7909 మంది పురుషులు, 8776 మంది స్త్రీలు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. వైద్య పరీక్షలు చేసిన వారిలో మెరుగైన వైద్య సేవల కోసం 205 మందికి వివిధ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీలో చికిత్స పొందేలా రిఫర్ చేశారు. మరో 12128 మందికి మందులు అందజేశారు.

వ్యాధులకు చికిత్స ఇలా..

జిల్లాలో ఇప్పటి వరకూ నిర్వహించిన మెగా ఆరోగ్య మేళాల్లో హైపర్ టెన్షన్‌తో ఉన్న వారు 5110 మంది, డయాబెటీస్ 4517, హైపో థైరాయిడిసమ్ 488, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు 1362 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వీరితో పాటు పోషకాహారలోపం ఉన్న వారు 53 మంది, గర్భిణులు, బాలింతలు 526 మందికి, స్త్రీ గర్భకోశ వాధులతో బాధపడుతున్న వారు 2035 మందికి, రక్తహీనత ఉన్న వారు 314 మంది, వృద్ధులు 3326 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 2168 మందికి పరీక్షలు నిర్వహించి 981 మందికి మందులు అందించారు. మరో 232 మందిని చికిత్స కోసం రిఫర్ చేయగా, కంటి శుక్లాలు ఉన్నట్లు 184 మందిని గుర్తించారు.

సమన్వయంతో సాగుతున్నాం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెగా ఆరోగ్య మేళాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. జిల్లా కలెక్టర్ సారధ్యంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. స్పెషలిస్టు వైద్యులు సైతం శిబిరాలకు వచ్చి పరీక్షలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

చెరకు రైతుకు చేదు

- పంటపై ఉధృతంగా కాండం తొలుచు పురుగు
- పంట దిగుబడి తగ్గేందుకు ఆస్కారం
- సకాలంలో యాజమాన్య చర్యలతో నష్టానికి చెక్



కంకిపాడు మండలం ప్రొద్దుటూరులో సాగులో ఉన్న చెరకు తోట


కంకిపాడు: వాణిజ్య పంటల్లో చెరకు చాలా ముఖ్యమైంది. చెరకు పండించే రైతులకు ప్రస్తుతం కాండం తొలుచు పురుగు చేదు మిగులుస్తోంది. పంటపై పురుగు విచక్షణారహితంగా దాడి చేస్తూ నష్టపరుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడులను సంరక్షించుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా చెరకు పంట సాగవుతోంది. 5 వేల ఎకరాల్లో పిలక తోటలు, 7500 ఎకరాల్లో మొక్కతోటలు ఉన్నాయి. ప్రస్తుతం చెరకు నాటి 120 నుంచి 150 రోజుల పంట పొలాల్లో ఉంది. ఒక విడత జడ కట్టుడు కూడా పూర్తయిన పొలాలు ఉన్నాయి. రెండో విడత జడ కట్టుడుకు తోటలు సిద్ధమవుతున్నాయి. ఈ దశలో పంటను కాండం తొలుచు పురుగు ఆశించి నష్టపరుస్తుంది.

క్షేత్ర సందర్శన ద్వారా.....

ప్రస్తుతం చెరకు పంటను కాండం తొలుచు పురుగు ఆశించింది. దీంతో రైతులు సమస్యను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లటంతో ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్తల బృందం క్షేత్ర సందర్శనలు నిర్వహించింది. కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, గన్నవరం బాపులపాడు, తదితర ప్రాంతాల్లో సాగులో ఉన్న చెరకు పైరును శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. అక్కడక్కడా కాండం తొలుచు పురుగు ఆశించి పంటకు నష్టం చేస్తున్న విషయాన్ని గుర్తించారు.

పురుగుని గుర్తించటం ఎలా...

చెరకు పంట నాటిన 120 రోజులు నుంచి పంట నరికే సమయం వరకూ కాండం తొలుచుపురుగు ఆశిస్తుంది. ఈ పురుగు చెరకు గడల కింద భాగం నుంచి ఆశించి పై భాగం వరకూ తొలుచుకుంటూ వెళ్తుంది. దీని వల్ల కణుపులు గట్టిపడి గడలు ఎండిపోయి నాణ్యత దెబ్బతింటుంది. దిగుబడి కూడా గణనీయంగా పడిపోతుంది. కణుపుల మధ్య గల కాండం విస్తీర్ణత తగ్గటం, కణుపులపై పురుగు చేసిన రంధ్రాలు, పురుగు విసర్జితాలను చూసి పురుగు ఉనికి ఉన్నట్లు గుర్తించాలి.



కాండం తొలుచు పురుగు



దెబ్బతిన్న చెరకు గడలు

నివారణ చర్యలతో ఉపశమనం...

- ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలి.
- ఆలస్యంగా ఏర్పడిన పిలకలు తీసివేయాలి.
- తోటలు పడిపోకుండా సకాలంలో జడకట్టు వేయించాలి.
- కింద ఎండుటాకులు రెలిచి పిచికారీ పనులు చేస్తుండాలి.
- యాంత్రిక పద్ధతిలో అయితే లింగాకర్షణ బుట్టలు ఎకరాకు నాలుగు చొప్పున ఏర్పాటుచేసుకోవాలి. నాటిన 120 రోజులు నుంచి పంట నరికే వరకూ వీటిని ఉంచుకోవాలి.
- జీవనియంత్రణ పద్ధతిలో అయితే ట్రైకోగ్రామా గుడ్లు పరాన్నజీవిని ట్రైకోకార్డులు ఎకరాకు 2-3 చొప్పున 120 రోజుల పంట వయస్సు నుంచి 7-10 రోజులు వ్యవధిలో 5-6 సార్లు విడుదల చేసుకోవాలి.
- చెరకు గడల కింద ఉన్న ఎండుటాకులు రెలిచి క్లోరిపైరిఫాస్ మందు 2.5 మిల్లీలీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

సకాలంలో యాజమాన్య చర్యలు అవసరం



చెరకు పంటలో 120 రోజులు వయస్సు దాటిన దగ్గర నుంచి కాండం తొలుచు పురుగు కదలికలు ఉంటాయి. చెరకు గడలను నిశితంగా పరిశీలించి, గడలకు రంధ్రాలు ఏర్పడి, విసర్జితాలను గుర్తించి పురుగు ఆశించినట్లు నిర్ధారించుకోవాలి. సకాలంలో జీవనియంత్రణ, యాంత్రిక, రసాయన విధానాల్లో నియంత్రణ చర్యలు తీసుకోవాలి. తద్వారా పంట దిగుబడులను పరిరక్షించుకోవచ్చు. ఆర్థికంగా కలిగే నష్టాలను అధిగమించొచ్చు.

– డాక్టర్ డి.సుధారాణి, సీనియర్ శాస్త్రవేత్త, కీటక నివారణ విభాగం, చెరకు పరిశోధనా స్థానం, ఉయ్యూరు

జిల్లాలో 96.73 శాతం పింఛను కానుక పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక 96.73 శాతం పంపిణీ జరిగింది. మొత్తం 2,37,888 పింఛన్లకు గాను 2,30,099 మంది అందుకున్నారు. అత్యధికంగా జికొండూరు మండలంలో 99.15 శాతం, తిరువూరు 98.23 శాతం, కొండపల్లి అర్బన్‌లో 98.08 శాతం, నందిగామలో 98.04 శాతం వీరులపాడులో 98.01 శాతం పంపిణీ పూర్తయింది.

క్లుప్తంగా

సంతృప్తికర స్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కృష్ణా జిల్లాలో సంతృప్తిస్థాయిలో కొనసాగుతోందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. సచివాలయం నుంచి ముఖ్యమంత్రి కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ బుధవారం సాయంత్రం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకుని కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు జిల్లాలో పురోగతిని వివరించారు. ఇప్పటి వరకు నిర్వహించిన వైద్య శిబిరాల్లో సగటున 350 వరకు ఓపీ నమోదవుతోందని తెలిపారు. ఆరోగ్య సమస్యలతో వస్తున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం చేయటంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. రోగుల సమస్యలను నమోదు చేసే సమయంలో యాప్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై అధికారులు స్పందిస్తూ రేపటిలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైద్య శిబిరాల వద్ద రోగులకు అందించే బ్యాగ్‌లను సకాలంలో సరఫరా చేయాలని కలెక్టర్ కోరారు. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నోడల్ అధికారి జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ఉన్నతాధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): గోవాలో జరుగుతున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల బ్యాంకుల ఉన్నతాధికారులతో లోక్‌సభ సబార్డినేట్ కమిటీ చైర్మన్, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయా బ్యాంకుల అధికారులతో వాటి పనితీరు, విధివిధానాలపై చర్చించారు. బ్యాంక్‌ల ఉన్నతాధికారులతో మాట్లాడిన అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని వారికి ఎంపీ తెలిపారు. సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ దినేష్‌కుమార్ ఖరా, కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణరాజు, యూనియన్ బ్యాంక్ ఎండి మనిమేఖలై, ఇండియన్ బ్యాంక్ ఎండీ శాంతి లాల్‌జైన్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఎండీ అజయ్‌కుమార్ శ్రీవాస్తవ, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ రజనీష్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎం.వి.రావు పాల్గొన్నారు.

సరోగసీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యంగా ఉండి సంతానోత్పత్తికి అవకాశం లేని వారికి మాత్రమే పునరుత్పత్తి, కృత్రిమ(అద్దె) గర్భం ప్రక్రియను ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. మానవాళి ప్రయోజనాల కోసం రూపొందించిన సరోగసీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు, సంతానోత్పత్తి కేంద్రాల వైద్యులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో పునరుత్పత్తి, అద్దె గర్భం చట్టం సరోగసీ–2021 అమలుపై వైద్యాధికారులతో కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్యుపరమైన లోపాలతో సంతానం లేని దంపతులు పిల్లల కోసం సంతానోత్పత్తి కేంద్రాలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో వారికి చికిత్స అందించే వైద్యులు ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సరోగసీ ఈ చట్టాన్ని సమర్థంగా అమలు చేసేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల పునరుత్పత్తి హక్కులను సంరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన చట్టాల్లో అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ) రెగ్యులేషన్ చట్టం–2021 అత్యంత కీలకమైందన్నారు. ఈ చట్టం ద్వారా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ఏఆర్‌టీ క్లినిక్స్, ఏఆర్‌టీ బ్యాంకుల నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించిందన్నారు. చట్టానికి లోబడి చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ రిజిస్ట్రీ ఆఫ్ బ్యాంక్స్ అండ్ క్లినిక్స్ ప్రకారం క్లినిక్‌లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. నిర్దిష్ట ప్రమాణాలకు లోబడి ఉన్న క్లినిక్‌లను మాత్రమే రిజిస్టర్ చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలను పాటించని క్లినిక్‌ల రిజిస్ట్రేషన్లను రద్దు చేసేందుకు జిల్లా కమిటీ వెనుకాడొద్దని స్పష్టంచేశారు. క్లినిక్‌లను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించి, చట్టానికి లోబడి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వైద్యులు నవీన్, వి.పద్మజ, క్లినిక్ వైద్యులు పి.పృథ్వీకుమార్, కె.ప్రియాంక, లత, రమాదేవి, లావణ్య, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి సీఎం కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



కుట్టు మిషన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

జుజ్జూరు(వీరులపాడు): మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అవసరమైన అన్ని చర్యలూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన 20 మందికి జెడ్పీ నిధుల నుంచి మంజూరైన కుట్టు మిషన్లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి, వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్‌లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రతి పథకం అక్కాచెల్లెమ్మలకే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ప్రతి సంక్షేమ పథకం అక్కచెల్లెమ్మలకే అందిస్తున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు అమర్లపూడి కీర్తి సౌజన్య, గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, సర్పంచ్ రమావత్ కోటి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఈవీఎంల మొదటి దశ పరిశీలన

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల మొదటి దశ పరిశీలన (ఫస్ట్ లెవల్ చెక్) ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెక్, యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటీపీ), ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణకు సంబంధించి సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంల తొలి దశ పరిశీలన ప్రక్రియ నవంబర్ ఐదో తేదీలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రోజూ ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఏడు గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలోని కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లకు సంబంధించి బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజినీర్ల పర్యవేక్షణలో అధికారులు యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటీపీ) నిర్వహిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 29వ తేదీన ప్రారంభమైన ఈ ప్రక్రియ పది రోజుల పాటు కొనసాగుతుందన్నారు. 5,700 బ్యాలెట్ యూనిట్లు, 4,180 కంట్రోల్ యూనిట్లు, 6,460 వీవీ ప్యాట్‌లకు సంబంధించి స్కానింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవాడలో ఎస్‌డీఈసీ కృషి అభినందనీయం

డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురేంద్ర



వార్షికోత్సవంలో డీటీసీ పురేంద్ర, హోండా కంపెనీ ప్రతినిధులు, సెంటర్ సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని రైడర్‌లు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగిస్తున్న సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్(ఎస్‌డీఈసీ) కృషి అభినందనీయమని డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.పురేంద్ర పేర్కొన్నారు. నగరంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా శాఖ, హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్ నాల్గో వార్షికోత్సవం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథి పురేంద్ర మాట్లాడుతూ.. నాలుగేళ్లలో ఈ సెంటర్ ద్వారా ఎంతో మందికి రోడ్డు భద్రతపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. విజయవాడలోని లెర్నర్ లైసెన్స్ దరఖాస్తుదారులు రోడ్డుపై ప్రయాణించే ముందు వారికి తగిన శిక్షణ అందించడం దీని లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లలో 68 వేల మంది దిచక్ర, నాలుగు చక్రాల లెర్నింగ్ లైసెన్స్ పొందిన వారికి అవగాహన కలిగించినట్లు వివరించారు. అనంతరం హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా హెచ్‌ఆర్, ఐటీ, కార్పొరేట్ వ్యవహారాల సీనియర్ డైరెక్టర్ వినయ్ దింగ్రా మాట్లాడుతూ.. సురక్షిత డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించి, సానుకూల మార్పును తీసుకురావడానికి కృషి చేసినట్లు తెలిపారు. డిజిటల్ హోండా రోడ్ సేఫ్టీ ఈ–గురుకుల్ ద్వారా నగరంలో 31 వేల మందికి రోడ్డు భద్రతపై అవగాహన కలిగించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లాను రక్తహీనత రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించి, బాలికల్లో రక్తహీనత, స్థూల నమోదు నిష్పత్తి సర్వేపై సమీక్ష చేశారు. గతంలో సేకరించిన నివేదికల ప్రకారం జిల్లాలో వివిధ ప్రభుత్వ సంస్థల్లో 23 వేల మంది బాలికల్లో రక్తహీనత సమస్య ఉందని, ఈ సమస్యను అధిగమించేందుకు సిద్ధం చేసిన కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. గురువారం బాలికలకు రక్తపరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారిని గుర్తించాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు రక్తహీనత ఉన్న బాలికలు రోజు మధ్యాహ్నం ఐరన్ మాత్రలు తీసుకునేలా చూడాలని సూచించారు. పాఠశాలకు రాని రోజుల్లో కూడా వారు ఇంటి వద్దనే ఐరన్ మాత్రలు తీసుకున్నారో లేదో తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు 15 రోజులకు ఒకసారి బాలికలకు రక్తపరీక్షలు చేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రక్తహీనత వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని పేర్కొన్నారు. బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం పెంపునకు ప్రాధాన్యం ఇస్తూ ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించాలన్నారు. ఇప్పటివరకు 98.69 శాతం స్థూలనమోదు నిష్పత్తి సాధించామని, నూరుశాతం సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులు కాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారానికి ఒకసారి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత శాతం తగ్గితే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి వార్షిక పరీక్షలు బాగా రాసేలా సన్నద్ధం చేయాలని కోరారు. డీఈఓ తాహెరాసుల్తానా, డీవైఈఓలు సుబ్బారావు, పద్మారాణి, డీవీఈఓ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి దుకాణంలో రేషన్‌బియ్యం అక్రమ నిల్వలు



రేషన్ బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు



లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన బియ్యం వ్యాపారి రంగారావు

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులో టీడీపీ నాయకుడు అక్రమంగా నిల్వచేసిన 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పౌరసరఫరాలశాఖకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సీజ్ చేసింది. టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడైన పడమట రంగారావు స్థానిక బుద్దవరం రోడ్డులోని తన ఇంటి ఆవరణలో తిరుమల రైస్ ట్రేడర్స్ దుకాణాన్ని నడుపుతున్నాడు. సదరు దుకాణంలో కార్డుదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు అందింది. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా పీడీఎస్‌కు చెందిన నలుగురు డీటీలతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తిరుమల రైస్‌ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న 14 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన టీడీపీ నాయకుడు పడమట రంగారావుపై పీడీఎస్ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో పీడీఎస్ డీటీలు ఎస్‌వీఎస్.ప్రధాని(గన్నవరం), ఎన్.వెంకటేశ్వరరావు (పామర్రు), సిహెచ్. శ్రీనివాసరావు(అవనిగడ్డ), బీవీ.రంగారావు(గుడివాడ) పాల్గొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు చేసినందుకు సదరు టీడీపీ నేత రంగారావుపై గతంలో కూడా పలు కేసులు నమోదయ్యాయి.

నేడు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఈ నెల ఐదో తేదీన ఆటల పోటీలు నిర్వహిస్తామని ఆ శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు బుధవారం తెలిపారు. నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య ఇండోర్ స్టేడియంలో గురువారం ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఆటల పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ప్రారంభిస్తారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ ఆటల పోటీల్లో పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జరిగే బహుమతి ప్రదానోత్సవ సభకు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డ్ దుర్మరణం



హోంగార్డ్ కిషోర్ బాబు మృతదేహం

నందిగామ: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న గుడేటి కిషోర్ బాబు (41) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్‌ఐ పండు దొర కథనం మేరకు.. వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన కిషోర్‌బాబు నందిగామ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే విధులకు హాజరైన కిషోర్‌బాబు తన ద్విచక్ర వాహనంపై జగ్గయ్యపేట వైపు వెళ్తున్న క్రమంలో నందిగామ మండలం మునగచర్ల సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కిషోర్‌బాబు తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని లోబ్రిడ్జి సమీపంలో మంగళవారం ఒక వ్యక్తి అనారోగ్యంతో అపస్మారక పరిస్థితిలో ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

జి.కొండూరు(మైలవరం): అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జి.కొండూరు మండలంలోని కట్టుబడిపాలెం గ్రామ శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, అప్పారావు పేటకు చెందిన అల్లూరి నాగరాజు (45), భార్య, ఇద్దరు కుమారులతో కలిసి పదకొండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం జి.కొండూరు వచ్చాడు. అప్పటి నుంచి కొండపల్లి ఐడీఏలోని ఆయిల్ తరలించే ట్యాంకర్ లారీలకు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్య కారణాలతో బాధపడుతున్న నాగరాజు మనస్తాపానికి గురై గత నెల 27వ తేదీన డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. నాగరాజు ఆచూకీ కోసం ఎంత వెతికినా సమాచారం లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గత నెల 29వ తేదీన జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కట్టుబడిపాలెం గ్రామ శివారులోని ఐఓసీఎల్ ప్లాంట్ సమీపంలో చెట్ల పొదల్లో నిరుపయోగంగా ఉన్న రేకులషెడ్డు నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు బుధవారం మధ్యాహ్నం అక్కడికి వెళ్లి పరిశీలించారు. నాగరాజు ఉరేసుకొని మృతి చెంది కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జి.కొండూరు ఎస్‌ఐ ధర్మరాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తామని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

• పంట కాలువలో పండుగొప్ప



11 కిలోల పండుగప్పతో రామాంజనేయులు

నదులు, సముద్రాల్లో మత్స్యకారుల వలలకు భారీ చేపలు చిక్కడం సాధారణం. పంట కాలువలో భారీ పండుగప్ప చేప వలకు చిక్కింది. కోడూరుకు చెందిన గోబత్తిన రామాంజనేయులు బుధవారం ఉదయం 14వ నంబర్ పంట కాలువలో వల విసిరాడు. 11 కిలోల పండుగప్పతో పాటు మూడు నుంచి ఐదు కిలోల బరువున్న చేపలు చిక్కాయి. కాలువల్లో ఇంత పెద్ద చేపలు దొరకడం అరుదని మత్స్యకారులు తెలిపారు.

– కోడూరు (అవనిగడ్డ)

ఉత్కంఠగా కృష్ణా- ప్రకాశం జిల్లా టెస్ట్ మ్యాచ్



ఆరు వికెట్లు తీసిన కృష్ణా జిల్లా జట్టు బౌలర్ చిన్నా

నరసరావుపేట: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల మూడు రోజుల బాలుర టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. కృష్ణా, ప్రకాశం జిల్లా జట్లు మధ్య మ్యాచ్‌లో నిన్నటి ఓవర్ నైట్ వికెట్ నష్టానికి 12 పరుగులతో బుధవారం బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు 47.4 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటయింది. కృష్ణా జిల్లా జట్టులోని వరుణ్ సాత్విక్ 75 పరుగులు చేయగా ప్రకాశం జిల్లా జట్టులోని సుమిత్ర, నవీన్‌కు చెరో మూడు వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా జట్టు ఆట ముగిసే సమయానికి తొమ్మిది వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. ప్రకాశం జిల్లా జట్టులోని చిన్నారావు 50 పరుగులు చేయగా కృష్ణా జిల్లా జట్టులోని చిన్నా ఆరు వికెట్లు సాధించాడు. రేపు మూడో రోజు ఆట కొనసాగుతుందని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

గుడివాడరూరల్: గుర్తు తెలియని వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గుడివాడ పట్టణంలో బుధవారం జరిగింది. పట్టణంలోని నీలామహల్ రోడ్డు చివర ఉన్న విజయదుర్గ అమ్మవారి గుడి సమీపంలో ఓ వృద్ధుడు మృతి చెందాడని స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించారు. అతని ఆచూకీ తెలిపే వివరాలేవీ ఘటనాస్థలంలో లభించలేదు. మృతుడి ఒంటిపై లుంగీ, ఎర్ర చొక్కా ఉన్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్‌ను సంప్రదించాలని వన్‌టౌన్ పోలీసులు కోరారు.

క్లుప్తంగా

6 నుంచి ప్రత్యేక సదస్సులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఓర్పు అనే అంశంపై దేశంలో 74 చోట్ల సదస్సులు నిర్వహిస్తున్నట్టు యెహోవా సాక్షులు సంస్థ ప్రతినిధి కె.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6నుంచి 8వరకు భారతదేశంలో 74 సమావేశాలు, 40 కన్నా ఎక్కువ నగరాల్లో 17 భాషల్లో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 6న విజయవాడలోని మురళి రిసార్ట్స్‌లో ఈ సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. అందరు ఆహ్వానితులేనని చెప్పారు.

8న ఉచిత మెగా వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు ఆస్పత్రిలో 37వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 8న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాధవి చెప్పారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లకు సంబంధించిన పరీక్షలు, ఎక్స్‌రే, బీఎండీ వంటివి ఉచితంగా నిర్వహిస్తామన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 6న పిల్లల్లో ఊబకాయంతో వచ్చే దుష్ఫలితాలపై చిత్రలేఖనం, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎంజే నాయుడు, డాక్టర్ వంశీ, ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

అమెరికా ఎకానమీపై విద్యార్థులకు అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అమెరికన్ సొసైటీ, కల్చర్ అండ్ ఎకానమీ అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూఎస్ఏకు చెందిన డాక్టర్ సురేఖ నేరెళ్ల ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇండియన్ సొసైటీ కల్చర్ అండ్ ఎకానమీ, అమెరికన్ ఎకానమీకి ఉన్న సంబంధాన్ని తెలియజేశారు. అలాగే అమెరికాలో విద్యావిధానం, ఆరోగ్యం, సివిల్ రైట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎస్‌జే సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై 'చేరువ'తో అవగాహన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సోషల్ మీడియా, సైబర్ నేరాలపై పోలీసు శాఖకు చెందిన చేరువ వాహనం ద్వారా పోలీసులు అవగాహన కల్పించారు. చేరువ వాహనంలోని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ఏ విధంగా నేరాలు జరుగుతాయి, వాటి నుంచి ఏ విధంగా జాగ్రత్తగా ఉండాల్లో పోలీసు శాఖ చిన్నచిన్న నాటికల ద్వారా వివరించింది. పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై సూచనలందించారు. వాటితో పాటుగా చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలను సైతం ఈ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. యువతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా వివరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రథం సెంటర్, కనకదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో పాదచారులు, భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీ కాలనీ, జయప్రకాష్ నగర్, ఫిల్మ్ కాలనీ, క్రీస్తురాజపురం, మిధులా నగర్, వరలక్ష్మి నగర్, ప్రశాంతి నగర్‌ల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పటమట పరిధిలో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈఈ పి. హరిబాబు తెలిపారు. ఇందులో భాగంగా యార్లగడ్డ అప్పారావువీధి, చౌదరిపేట, ధనేకులవారివీధితో పాటు అశోక్‌నగర్ తో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

అందరికీ ఆరోగ్య సురక్ష

- నియోజకవర్గంలో రేపటి నుంచి ప్రారంభం
- మొత్తం 12 యూపీహెచ్‌సీల పరిధిలో శిబిరాల నిర్వహణ
- ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి చేసిన ఆరోగ్య సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వశాఖలతో పాటు ప్రజా ప్రతినిధులు తమ వంతు కృషి చేస్తున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 6 నుంచి నవంబర్ 6 వరకూ నెల రోజులపాటు 12 ప్రాంతాల్లో మెగా ఆరోగ్య మేళాలు నిర్వహించనున్నారు. ఈ ఆరోగ్య మేళాల్లో మెడికల్ ఆఫీసర్లతో పాటు, స్పెషలిస్టు వైద్యులు సైతం పాల్గొని పరీక్షలు చేయనున్నారు.



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

శిబిరాల షెడ్యూల్ ఇలా..

అక్టోబర్ 6న: క్రైస్ట్ ద కింగ్ స్కూల్ క్రీస్తురాజుపురం
అక్టోబర్ 9న: కేఎస్ఆర్ జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, పటమట లంక
అక్టోబర్ 11న: ఏపీఎస్ఆర్ఎంసీ స్కూల్, కృష్ణలంక
అక్టోబర్ 13న: బిషప్ గ్రాసీ స్కూల్, గుణదల
అక్టోబర్ 18న: కేబీసీ జిల్లా పరిషత్ స్కూల్, పటమట
అక్టోబర్ 20న: వాసవీ కల్యాణ మండపం, కృష్ణలంక
అక్టోబర్ 24న: మేరీస్టెల్లా కళాశాల, బెంజిసర్కిల్
అక్టోబర్ 26న: క్యాంపిల్ బిల్డింగ్, రాణీగారితోట
అక్టోబర్ 30న: జీడీఈటీ స్కూల్, పటమట
నవంబర్ 1న: యూపీహెచ్‌సీ, ఏపీఐఐసీ కాలనీ
నవంబర్ 3న: విజేత స్కూల్ రామలింగేశ్వరనగర్
నవంబర్ 6న: విజేత స్కూల్, రామలింగేశ్వరనగర్

అందుకోసం వలంటీర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి చేసి, వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి టోకెన్‌లు ఇచ్చారు. వారి ప్రాంతంలో మెగా ఆరోగ్య మేళాలు జరిగే సమయంలో వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

విస్తృత అవగాహన..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు విస్తృత అవగాహన కలిగించనున్నారు. అందులో భాగంగా ప్రజా ప్రతినిధులు సైతం భాగస్వాములవుతున్నారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలోని కార్పొరేటర్‌లు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు వంటి వారితో నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఆరోగ్య మేళాలు నిర్వహించే సమయంలో వీలైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వస్తోంది. దీని ద్వారా స్పెషలిస్టు వైద్యులనే ప్రజల వద్దకు పంపిస్తోంది. దీనిలో భాగంగా మెగా ఆరోగ్య మేళాలు నిర్వహించి ప్రజలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించడమే కాకుండా, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆస్పత్రులో చికిత్సలు అందిస్తారు. నియోజకవర్గంలో నిర్వహించే ఈ ఆరోగ్య మేళాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– దేవినేని అవినాష్, ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం

పర్యావరణహిత వస్తువులను వాడాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను మనం నిత్యం ఉపయోగించడం వల్ల అనేక రకాల జబ్బులకు గురవుతామని అందువల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని పర్యావరణ వేత్త వి.శ్రీదేవి అన్నారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం-పర్యావరణానికి ముప్పు అనే అంశంపై సదస్సు బుధవారం జరిగింది. శ్రీదేవి అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్‌లో స్టైరీన్, బెంజీన్ వంటి విషపూరిత రసాయనాలుంటాయని, ఇవి మనిషి శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్, శ్వాసకోశ, కిడ్నీ, కాలేయ సంబంధ వ్యాధులను కలిగించే ప్రమాదం ఉందన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా క్లాత్, పేపర్, జ్యూట్ బ్యాగ్స్‌ని ఉపయోగించాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల కాలుష్యం ఎక్కువగా జరుగుతోందన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమతో పాటుగా శిక్షణార్థులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటామని సదస్సునకు హాజరైన వారు ప్రతిజ్ఞ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

దర్గా అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే మసీదులు, దర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. గన్నవరం నియోజకవర్గం పరిధిలోని ముస్తాబాద్ గ్రామంలో 350 ఏళ్ల చరిత్ర కలిగిన ముస్తఫా వలి బాబా దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాను సింగ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ముస్తఫా వలి బాబా దర్గాలో అనేక సమస్యలు నెలకొన్నాయని, ప్రధానంగా దర్గాకు రోడ్డు మార్గం లేకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయనకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్సీ రుహుల్లా సానుకూలంగా స్పందించి, దర్గా అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి తప్పకుండా సహాయం అందిస్తామని, గన్నవరం ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడి రోడ్డు మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాను ఇస్లాం సంప్రదాయం ప్రకారం సన్మానించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ప్రత్యేక దువా చేశారు. దర్గా ముజావర్లు షేక్ మహిబుల్లాఖాన్, హుసేన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రుహుల్లాను సన్మానిస్తున్న దర్గా కమిటీ పెద్దలు

శంకరన్ జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆదర్శ ఉన్నతాధికారి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు వర్గాల సంక్షేమానికి తన జీవితాన్ని త్యాగం చేసిన ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యాక్రమాలను ఏటా ఘనంగా జరపాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. బుధవారం లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి అక్టోబర్ 7న, జయంతి 22న రాష్ట్ర మంతటా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్‌ల అంతటి గొప్ప వ్యక్తిత్వం శంకరన్‌కు ఉందన్నారు.

ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ ఏర్పాటు..

సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కన్వీనర్‌గా శంకరన్ మెమోరియల్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో మరో 30 మంది కో కన్వీనర్స్‌గా నియమించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

15 నుంచి దసరా ఉత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొగల్‌రాజుపురం సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ గోకరాజు గంగరాజు, వైస్ చైర్మన్ చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఐలాపురం హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. దసరా అంటే రాష్ట్రంలోనే విజయవాడ ప్రసిద్ధ గాంచిన పండుగ అన్నారు. మైసూర్ నగరాన్ని తలపించే విధంగా దసరా ఉత్సవాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి దీక్షాపరులు, సామాన్య ప్రజలు వేర్వేరుగా అమ్మవారి దర్శనం నేరుగా చేసుకునేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 15 నుంచి 24 వరకు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారన్నారు. 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న శ్రీ మహాచండీ, 20న సరస్వతీ దేవి, 21న లలితా త్రిపుర సుందరీ, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్దిని, 24న రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో వేదపండితులు, ఘనాపాటీల పర్యవేక్షణలో శతచండీ మహారుద్రయాగం, కుంకుమార్చన జరుగుతాయన్నారు. అనంతరం ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ, చలువాది మల్లికార్జునరావు, కొల్లి హారిక, బి. రాంప్రసాద్‌రెడ్డి, గ్రంధి రామ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న కమిటీ చైర్మన్ గోకరాజు గంగరాజు

ధన్వంతరి జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య విజ్ఞప్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాయీ బ్రాహ్మణుల కులదైవమైన ధన్వంతరి జయంతి వేడుకలను ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన బోర్డ్ మీటింగ్‌లో తీర్మానం చేశారు. బోర్డ్ సమావేశంలో ఇప్పటి వరకు చేసిన తీర్మానాలపై సమీక్షించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ పర్సన్ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్, బీసీ కార్పొరేషన్ల కో ఆర్డినేటర్ అగ్రహారం ప్రవీణ్, కార్పొరేషన్ డైరెక్టర్లు నూకరాజు, కాపవరపు శ్రీదేవి, పుల్లయ్య, శ్రీనివాస్, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు యలమంద పాల్గొన్నారు.

అతిరాస కులస్తులకు క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇవ్వాలి..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న అతిరాస కులస్తులందరికీ క్యాస్ట్ సర్టిఫికెట్లు జారీచేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం నిర్వహించిన బోర్డ్ మీటింగ్‌లో ఈ మేరకు తీర్మానం చేశారు. అలాగే అతిరాస కులస్తుల వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు మరో 11 తీర్మానాలను కూడా చేశారు. సమావేశంలో అతిరాస కార్పొరేషన్ ఎండీ చినబాబు, బీసీ కార్పొరేషన్ల కో ఆర్డినేటర్ అగ్రహారం ప్రవీణ్, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో యానాదయ్య తదితరులు



అతిరాస కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో భాస్కరరావు, తదితరులు

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేట బీరువాల కంపెనీ ప్రాంతానికి చెందిన షేక్ సాదిక్‌బేగం, మహ్మద్ వలీ భార్యాభర్తలు. మహ్మద్ వలీ తాపీ పని చేస్తుంటాడు. వలీ కొంత కాలంగా తెలిసిన వారి వద్ద నుంచి సుమారు రూ. 1.50 లక్షల వరకు అప్పులు చేశాడు. 18వ తేద ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన సాదిక్ బేగంకు ఇంట్లో భర్త కనిపించలేదు. దీంతో తెలిసిన వారిని ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త కనిపించకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగరవాసుల ఆహ్లాదానికే పార్కులు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరవాసులకు అభివృద్ధితో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు వీఎంసీ ప్రణాళికబద్ధంగా పార్కులను అభివృద్ధి చేస్తోందని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.25కి.మీ. పొడవున సుమారు రూ.7.8 కోట్ల వీఎంసీ, రూ.4.5 కోట్ల అర్బన్ గ్రీనరీ నిధులతో కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంబడి నిర్మిస్తున్న రెటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రీ కెనాపీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బెస్మెంట్ పనులపై ఆరా తీశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పార్కు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు.

సీఎం ప్రత్యేక దృష్టి..

ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నదీతీరంలో సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో గడిపేందుకు రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఒకేసారి 250 నుంచి 500 మంది వరకు వాకింగ్ చేసేందుకు వీలు ఉండేలా వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామన్నారు. నాలుగు మీటర్ల వెడల్పులో సైక్లింగ్ ట్రాక్, దానికి ఆనుకుని 10 మీటర్ల వెడల్పులో ఆహ్లాదకరంగా ఉండేలా పార్కు నిర్మిస్తున్నామన్నారు. పార్కులో ఓపెన్ జిమ్, గ్రూప్ సిట్టింగ్ ప్లేస్, పీడెడ్ సిటింగ్ ప్లేస్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పార్కు సందర్శకుల సౌకర్యార్థం భారీసంఖ్యలో వాహనాల పార్కింగ్‌కు అనువుగా స్థలాన్ని కేటాయించామని, పార్కు ఎంట్రన్స్, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఆకర్షణీయమైన ట్రీ ఫౌంటైన్ స్టైల్ ఆర్చి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంకా రాత్రివేళ్లలో కళ్లు మిరిమిట్లు గొలిపేలా ఆర్చికి, వాకింగ్, సైక్లింగ్ ట్రాకింగ్‌లకు కాంతి వంతమైన లైటింగ్ ఏర్పాటు చేయనున్నామని వివరించారు.



రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఫుట్‌పాత్ పనుల పరిశీలన..

అనంతరం బందరు రోడ్డులోని సబ్ కలెక్టర్ పెట్రోల్ బంక్ సమీపంలో జరుగుతున్న కారిడార్ ఫుట్ పాత్ నిర్మాణ పనులను పరిశీలించారు. నగరంలోని అన్ని ప్రధాన జంక్షన్లు అభివృద్ధి పరిచే విధంగా వీఎంసీ కృషి చేస్తోందన్నారు. బందరు రోడ్డుకు ఇరువైపులా 7 కి.మీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రూ.7.8 కోట్లతో కారిడార్ ఫుట్ పాత్ నిర్మాణ పనులను జరుగుతున్నాయని, ఇప్పటి వరకు 3 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తయ్యాయని, ఇంకా 3.7కి.మీ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏ.ఎస్.ఎన్.ప్రసాద్, వి.చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్మృతి వనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన స్మృతివనం పనులను పరిశీలించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తయిన విగ్రహ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, కారిడార్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ కూడా వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాంగణంలో లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్మృతివనంలో మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ సీలింగ్, ఎలక్ట్రిసిటీ పనులను పెయింటింగ్ పనులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



స్మృతివనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వైఎస్సార్ బీమా అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ 47వ డివిజన్‌లోని 151వ సచివాలయ పరిధి క్లస్టర్-5లో నివసించే రాళ్లపూడి అశోక్ మంగళవారం గుండెపోటుతో మరణించారు. మృతుడి పేరు వైఎస్సార్ బీమా పథకంలో నమోదు అయినందున లక్ష రూపాయలు మంజూరయ్యాయి. బుధవారం మృతుడి అంత్రక్రియల సందర్భంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ, డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యులు గోదావరి బాబు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాన్ని ఆవిష్కరించేవి కార్టూన్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజాన్ని దగ్గరగా ఆవిష్కరించే శక్తి కార్టూన్లకు ఉంటుందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కోసా, ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్టూన్స్ వేయటంపై శిక్షణ శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపిశెట్టి మల్లయ్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా స్వల్ప మాటలతో, చిట్టిచిట్టి బొమ్మలతో అద్భుతమైన సందేశాన్నిందించటమే కాకుండా ఆలోచింపజేసేలా చేయొచ్చన్నారు. మానవ జీవితంలోని చాలా అంశాలను కార్టూనిస్టులు అద్భుతంగా వేసి సమాజాన్ని జాగృతం చేస్తున్నారని వివరించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందిస్తున్న గోపిశెట్టి మల్లయ్య

ఎల్‌కేజీ విద్యార్థికి ఐబీఆర్‌లో స్థానం



పటమట(విజయవాడ తూర్పు): పటమట పోస్టల్ కాలనీలోని ఎస్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న ఆర్న బూసి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్(ఐబీఆర్)లో స్థానం పొందిందని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్న 56 దేశాల రాజధానుల పేర్లు, మన దేశంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల రాజధానుల పేర్లు, 17 మంది పరిశోధకుల పేర్లు వారాల పేర్లు, గ్రహాల,పేర్లు, ఏడుగురు ప్రముఖ వ్యక్తుల పేర్లు చెప్పడంలో చూపిన ప్రతిభకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ చిన్నారి మేధస్సును మెచ్చుకుంటూ పాఠశాలల్లో అభినందన కార్యక్రమం నిర్వహించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనలకు అనుగుణంగా వారికి లక్ష్యాన్ని నిర్దేశించాలని అప్పుడే చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపల్ సునీత చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష


విశాఖలోని గాజువాక జెడ్పీ హైస్కూల్లో రోగులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది


తిరుపతి జిల్లా కొమ్మనేటూరు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


శ్రీకాకుళం జిల్లా జాడుపూడిలో వెద్య శిబిరానికి హాజరైన రోగులు


పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గంగాడలో రోగిని పరీక్షిస్తున్న గళావల్లి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరావు


అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం దుద్దేకుంటలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలకు వచ్చిన ప్రజలు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం జి.వేమవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు


ప్రకాశం జిల్లా టంగుటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు


నంద్యాల జిల్లా మిట్టపల్లెలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం జాలాది గ్రామంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న దృశ్యం


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిన్నఅన్నలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు


వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం చియ్యపాడు గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరానికి వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలు


ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధుడికి రక్త పరీక్ష చేస్తున్న వైద్యులు


ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగిన వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు

క్లుప్తంగా...

మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు తప్పే

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నగరి(చిత్తూరు జిల్లా): మంత్రి ఆర్కే రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండారు సత్యనారాయణమూర్తిని అరెస్టు చేయడం తప్పేమీకాదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ విమర్శలు, ప్రతి విమర్శలు చేసేవారిని రాజకీయ ప్రత్యర్థులుగానే చూడాలి తప్ప వ్యక్తిగత ప్రత్యర్థులుగా చూడకూడదన్నారు. రాజకీయంగా ఎదుర్కోవాలేగానీ వ్యక్తిగత క్యారెక్టర్ గురించి నిందలు వేయకూడదని హితవుపలికారు. రాజకీయాల్లో ఉన్న మహిళల మీద, వారి వ్యక్తిగత జీవితాల మీద మాట్లాడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకూడదని, వాళ్లకు శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో చట్టరీత్యా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము సమర్థిస్తున్నామన్నారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు: రఘువీరా



చిత్తూరు కలెక్టరేట్ (చిత్తూరు జిల్లా): ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సేవ్ కాన్‌స్టిట్యూషన్, సేవ్ డెమోక్రసీ, సేవ్ నేషన్ (ఏపీకి ప్రత్యేక హోదా ఏమైంది) పేరుతో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గాంధీ రోడ్డులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన విభజన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ఏపీకి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన ప్రత్యేక హోదాను బీజేపీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ సినీ నటుడు చిరంజీవి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురదజల్లాలనే పవన్ కుట్ర

మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లాలనే కుట్రతో పవన్‌కళ్యాణ్ వ్యవహరిస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. రాష్ట్రంలో జరిగే పవన్‌కళ్యాణ్ బహిరంగసభలకు ఆయనే తన అభిమానులను పిలిపించుకుని రాయిరాప్పా వేయించుకుని, ప్రభుత్వం మీద బురదజల్లాలనే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది తెలుగుదేశం వారి సలహామేరకు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని మంత్రి చెప్పారు.

తెలంగాణ ఓటర్లు 3,17,17,389 మంది

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,17,17,389 కాగా, ఇందులో 1,58,71,493 మంది పురుషులు, 1,58,43,339మంది మహిళలు, 2,557 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రెండో ప్రత్యేక సవరణ చేపట్టారు. ఆ తర్వాత రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల తుదిఓటర్ల జాబితాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానఅధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ బుధవారం ప్రకటించారు.

దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారు.. సాక్షులను బెదిరిస్తున్నారు

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించండి

- స్కిల్ కుంభకోణం అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే సాగింది
- ఆయన 13 సంతకాలతో సహా బలమైన ఆధారాలున్నాయి
- ఏసీబీ న్యాయస్థానాన్ని కోరిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోరిన ఆయన న్యాయవాది దూబే
- కేసు విచారణను గురువారానికి వాయిదా వేసిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి : 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసు కీలక దశలో ఉంది. రూ.371 కోట్లు కొల్లగొట్టిన ఈ సామాజిక, ఆర్థిక కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా తానై చంద్రబాబు వ్యవహరించారు. ఈ కేసులో ఇప్పటికే ఆయన సాక్షులను బెదిరిస్తున్నారు. ఈ తరుణంలో ఆయన బెయిల్‌పై బయటకొస్తే మిగిలిన సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును ప్రభావితంచేసే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతున్నా'.. అని రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి న్యాయస్థానాన్ని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తూ చంద్రబాబుకు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించేందుకు ఉన్న బలమైన కారణాలను న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర సుస్పష్టమన్నారు. జీఓ జారీ, అందుకు విరుద్ధంగా ఒప్పందం కుదుర్చుకోవడం, అధికారుల నియామకం, ఆర్థిక శాఖ అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధుల విడుదల.. ఇలా అన్ని దశల్లోనూ చంద్రబాబే ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. అందుకు 13 నోట్‌ఫైళ్లపై చంద్రబాబు సంతకాలు చేయడమే నిదర్శనమన్నారు. జీఓ నంబర్ 4 కంటే ముందే ఒప్పందం కుదుర్చుకున్నారని.. కానీ, ఆ ఒప్పందాన్ని జీఓలో ఎందుకు ప్రస్తావించలేదన్నది ఈ



కేసులో కీలకమన్నారు. ఆర్థిక శాఖ అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలను చంద్రబాబు దురుద్దేశపూరితంగానే తన విచక్షణాధికారాలు (వీటో)తో తోసిపుచ్చారని న్యాయస్థానానికి వివరించారు.

బాబు బెదిరింపులపై ఆధారాలున్నాయి..

అంతేకాదు.. తాను చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని.. వారిని పదవుల నుంచి తొలగిస్తానని ఆనాడు సీఎం హోదాలో చంద్రబాబు అధికారులను బెదిరించినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని కూడా పొన్నవోలు న్యాయస్థానానికి వివరించారు. స్కిల్ కుంభకోణం ఏమీ ఫిక్షన్ కథ కాదని, ప్రభుత్వ నిధులు కొల్లగొట్టిన అవినీతి వ్యవహారమని చెప్పారు. ఆ మేరకు సమగ్ర దర్యాప్తు ద్వారా సీఐడీ గుర్తించి నివేదించిన ఆధారాలను పరిశీలించాలని న్యాయస్థానాన్ని కోరారు. షెల్ కంపెనీలు, నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా పన్ను ఎగవేతను 2017లోనే జీఎస్టీ అధికారులు గుర్తించారన్నారు. ఈ కేసు కేంద్ర దర్యాప్తు సంస్థల దర్యాప్తులో ఉండగానే 2018లో 17ఏ సవరణ చేశారనే విషయాన్ని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. కాబట్టి ఈ కేసులో చంద్రబాబుకు 17ఏ వర్తించదన్నారు.

వాదనలపై వక్రీకరణలా!?

ఏబీఎన్, టీవీ–5పై ఏఏజీ పొన్నవోలు ఆగ్రహం

మరోవైపు.. న్యాయస్థానంలో జరిగిన వాదనలను వక్రీకరిస్తూ ఏబీఎన్, టీవీ–5 చానళ్లు తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నాయని అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఆ రెండు చానళ్లు తనను లొంగదీసుకోవాలని చూస్తున్నాయని.. అది సాధ్యం కాకపోవడంతో తనపై బురద జల్లుతున్నాయని ఆయన విమర్శించారు. విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ప్రాంగణంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు విచారణ సమయంలో న్యాయస్థానం తనపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు ఏబీఎన్, టీవీ–5 చానళ్లు దుష్ప్రచారం చేశాయని విమర్శించారు. అత్యంత కీలకమైన ఈ కేసులో ప్రభుత్వం తరఫున తాను బుధవారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5గంటల వరకు వినిపించిన వాదనను న్యాయస్థానం ఓపిగ్గా విందన్నారు. ఆ సమయంలో న్యాయస్థానం తనపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని.. నిరూపించలేకపోతే ఏం చేస్తారని ఏబీఎన్, టీవీ–5 చానళ్లకు పొన్నవోలు సవాల్ విసిరారు. ఆ రెండు చానళ్లు టీవీ చర్చల్లో తనను తిట్టిస్తున్నా సహించానని కానీ, ఏకంగా న్యాయస్థానంలో వాదనలను వక్రీకరించడాన్ని మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. ఈ విషయాన్ని గురువారం విచారణ సమయంలో న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆ రెండు చానళ్లకు ధైర్యం ఉంటే గురువారం న్యాయస్థానం విచారణ సమయంలో రావాలని సవాల్ విసిరారు.

చంద్రబాబు ఆదేశాలతోనే వారిద్దరు పరార్..

ఇక నిధులను అక్రమంగా తరలించడంలో కీలక వ్యక్తులైన చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని దేశం విడిచి పరారైన ఉదంతాన్ని ప్రస్తావించారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని వారిని సీఐడీ నోటీసులు ఇవ్వగానే దేశం విడిచిపెట్టి పోవడం తీవ్రమైన పరిణామమన్నారు. చంద్రబాబు ఆదేశాలతోనే వారిద్దరూ పరారయ్యారని చెప్పారు. పెండ్యాల శ్రీనివాస్ పాస్‌పోర్ట్‌ను సీజ్ చేసేలా న్యాయస్థానం ఆదేశించాలని కోరారు. ఇక ఈ కేసులో గతంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చిన అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ప్రస్తుతం అందుకు భిన్నంగా మీడియా చానళ్లలో చర్చల్లో మాట్లాడుతుండటం వెనుక చంద్రబాబు ఒత్తిడి ఉందన్నారు. కాబట్టి ఈ తరుణంలో చంద్రబాబుకు బెయిల్ ఇస్తే ఆయన తన రాజకీయ పలుకుబడితో సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును పక్కదారి పట్టించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కాబట్టి ఈ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలని న్యాయస్థానాన్ని అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోరారు.

సాక్షులను ప్రభావితం చేసే అవకాశంలేదు : దూబే

అంతకుముందు.. ఈ కేసులో ముద్దాయి చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ.. ఆర్థిక శాఖ అధికారులు గుజరాత్ వెళ్లి అధ్యయనం చేసి ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదన్నారు. ఈ ప్రాజెక్టు విలువను నిర్ణయించిన కాస్ట్ వేల్యూయేషన్ కమిటీలో చంద్రబాబు లేరన్నారు. ఆ కమిటీలో సభ్యుడిగా ఉన్న భాస్కరరావు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని చెప్పారు. కేబినెట్ నిర్ణయం మేరకు చేసుకున్న ఒప్పందంలో చంద్రబాబును తప్పుబట్టడానికి లేదన్నారు. సాక్షులను ప్రభావితం చేయడంగానీ, ఆధారాలను ధ్వంసం చేయడంగానీ పరారయ్యే అవకాశంగానీ లేనందున చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. అనంతరం .. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలని, ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఆయనకు పీటీ వారంట్ జారీచేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా న్యాయస్థానం గురువారం విచారించే అవకాశాలున్నాయి.

జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోయినా ఐ డోంట్ కేర్

- అక్క పురందేశ్వరితో టచ్‌లో ఉన్నా
- తెలంగాణలో ఓట్ల కోసం కొందరు చంద్రబాబు జపం చేస్తున్నారు
- హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



సాక్షి, హైదరాబాద్: చంద్రబాబు అరెస్టుపై జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోయినా పట్టించుకోనని.., ఐ డోంట్ కేర్ అని హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన బుధవారం ఇక్కడ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టును సినిమా రంగంలో ఎవరు ఖండించకపోయినా పట్టించుకోనని అన్నారు. అరెస్టు జరిగి నెల గడుస్తున్నా ఇంకా ఇక్కడ ఎవరూ ఖండించలేదన్నారు. చంద్రబాబు అరెస్టు అంశంపై అక్క పురందేశ్వరితో టచ్‌లో ఉన్నానని, కేంద్ర పెద్దలను కలుస్తానని చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇక్కడి నేతలు మూడు రోజులుగా చంద్రబాబు జపం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అరెస్టు అన్యాయం అని అంటున్నారే తప్ప ఒక్కరు కూడా జరిగిన ఘటన గురించి మాట్లాడటంలేదని పరోక్షంగా బీఆర్ఎస్ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. బాబు ద్వారా దేశం లబ్ధి పొందిందని, ఆయన అరెస్టును దేశం మొత్తం ఖండించిందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి ఎన్టీఆర్, చంద్రబాబు వేసిన బీజమేనన్నారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాబోయే ఎన్నికల యుద్ధానికి సిద్ధమైందని, తెలంగాణ పార్టీకి తాను అండగా ఉన్నానని తెలిపారు. రెండు రాష్ట్రాలూ తనకు రెండు కళ్లు వంటివని చెప్పారు. తెలంగాణలో పొత్తుల విషయం చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు. విలేకరుల సమావేశంలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు.

ప్రభుత్వ సీబీఎస్‌ఈ స్కూళ్లల్లో తొలిసారి పరీక్షలు

ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి..

- 8, 9 తరగతులకు పీడబ్ల్యూటీ, టర్మ్ టెస్టులు
- ఈ నెల 12 వరకు తొమ్మిదో తరగతి విద్యార్థులకు సీబీఎస్‌ఈ రిజిస్ట్రేషన్లు
- రేపటి నుంచి 9 వరకు పీడబ్ల్యూటీ పరీక్షలు
- పదో తరగతికి ఐదు పేపర్లు, ఆరో పేపర్‌గా స్కిల్ టెస్ట్
- ఏప్రిల్ 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు బోధన

సాక్షి, అమరావతి: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సిలబస్ బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి 8, 9 తరగతుల విద్యార్థులు పీరియాడిక్ రాత పరీక్షలు (పీడబ్ల్యూటీ), టర్మ్ పరీక్షలు రాయనున్నారు. గతేడాది 1,000 ప్రభుత్వ పాఠశాలలకు సీబీఎస్‌ఈ గుర్తింపు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అప్పటికే దాదాపు విద్యా సంవత్సరం పూర్తవడంతో ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు స్టేట్ బోర్డు పరీక్షలైన ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లకే హాజరయ్యారు. కాగా, ఈ విద్యా సంవత్సరం (2023–24) నుంచి సీబీఎస్‌ఈ బోర్డు నిర్వహించే పీడబ్ల్యూటీ, టర్మ్ పరీక్షలు రాయనున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో వెయ్యి పాఠశాలల్లో 8వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ బోధనకు అనుమతి వచ్చింది. ఈ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు 2023–24 నుంచి సీబీఎస్‌ఈ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆ బోర్డు పరీక్షలు రాస్తారని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు సైతం జారీ చేశారు. దీని ప్రకారం 8, 9 తరగతులకు ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల తరహాలో పీరియాడిక్ పరీక్షలు (పీడబ్ల్యూటీ), టర్మ్ టెస్టులు నిర్వహించనున్నారు. ఈ నెల 6 నుంచి 9 వరకు పీడబ్ల్యూటీ జరగనున్నాయి.

విషయ పరిజ్ఞానం పెంచేలా..

విద్యా సంవత్సరంలో పీడబ్ల్యూటీలు నాలుగు, టర్మ్ పరీక్షలు రెండు ఉంటాయి. టర్మ్–1 నవంబర్‌లో, టర్మ్–2 (వార్షిక) పరీక్షలను మార్చిలో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్, రెండు భాషా పేపర్లు (మొదటి భాషగా ఆంగ్లం, రెండో భాషగా తెలుగు) రాయాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టు 50 మార్కులకు నిర్వహించే పీడబ్ల్యూటీలో 40 మార్కులకు రాత, 10 మార్కులకు ఇంటర్నల్ థియరీ పరీక్ష ఉంటుంది. 100 మార్కుల టర్మ్ పరీక్షలో 80 మార్కులకు రాత, 20 మార్కులకు అంతర్గత పరీక్షలు (ఇంటర్నల్ థియరీ) ఉంటాయి. విద్యార్థులు ఉత్తీర్ణులవ్వాలంటే ప్రతి సబ్జెక్టులో 33 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది. సబ్జెక్టుల్లో ప్రాజెక్టులు, ల్యాబ్ టెస్టులు కూడా ఉంటాయి. పిల్లలు జాతీయ, అంతర్జాతీయంగా విద్యార్థులతో పోటీపడేలా పరీక్షల్లో విషయ పరిజ్ఞానంపై ప్రశ్నలు ఇవ్వనున్నారు. అకడమిక్ మార్కులు కంటే.. విద్యార్థి మానసిక వికాసం, విశ్లేషణ సామర్థ్యాలను పెంచేందుకు వీలుగా ఇంటర్నల్ పరీక్షలు ఉంటాయి. ఇందులో పెన్ పేపర్ టెస్ట్ (5 మార్కులు), మల్టిపుల్ అసెస్‌మెంట్ (5), ఫోర్ట్‌పోలియో (5), సబ్జెక్టుపై విద్యార్థికున్న అవగాహనకు 5 మార్కులు మొత్తం 20 మార్కులు కేటాయించారు. భాషా పరీక్షలో వ్యూహాత్మకంగా పరిష్కరించే పజిల్స్, క్లాస్‌వర్క్, ఇంగ్లిష్ మాట్లాడడం, విని అర్థం చేసుకునే సామర్థ్యంపైన ప్రశ్నలు ఉంటాయి. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న 85,353 మంది విద్యార్థులకు సీబీఎస్‌ఈ బోర్డు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. వీరికి వచ్చే ఏడాది మార్చి 31 నాటికి అన్ని పరీక్షలు పూర్తిచేసి, ఏప్రిల్ 1 నుంచి 10వ తరగతి సిలబస్‌ను బోధించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

10వ తరగతిలో 'స్కిల్' సబ్జెక్టు

ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం(2024–25)లో 10వ తరగతిలో సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలు రాయనున్నారు. ఈ క్రమంలో వీరికి ఆరో సబ్జెక్టుగా 'స్కిల్ టెస్ట్'ను ప్రవేశపెట్టారు. మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ పరీక్షలో తప్పిన విద్యార్థులు స్కిల్ సబ్జెక్టులో ఉత్తీర్ణులైతే ఈ మార్కులను పరిగణనలోకి తీసుకుని పాస్ చేస్తారు. ఆరో సబ్జెక్టుగా విద్యార్థుల కోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టులను ప్రవేశపెట్టారు. పదో తరగతి విద్యార్థులు ఈ రెండింటిలో ఒకదాన్ని ఆరో సబ్జెక్టుగా చదవాల్సి ఉంటుంది.

జాగ్రత్త పాటించండి



సీబీఎస్‌ఈ బోర్డు క్యాలెండర్ ప్రకారం.. వచ్చే మార్చి 31 నాటికి 9వ తరగతి పరీక్షలు పూర్తిచేసి, ఏప్రిల్ 1 నుంచి 10వ తరగతి బోధన చేపట్టాలి. అందుకనుగుణంగా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం 9వ తరగతి విద్యార్థుల బోర్డు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12 వరకు కొనసాగుతుంది. విద్యార్థుల వివరాల నమోదులో పాఠశాలల ప్రిన్సిపాళ్లు జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థి పేరు, ఆధార్, తల్లిదండ్రుల వివరాలు పుట్టిన తేదీ ఇలా ప్రతి అంశంలోనూ జాగ్రత్త వహించాలి.

– ఎం.వి.కృష్ణారెడ్డి, జాయింట్ డైరెక్టర్, సీబీఎస్‌ఈ స్కూల్స్.

'దాడి'పై ఆధారాలు చూపండి

- పవన్‌కళ్యాణ్‌కు కృష్ణాజిల్లా పోలీసుల నోటీసు
- పెడనలో వారాహిపై రాళ్లదాడికి ప్రత్యర్థుల ప్రయత్నం అంటూ వ్యాఖ్యలు
- అలాంటిదే జరిగితే వారి కాళ్లు, చేతులు కట్టేసి మడత పెట్టేయాలంటూ కార్యకర్తలకు పవన్ పిలుపు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న జనసేన అధినేతపై పోలీసులు సీరియస్

కోనేరు సెంటర్: శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తన పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతూ చేసిన వ్యాఖ్యలపై కృష్ణాజిల్లా పోలీసులు సీరియస్ అయ్యారు. పార్టీ శ్రేణులను రెచ్చగొట్టడంతో పాటు శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు చూపాలంటూ వారు మంగళవారం రాత్రి పవన్‌కు నోటీసు జారీచేశారు. దాడి చేసేవారి కాళ్లు, చేతులు కట్టేసి మడత పెట్టేయాలంటూ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. కృష్ణాజిల్లా ఎస్పీ పి. జాషువా బుధవారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ జిల్లాలో చేపట్టిన వారాహి యాత్రకు జిల్లా పోలీసులు అన్ని విధాల సహకరిస్తున్నారన్నారు. పెడనలో జరగబోయే వారాహి యాత్రలో 2,000 మంది దాడికి పూనుకుంటున్నట్లు తనకు సమాచారం ఉందని పవన్ మాట్లాడటం సహేతుకం కాదన్నారు.



వారాహి యాత్రకు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తుండటంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అలాగే, ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్ విభాగాలు అనుక్షణం వాటి పని అవి చేసుకుంటున్నాయన్నారు. వారాహి యాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్నా ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్ విభాగాలు తక్షణమే సమాచారాన్ని తమ దృష్టికి తీసుకువస్తాయన్నారు. నిజంగా అలాంటి సమాచారం ఉంటే పార్టీ అధ్యక్షుడిగా పవన్‌కళ్యాణ్ ఆ విషయాన్ని పోలీసు అధికారుల నోటీసులో పెట్టినట్లైతే తాము వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పవన్ వ్యాఖ్యల్లో నిజంలేదు

ఇక పెడనలో జరిగే వారాహి సభకు సంబంధించి బందోబస్తు నిమిత్తం బందరు సబ్–డివిజన్ పోలీసులతో పాటు జిల్లాలోని మరో 300 మంది సిబ్బందిని నియమించామని ఎస్పీ జాషువా తెలిపారు. అలాగే, పెడనలో దాడికి వ్యూహం పన్నుతున్నట్లు పవన్ చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు. ఆధారాలుంటే పవన్‌కళ్యాణ్ పోలీసుల నుంచి నోటీసు అందుకున్న వెంటనే వారికి అందజేసి ఉండేవారన్నారు. జిల్లాలో ఏ రాజకీయ పార్టీ అయినా సరే శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించినా, మాట్లాడినా, కార్యకర్తలను రెచ్చగొడుతూ తమ ప్రసంగంలో సైగలు చేసినా పోలీసుల దృష్టిలో నేరమేనని ఎస్పీ స్పష్టంచేశారు. ఈ విషయాన్ని నేతలు దృష్టిలో పెట్టుకుని ప్రశాంతమైన వాతావరణంలో సభలు కొనసాగించుకోవాలని జాషువా హితవు పలికారు.

నిధులు అడగొద్దని మాకేం చెప్పలేదు

టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం డిస్కంలకు ప్రభుత్వం ఆర్థిక మద్దతు ఇస్తోంది

- ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ భాగానికి రూ.6 వేల కోట్లు ఇచ్చేసింది
- వినియోగదారులకు అసౌకర్యం కలగకూడదనే స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు
- ఏపీఈఆర్సీ మార్గదర్శకాల ప్రకారమే సర్దుబాటు చార్జీలు
- ఈనాడు కథనాన్ని ఖండించిన డిస్కంల సీఎండీలు పృథ్వీతేజ్, పద్మాజనార్దనరెడ్డి, సంతోషరావు


పృథ్వీతేజ్


పద్మాజనార్దనరెడ్డి


సంతోషరావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ రంగాన్ని గత చంద్రబాబు ప్రభుత్వం అస్తవ్యస్తం చేసి గాలికొదిలేసింది. టీడీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన విద్యుత్ సంస్థలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదుకుంది. రైతులతోపాటు వివిధ వర్గాలకు ఉచిత, రాయితీ విద్యుత్‌ను అందిస్తోంది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు మన విద్యుత్ సంస్థలను ఆదర్శంగా తీసుకునేలా రాష్ట్ర విద్యుత్ రంగం జాతీయ స్థాయిలో అవార్డులను, రికార్డులను సొంతం చేసుకుంటోంది. అలాంటి విద్యుత్ సంస్థలకు 'కోతలు వద్దు.. నిధులు అడగొద్దు' అని ప్రభుత్వం చెప్పినట్లుగా ఈనాడు పత్రిక బుధవారం ఓ కథనాన్ని వండివార్చింది. ఈ ఎల్లో కథనాన్ని ఏపీ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు ఖండించారు. 'ఈనాడు' అచ్చేసినట్లు నిధులు అడగొద్దని ప్రభుత్వం తమకేమీ చెప్పలేదని తేల్చిచెప్పారు. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మేరకు ముగ్గురు సీఎండీలు బుధవారం సాక్షి ప్రతినిధితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఏమన్నారంటే...

- ఈనాడు తన కథనంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలను నిధులు అడగొద్దు అని చెప్పినట్లుగా పేర్కొనడాన్ని ఖండిస్తున్నాం. ఈ కథనం పూర్తిగా అవాస్తవం. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం ఇవ్వాల్సిన ఆర్థిక మద్దతును ఎప్పటికప్పుడు ఇస్తూ వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్థ భాగానికి (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) దాదాపు రూ.6 వేల కోట్లను ప్రభుత్వం డిస్కంలకు సబ్సిడీ రూపంలో ఇవ్వాల్సి ఉండగా ఆ మొత్తాన్ని ఇప్పటికే పూర్తిగా చెల్లించింది.
- కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వినియోగదారులకు 24 గంటల విద్యుత్ అందించడం డిస్కంల బాధ్యత. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి రావలసినంత విద్యుత్ రాకపోవడం, ఈ సీజన్‌లో మారిన వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, వేసవి ఎండలతో ఉక్కపోత వల్ల విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వినియోగదారులు వాడుతున్నదానికి తగ్గట్టు విద్యుత్‌ను సమకూర్చుకోవాలి. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎంత ధరైనా వెచ్చించి స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు చేయాల్సి వచ్చింది. ఈ కొనుగోళ్లు అన్ని పారదర్శక పోటీ బిడ్డింగ్ విధానంలో విద్యుత్ ఎక్స్ఛేంజీల ద్వారా, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డీప్ (డీఈఈపీ) ఈ-బిడ్డింగ్ పోర్టల్ ద్వారా జరిగాయి.
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాల ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన సమయానికి (అక్టోబర్ నుంచి వచ్చే సంవత్సరం మార్చి వరకు) విద్యుత్ సరఫరాలో ఏవిధమైన అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టాం. ఇందులో భాగంగా స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) సూచనల మేరకు దాదాపు 3,830 మిలియన్ యూనిట్లను స్వల్పకాలిక కొనుగోలు ద్వారా సేకరించడానికి ప్రణాళిక రూపొందించాం.
- ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయ సర్దుబాటు చార్జీలు అనేవి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వసూలు చేస్తున్నాం. నెలవారీ అదనపు విద్యుత్ కొనుగోలు వ్యయం ఎంత ఎక్కువ ఉన్నప్పటికీ వినియోగదారుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని కేవలం యూనిట్ రూ.0.40 వరకే వసూలు చేసుకోవడానికి కమిషన్ అనుమతినిచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి నెలవారీ సర్దుబాటు చార్జీలు వినియోగదారుల విద్యుత్ బిల్లుల్లో కనిపిస్తున్నాయి.

అసెంబ్లీ కమిటీల ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీలో 2023–24 సంవత్సరానికి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), ఎస్టిమేట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ (పీయూసీ)లను ఏర్పాటు చేసినట్టు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు బుధవారం బులెటిన్ విడుదల చేశారు. ఆయా కమిటీల చైర్మన్లు, సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ

చైర్మన్‌గా పయ్యావుల కేశవ్, సభ్యులుగా ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, కంబాల జోగులు, కె.సంజీవయ్య, అబ్బయ్యచౌదరి, హఫీజ్‌ఖాన్, జక్కంపూడి రాజా, కె.భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు డాక్టర్ కె.రవిబాబు, పి.అశోక్‌బాబు, కేఎస్ లక్ష్మణరావు నియమితులయ్యారు.

ఎస్టిమేట్స్ కమిటీ

చైర్‌పర్సన్‌గా వి.కళావతి, సభ్యులుగా ఎమ్మెల్యేలు ఎం.తిప్పేస్వామి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జి.కిరణ్‌కుమార్, ఎం.వేణుగోపాల్, పి.పూర్ణచంద్రరావు, వై.సాంబశివరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు డి.చిన్న గోవిందరెడ్డి, బి.కృష్ణరాఘవ జయేంద్ర, డి.రామారావు నియమితులయ్యారు.

పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ

చైర్మన్‌గా గ్రంధి శ్రీనివాస్, సభ్యులుగా ఎమ్మెల్యేలు పి.దొరబాబు, ఎ.రాంబాబు, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కె.వెంకట రోశయ్య, ఆరణి శ్రీనివాసులు, టి.నాగులపల్లి ధనలక్ష్మి, ఎ.జోగారావు, పీజీవీఆర్ నాయుడు, ఎమ్మెల్సీ చెల్లుబోయిన శ్రీనివాసరావు, లేళ్ల అప్పిరెడ్డి, బి.తిరుమల నాయుడు నియమితులయ్యారు.

ప్రభుత్వ విప్‌గా గ్రంధి శ్రీనివాస్


గ్రంధి శ్రీనివాస్


లేళ్ల అప్పిరెడ్డి


విక్రాంత్


మురళీధర్

శాసన సభలో ప్రభుత్వ విప్‌గా భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియమితులయ్యారు. కాగా, శాసనమండలిలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఎం.మురళీధర్, పాలవలస విక్రాంత్‌లను విప్‌లుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి బుధవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ తిండితో మానసికంగానూ ముప్పే!

- అల్ట్రా ప్రాసెస్ట్ ఫుడ్‌తో ఎన్నో అనర్థాలని ఇప్పటికే అనేక అధ్యయనాల స్పష్టీకరణ
- యూపీఎఫ్‌తో మానసిక సామర్థ్యం సైతం గణనీయంగా తగ్గుతుందని తేల్చిన తాజా పరిశోధన
- ఈ తరహా ఆహారానికి దూరంగా ఉండే వారితో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ హాని
- దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న యూపీఎఫ్ మార్కెట్
- ఇదే పరిస్థితి కొనసాగితే 2032 కల్లా పాశ్చాత్య దేశాల మాదిరి ఆరోగ్య సమస్యలు ఖాయమంటున్న అధ్యయనం



సాక్షి, హైదరాబాద్: అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్ (యూపీఎఫ్) (ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారం) తరచుగా తీసుకోవడం ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు తదితర సమస్యలకు దోహదం చేస్తుందని గతంలో చేసిన అధ్యయనాలు తేల్చాయి. అయితే వీటి వల్ల మానసిక సామర్థ్యం సైతం గణనీయంగా తగ్గుతుందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. రోజుకు పలుమార్లు అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తినే వారు.. ఈ ఆహారాలను అరుదుగా లేదా ఎప్పుడూ తీసుకోని వారితో పోలిస్తే మానసిక ఆరోగ్యంతో బాధపడే అవకాశం దాదాపు మూడు రెట్లు ఎక్కువ అని మన దేశానికి చెందిన 30 వేల మంది వ్యక్తులను భాగస్వాముల్ని చేసిన ఈ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా మానసిక శ్రేయస్సును అధ్యయనం చేసే అమెరికాకు చెందిన లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ సేపియన్ ల్యాబ్స్ గ్లోబల్ మైండ్ ప్రాజెక్ట్‌లో ఈ అధ్యయనం ఒక భాగం. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది నుంచి వచ్చిన ప్రతిస్పందనలు, అధ్యయన ఫలితాలతో ఇటీవల ఒక నివేదిక విడుదల చేశారు.

యూపీఎఫ్ అంటే ఏమిటి?

యూపీఎఫ్‌ను సరైన విధంగా నిర్వచించడం కొంతవరకు కష్టమే. అయితే సగటు గృహాలలో తయారు కాని, ఇంటి వంటగదికి అవల ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలను యూపీఎఫ్‌గా తారా త్యాగరాజన్ నిర్వచిస్తున్నారు. ఎరేటెడ్ డ్రింక్స్ (కొన్నిరకాల శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్స్, ప్యాక్ చేసిన చిప్స్, స్నాక్స్, మిఠాయిలు ఈ కోవలోకి వస్తాయి. దీర్ఘకాలం మన్నేందుకు గాను సాల్ట్, సుగర్, ఫ్యాట్ వంటివి అధికంగా కలిపేవి ప్రాసెస్డ్ ఫుడ్ కాగా, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌లో కృత్రిమ స్వీటెనర్లు, ఫ్లేవర్లు ఇతరత్రా కూడా జత కలుస్తాయి. రెడీ టూ ఈట్ మీల్స్, తీపి పానీయాలు వంటివన్నీ వీటిలో భాగమే.

నానాటికీ పెరుగుతున్న వినియోగం

మన దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో యూపీఎఫ్ కూడా ఉంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్‌తో కలిసి గత ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన ఒక నివేదిక వీటి వినియోగం ఎంతలా ఉందో స్పష్టం చేసింది. కోవిడ్ సందర్భంగా 2020లో కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ ఆ తర్వాత అంతకు ముందుకన్నా రెట్టింపు అమ్మకాలు సాగుతున్నాయని ఈ నివేదిక తేల్చింది. ఈ విజృంభణ ఇలాగే కొనసాగితే 2032 కల్లా పాశ్చాత్య దేశాల్లో ప్రస్తుతం వెల్లువెత్తుతున్న రకరకాల ఆరోగ్య సమస్యలతో మన దేశం కూడా సతమతమవడం తథ్యమని కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

డిప్రెషనే కాదు అంతకు మించి..

'ఈ తరహా ఆహారానికి ఉన్న మన ఆలోచనలు, భావోద్వేగాలను నియంత్రించే సామర్థ్యం ఉందని, దీని అధిక వినియోగం వల్ల డిప్రెషన్ మాత్రమే కాదు అంతకు మించిన మానసిక ఆరోగ్య క్షీణత సంభవిస్తున్నట్టుగా గమనించాం..'అని సేపియన్ ల్యాబ్స్ వ్యవస్థాపకురాలు, చీఫ్ సైంటిస్ట్ తారా త్యాగరాజన్ చెబుతున్నారు. వీటి వినియోగం వల్ల కలిగే మానసిక సమస్యల్లో మానసిక వేదన, నిస్సత్తువ, ఆకలి మందగింపు వంటివి సంభవించే అవకాశం ఉందని అధ్యయనం కనుగొంది. ముఖ్యంగా 18–24 సంవత్సరాల వయస్సు గల యువతలో ఇది బాగా ఎక్కువగా ఉంది. ఎందుకంటే వారు 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలతో పోలిస్తే ప్రతిరోజూ అలాంటి ఆహారాన్ని తీసుకునే అవకాశం రెండు రెట్లు ఎక్కువ.

పన్నులు విధించాలి.. పాఠశాలల్లో నిషేధించాలి

గత నెలలో బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్, న్యూట్రిషన్ అడ్వకసీ ఇన్ పబ్లిక్ ఇంట్రెస్ట్ సంస్థలు సంయుక్తంగా.. మన దేశంలో యూపీఎఫ్‌ల వినియోగం-ప్రభావంపై నిర్వహించిన పరిశోధన పలు హెచ్చరికలు జారీ చేసింది. ఈ సంస్థలు రూపొందించిన నివేదిక.. అన్ని రకాల జంక్ ఫుడ్స్, ప్రీ ప్యాకేజ్డ్ బెవరేజెస్, జ్యూసెస్, బేకరీ ఉత్పత్తులు, కుకీస్, చాకొలెట్స్, కన్ఫెక్షనరీ, హెల్త్ డ్రింక్స్, చిప్స్, ఐస్ క్రీమ్స్, పిజ్జా వంటి ఉత్పత్తులపై వార్నింగ్ లేబుల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖను కోరడం గమనార్హం. కాగా వీటి వినియోగాన్ని నియంత్రించేలా, నిరుత్సాహపరిచేలా పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో వీటి విక్రయాలను నిషేధించాలని, ఈ ఉత్పత్తులపై భారీ జీఎస్టీని విధించాలని కూడా నివేదిక సూచించింది.

10,574 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రతి గడపకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- వచ్చే ఏడాది పాడేరు మెడికల్ కళాశాల ప్రారంభం
- దీంతోపాటు అందుబాటులోకి 600 పడకలతో సూపర్ స్పెషాలిటీ వైద్యం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



కిల్లోగూడ వైద్యశిబిరంలో గిరిజనులకు మందుల కిట్‌లను పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యేలు చెట్టి ఫాల్గుణ, కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్, హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి తదితరులు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రతి గడపకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 10,574 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కిల్లోగూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ శిబిరాలకు వస్తున్న ప్రతి వ్యక్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడంతోపాటు ఆరోగ్యశ్రీ ద్వారా పెద్దాస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పైసా ఖర్చు లేకుండానే ఉన్నత వైద్యం అందిస్తామన్నారు. మూడు రోజుల్లోనే ఈ శిబిరాల ద్వారా 3.35 లక్షల మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని వెల్లడించారు. వీటిలో 11,780 కేసులను ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఉన్నత వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూడా 297 ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందుకు 250 మంది వైద్య నిపుణులను కేటాయించామన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనిచేస్తున్నారని వెల్లడించారు.

గిరిజనులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

గిరిజనులంటే సీఎం జగన్‌కు అపారమైన ప్రేమ అని మంత్రి రజిని తెలిపారు. రూ.600 కోట్లతో మన్యం జిల్లా పార్వతీపురంలో మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారని చెప్పారు. అలాగే పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, వచ్చే ఏడాది ఇది ప్రారంభమవుతుందని వెల్లడించారు. దీంతోపాటు 600 పడకలతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. దీంతో మన్యం ప్రజలు కేజీహెచ్‌కు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో బర్త్ వెయిటింగ్ సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు 40.. 104, 108 వాహనాలను కేటాయించామన్నారు. 20 లక్షల మంది గిరిజనులకు సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నామన్నారు. రోగులకు నెలకు రూ.10 వేల పింఛన్ కూడా అందిస్తున్నామని చెప్పారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన గిరిజనులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చే గిరిజనులకు ఉచితంగా ఆహారం, తాగునీరు పంపిణీ చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

దత్తత గ్రామానికి చంద్రబాబు ఒక్క మంచి పని అయినా చేశారా?

టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు బాక్సైట్ తవ్వకాలతో మన్యాన్ని దోచుకోవాలని ప్రయత్నాలు చేశారని మంత్రి విడదల రజిని విమర్శించారు. పెదలబుడును చంద్రబాబు దత్తత తీసుకుని ఒక మంచి పని అయిన చేశారా అని నిలదీశారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బాక్సైట్ తవ్వకాలకు అనుకూలంగా ఉన్న జీవోను రద్దు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలహీనంగా ఉంది..

- అందుకే ఎన్డీయే నుంచి బయటకు వచ్చి మద్దతు ఇచ్చా
- జగన్‌ను రాజకీయాల్లో లేకుండా చేద్దాం
- అందుకు అన్ని పార్టీలు కలిసి రావాలి
- కృష్ణాజిల్లా పెడన బహిరంగ సభలో పవన్‌కళ్యాణ్
- ఇక్కడ కూడా టీడీపీ నేతలు కిందనే..
- ఆ పార్టీ శ్రేణులను తరలించినా జనం అంతంతమాత్రం



పెడన: రాష్ట్రంలో టీడీపీ బలహీనపడిందని.., అందుకే తాము ఎన్డీయే నుంచి బయటకు వచ్చి మద్దతు ఇచ్చామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం చాలా ప్రత్యేక పరిస్థితుల్లో ఉందన్నారు. 2014లో బీజేపీ–టీడీపీ కూటమికి మద్దతు పలకడానికి కారణం పదేళ్ల రాష్ట్ర భవిష్యత్తు కోసమేనని.. కానీ, పదేళ్లయినా రాష్ట్రం విభజన గాయాల నుంచి కోలుకోలేదని.. అందుకే 2021లో ఇచ్చిన పిలుపులో భాగంగానే టీడీపీ పొత్తుతో కలిసి రాబోయే ఎన్నికల్లో ముందుకు వెళ్లబోతున్నామని పవన్ చెప్పారు. ఇప్పుడు వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయనన్నారు. జనసేన–టీడీపీ కూటమిలోకి బీజేపీ వస్తుందని ఆశిస్తున్నానన్నారు. కృష్ణా జిల్లా పెడనలో బుధవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. పాలించేవాడు మనకు అండగా లేనప్పుడు, అతడిని కూల్చేయడానికి, తిరుగుబాటు చేయడానికి అన్ని పార్టీలు కలిసి రావాలన్నారు. 2024 ఎన్నికల్లో అతడిని తీసేద్దాం, రాజకీయాల్లో జగన్ అనే వ్యక్తి అనర్హుడు.. అతడిని రాజకీయాల్లో లేకుండా చేద్దాం.. 38 కేసులు ఉన్న వ్యక్తి పాలించేందుకు అనర్హుడని పవన్ అన్నారు. అలాగే, రాష్ట్రంలో సభ పెట్టాలంటే ప్రత్యేక అనుమతులు.. అడుగుపెట్టాలంటే అడ్డంకులు సృష్టిస్తూ వీసా అడుగుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

ఇది రూపాయి పావలా ప్రభుత్వం..

- గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రకటించిన నవరత్నాలకు, ప్రస్తుతం అమలుచేస్తున్న దానికి పొంతనలేదు. ఈ ప్రభుత్వం రూపాయి పావలా ప్రభుత్వంగా వ్యవహరిస్తోంది.
- జాతీయ ఉపాధి పథకం కింద కార్మికుల పొట్ట కొట్టిన ఈ పెద్దమనిషి రూ.337 కోట్లు మళ్లించాడు.
- కేంద్ర ప్రభుత్వ డేటా ప్రకారం, ప్రభుత్వ తప్పిదాలపై ఎదురు తిరిగినందుకు అత్యధిక కేసులు ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.
- జగన్ మెడికల్ సీట్లు అమ్మేసుకున్నాడు.
- ప్రజారాజ్యం యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జగన్ రాజకీయాల్లో కూడా లేడు. జగన్ పరీక్ష పేపర్లు కొట్టేసినప్పుడు నేను దేశం కోసం ఆలోచించాను.
- లాల్‌బహదూర్ శాస్త్రి, గాంధీ, అటల్ బిహారీ వాజపేయిలా అవినీతి గురించి జగన్ మాట్లాడుతుంటే నవ్వొస్తోంది. అడ్డగోలుగా లక్ష కోట్లు తినేసిన జగన్‌కు ఓటేసినప్పుడే అవినీతిని అందరూ సమర్థించినట్లయింది.
- కడప జిల్లా పులివెందుల ఒకప్పుడు సరస్వతి నిలయంగా ఉండేది. దానిని గొడవలకు అడ్డాగా మార్చి, ఆ సంస్కృతిని రాష్ట్రమంతా జగన్ వ్యాపింప చేశాడు.

జగన్ నాన్నతోనే గొడవ పెట్టుకున్నా..

నేను జగన్ అనుకున్నంతా పిరికివాడిని కాదు. ఆయన నాన్నతోనే గొడవ పెట్టుకున్న వాడిని. వలంటీర్లతో కేసులు పెట్టించాలని చూస్తున్నావు.. ఎన్ని పెట్టుకుంటావో పెట్టుకో. కోర్టులో తేల్చుకుందాం. ఇక పోలీస్ అధికారులు నాకు నోటీసులు ఇస్తున్నారు.. గతంలో కోనసీమలో గొడవలు జరుగుతాయి అని చెప్పాను, అవి జరగలేదా? పోలీసులు నన్ను సమాచారం ఎవరిచ్చారని అడుగుతున్నారు.. మొన్న నేను మంగళగిరి వస్తుంటే కోర్టుకు వెళ్తున్నానని సమాచారం వచ్చిందని విమానం ఆపారు.. ఆ సమాచారం మీకెవరు ఇచ్చారో ముందు చెప్పాలి.

ఇక్కడి మంత్రి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది..

పెడన నియోజకవర్గంలో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తుంటే అడ్డుకున్నారని జనసైనికులను అంబేడ్కర్ విగ్రహానికి కట్టేసి కొట్టారు. మంత్రి జోగి రమేష్ భారీస్థాయిలో అవినీతి చేశారు. రెండువేల ఇళ్లు ప్రకటించి, ఒక్క ఇంటిని కూడా కట్టలేదు. భవిష్యత్తులో మంత్రి చేసిన తప్పులకు ఆయన కచ్చితంగా విచారణ ఎదుర్కొని జైలుకు కూడా వెళ్లాల్సి ఉంటుంది. అది రాజమండ్రి కంటే మంచి జైలుకు పంపిస్తాం.

చతుర్ముఖ నగరాలుగా ఆ నాలుగు..

అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, కై కలూరు ప్రాంతాలను చతుర్ముఖ నగరాలుగా అభివృద్ధి చేస్తాం. దివిసీమలో మంచి శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేసి ఉపాధి శిక్షణా ఇస్తాం. మెరైన్ టూరిజం అభివృద్ధి చేస్తాం, ఆధ్యాత్మిక నేల అయిన అవనిగడ్డ ప్రాంతం.. మచిలీపట్నం పోర్టు, పెడన చేనేత–కలంకారీ కళను, కైకలూరు ఆక్వా కల్చర్‌ను అభివృద్ధి చేస్తాం.

మా సభల్లో జనసైనికులే ముందుంటారు..

ఇక తమ సభల్లో జనసైనికులే ముందుంటారని.. ఆ తరువాతే టీడీపీ వారుంటారని.. కావాలంటే మీ సభల్లో మీరు ముందుండండని టీడీపీ వారిని ఉద్దేశించి పవన్ వ్యాఖ్యానించారు. మరోవైపు.. సభకు హాజరైన టీడీపీ నేతలు కొనకళ్ల నారాయణ, కొల్లు రవీంద్ర, వేదవ్యాస్, కాగిత కృష్ణప్రసాద్, రావి వెంకటేశ్వరరావు తదితరులు వారాహి వాహనం కిందనే జనం మధ్య నిలబడాల్సి వచ్చింది. అవనిగడ్డలోనూ తెలుగుదేశం నేతలకు ఇదే పరిస్థితి ఎదురైన సంగతి తెలిసిందే. వీరంతా పవన్ సభకు టీడీపీ శ్రేణులను తరలించినప్పటికీ ఆశించిన స్థాయిలో జనం రాకపోవడం కొసమెరుపు.

పవన్ ప్యాకేజీ సొమ్ము ఏ దేశానికెళ్లిందో త్వరలో తెలుస్తుంది


కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్‌కు వచ్చిన ప్యాకేజీ సొమ్ము హవాలా ద్వారా ఏ దేశానికి వెళ్లిందో త్వరలో బయటకు వస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ద్వారంపూడి బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుతో పొత్తు పెట్టుకోవడం ద్వారా లభించిన ప్యాకేజీ సొమ్ము రష్యా, సింగపూర్, దుబాయ్‌కు వెళ్లిందా అని త్వరలోనే తెలుస్తుందని అన్నారు. టీడీపీ నుంచి తీసుకునే ప్యాకేజీ స్టేజిస్టేజికీ పెరిగిందన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వెళ్లి పరామర్శించినందుకు ఒక ప్యాకేజీ, ములాఖత్ పేరుతో మిలాఖతై నిస్సిగ్గుగా మద్దతు ప్రకటించినప్పుడు మరో ప్యాకేజీ తీసుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్యాకేజీ స్టార్ పవన్ రాజకీయాల్లో ఒక నటుడు ఎలా నటించాలో అలానే నటిస్తున్నాడని విమర్శించారు. రాజకీయ అనుభవం ఉన్నవారు పవన్‌ను జోకర్‌గా భావిస్తున్నారని చెప్పారు. అనుభవం లేకుండా కేవలం అభిమానించే వారు, జన సైనికులు ప్యాకేజీ స్టార్ పొత్తులపై గందరగోళానికి గురవుతున్నారని చెప్పారు. టీడీపీతో పవన్ దోస్తీని జన సైనికులు అంగీకరించడం లేదన్నారు. జనసేనకు పవనే పెద్ద శత్రువుగా మారారన్నారు. చంద్రబాబు, పవన్ కలిసినంత మాత్రాన సరిపోదని, కిందస్థాయిలో కార్యకర్తలు కలవాలని, అది అంత సులభం కాదని తెలిపారు. నాడు సోనియాతో కుమ్మక్కైన చంద్రబాబు కుట్రపూరితంగా వైఎస్ జగన్‌పై కేసులు పెట్టించారన్నారు. ఆ పాపం పండి చంద్రబాబు జైలు జీవితం అనుభవిస్తున్నారని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా చేసిన వ్యక్తి రాజకీయాల్లో లేరని, రామోజీకి వయస్సు అయిపోయిందని, న్యాయ వ్యవస్థలో అత్యంత కీలకమైనవ్యక్తి రిటైర్ అయిపోయారని, దీంతో వ్యవస్థలను మేనేజ్ చేసే అవకాశం లేక చంద్రబాబుకు జైలు జీవితం తప్ప లేదన్నారు. కోర్టుల్లో వాదించడానికి ఒక్కో లాయర్‌కు కోట్లు ఖర్చుచేస్తున్న చంద్రబాబుకు ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వస్తోందని ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతిని ఒక్కొక్కటిగా సీఎం జగన్ బయటపెట్టడం ఖాయమన్నారు. వైఎస్ హయాంలో కులాలు, రాజకీయాలకు అతీతంగా అంతా కలిసి ఉండే వాళ్లని, ఈరోజు చంద్రబాబు వల్ల కులాలు, వర్గాలుగా విడిపోయారని తెలిపారు. 2024 ఎన్నికల అనంతరం రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్నాక మళ్లీ అన్ని కులాలు కలిసి ఉంటాయని చంద్రశేఖరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

పవన్ కుల ద్రోహి

రంగాను హత్యచేసిన వారితో చేతులు కలిపాడు: అడపా శేషు



సాక్షి, అమరావతి: వారాహి యాత్రకు స్పందన కరువవడంతోనే పవన్ కళ్యాణ్ పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. అవనిగడ్డ, బందరు, పెడన పర్యటనల్లో సానుభూతి కోసం తనపై దాడి చేసేందుకు ఏదో కుట్ర చేస్తున్నారంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పదేళ్లుగా జనసేన పార్టీని నడుపుతూ పూటకోమాట, రోజుకో జెండా మోస్తూ దిగజారిపోయారని ధ్వజమెత్తారు. ఇకపై జనసేన కార్యకర్తలు, కాపులు, బలిజలు, తెలగలు పవన్‌ను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తిచేశారు. హక్కులకోసం ఉద్యమించిన కాపులపై చంద్రబాబు కేసులు పెట్టినప్పుడు ఎక్కడ దాక్కున్నావు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపులపై కేసులు తొలగించినప్పుడు మాట్లాడకుండా అవినీతి కేసులో దొరికిపోయిన చంద్రబాబును అరెస్ట్ చేస్తే గుండెలు బాదుకోవడం స్వామిభక్తికి నిదర్శనమన్నారు. వంగవీటి రంగాను హత్య చేసిన దుర్మార్గులతో చేతులు కలిపిన కులద్రోహి పవన్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



మెర్సీ ప్లీజ్!

“విధి కన్నెర్ర చేసి కోలుకోని దెబ్బకొట్టినా.. మనిషి తట్టుకుని నిలబడ గలుగుతాడు. కానీ అక్కున చేర్చుకుని ఓదార్చాల్సిన సమాజం ఈసడింపులు, చీదరింపులతో అసహ్యంగా చూస్తే బతకాలన్న కోరిక చచ్చిపోతుంది. కోరిక లేని మనిషికి చావు తప్ప మరోమార్గం కనిపించదు, ఇదే నా జీవితంలో ప్రస్తుతం జరుగుతోంది. కనీసం నన్ను ప్రశాంతంగానైనా చావనివ్వండి ప్లీజ్” అని అడుగుతోంది డాక్టర్ పార్వతీ కుమారి.

జార్ఖండ్‌లోని చిన్న నగరం ధన్‌బాద్. ఇక్కడే పుట్టింది పార్వతీ కుమారి. తాతయ్య, నాయనమ్మలు, ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ల మధ్య ఆడుతూ పాడుతూ పెరిగింది. పదోతరగతి పాసై ఎంచక్కా కాలేజీకి వెళ్దామని అడ్మిషన్ తీసుకుంది. సరిగా అప్పుడే పార్వతికి విపరీతమైన తలనొప్పి వచ్చింది. ఇంటిచిట్కాలు పాటిస్తూ నొప్పిని తగ్గించుకోవడానికి ప్రయత్నించింది. కానీ తగ్గకపోగా రోజురోజుకి ఎక్కువవుతూ పోయింది. ఎన్ని ట్రీట్మెంట్‌లు తీసుకున్నా ఫలితం కనిపించలేదు.. ఓరోజున ఉన్నట్టుండి కోమాలోకి వెళ్లిపోయింది పార్వతి.



కళ్లు తెరిచింది కానీ....

స్పృహ లేకుండా జీవచ్ఛవంలా పడి ఉన్న పార్వతి... మూడు నెలల తరువాత కోమా నుంచి బయటకు వచ్చింది. కళ్లు తెరిచి చూసింది కానీ ఏమీ కనిపించడం లేదు. సీనియర్ కంటి డాక్టర్‌కు చూపించగా...‘‘వివిధ రకాల మందుల దుష్ప్రభావం వల్ల కంటిచూపు పోయింది’’ అని చెప్పారు. పార్వతికీ, ఆమె తల్లిదండ్రులకు ప్రపంచం తలకిందులైనట్లు అనిపించింది.

ఇంట్లో పార్వతి తండ్రి ఒక్కడిదే సంపాదన. ఆమె చికిత్సకు చాలా ఖర్చవడంతో అప్పుల పాలయ్యారు. ‘‘కళ్లులేని అమ్మాయిని ఎవరు పెళ్లి చేసుకుంటారు? బతికుంటే తల్లిదండ్రులకు భారమే అని’’ ఇరుగు పొరుగు ఈసడింపుగా మాట్లాడేవారు.

పీహెచ్‌డీ దాకా...

అనేక భయాందోళనల మధ్య ఉన్న పార్వతి మూడేళ్లు గడిపేసింది. ఆ తరువాత డెహ్రాడూన్‌లోని ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్’లో చేరింది. పదకొండో తరగతిలో అడ్మిషన్ తీసుకుని మొదటి మూడు నెలలు బ్రెయిలీ స్క్రిప్ట్‌ను నేర్చుకుంది. డెబ్బై రెండు శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పాసైంది. ఢిల్లీలోని ఇంద్రప్రస్థ కాలేజీలో బీఏ, దౌలత్‌రామ్ కాలేజీలో ఎం.ఏ. చేసింది. తరువాత జవహర్ లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ఎమ్‌ఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఇలా చకచకా చదివేసి జేఆర్‌ఎఫ్‌గా సెలక్ట్ అయ్యింది. ఒక పక్క చదువుతూనే మరోపక్క సాహిత్య సేవ కూడా చేసింది.

పుంజుకునేలోపే...

కుటుంబ సభ్యులు, కాలేజీ లెక్చరర్లు, తోటి విద్యార్థులు, స్నేహితుల సాయంతో చదివిన పార్వతికి ఓ ఈవినింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. హమ్మయ్య ఇంతకాలానికి ఎవరి సాయం తీసుకోకుండా నా కాళ్లమీద నేను నిలబడ్డాను, ఇప్పుడు నేను కూడా నా కుటుంబ సభ్యులకు, ఇతరులకు సాయం చేయవచ్చు అనుకుని.. సంతోషంగా తన డ్యూటీ చేసుకునేది పార్వతి. కాలేజీలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను పర్మినెంట్ చేసే సమయం వచ్చింది. తాను కూడా పర్మినెంట్ ఉద్యోగి అయిపోతుంది అనుకుంది పార్వతి. అయితే పర్మినెంట్ చేయడం మాట అటుంచి కనీసం కారణం కూడా చెప్పకుండా ఆమెను ఉద్యోగం నుంచి తొలగించేశారు!! దీంతో మరోసారి తన జీవితం అంధకారమైనట్లనిపించింది.

‘‘వెలుగు కోసం వేచిచూస్తూ లైన్లో ఉన్న నన్ను మళ్లీ చీకటిలోకి ఈడ్చిపడేసారు. ఇక నాకు పోరాడే ఓపికలేదు. అందుకే కనీసం ప్రశాంతంగా చనిపోనివ్వండి’ అని ఈ దేశప్రజలు, సమాజాన్ని అడుగుతున్నాను.’’ అని తీవ్రమైన నిరాశతో పార్వతి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ప్రొఫెసర్‌గా తానేమిటో ఇప్పటికే నిరూపించుకుంది. తన కాళ్లమీద తాను నిలబడేలా చేసి ఆ కళ్లకు వెలుగు చూపిస్తే పోయేదేముంది?



టిప్స్

యాంటీ యాక్నె డ్రింక్ తాగారా?

అర కప్పు ధనియాలు, పదిహేను కరివేప ఆకులు, అరకప్పు గులాబీ రేకులను రెండు గ్లాసుల నీటిలో వేసి బాగా మరిగించాలి. నీళ్లు రంగు మారాక స్టవ్ ఆపేసి వడగట్టాలి. వడగట్టిన నీటిని తాగాలి. వారానికి మూడు గ్లాసులు ఈ నీటిని తాగాలి. దీనిలో ఉండే విటమిన్ ఎ, కొల్లాజన్‌లు హార్మోన్ల అసమతుల్యం వల్ల వచ్చే మొటిమలను తగ్గిస్తాయి.



జీడిపప్పును పాలలో నానబెట్టి, తరువాత నెయ్యిలో ఎర్రగా వేయించాలి. ఇవి చల్లారాక పేస్టు చేయాలి. ఈ పేస్టుని కూరలో వేసి పదినిమిషాలు మగ్గనిస్తే గ్రేవీ చిక్కగా వస్తుంది.

సైబర్ టాక్



పండగలు రాబోతున్నాయి. ఇంటిల్లిపాదికి బట్టలు, ఇంట్లోకి కొత్త వస్తువులు కొనాలన్న ప్లాన్‌లో ఉంది రోజా. ఆన్‌లైన్ షాపింగ్ అయితే సులువైన పని అనుకుంటూనే వాటిలోని ఆఫర్లను చెక్ చేయడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో వస్తువుల అమ్మకాలలో ఇచ్చే డీల్స్ చూస్తోంది. అనుకున్న బ్రాండ్‌లో ఓ ఫోన్ డీల్ కనపడింది. అత్యంత తక్కువ ధర కే వస్తోంది, నిమిషాల్లోనే ఆ డీల్ ముగుస్తుంది. అందుకే వెంటనే క్లిక్ చేసింది. అక్కడ నుంచి పోర్టల్‌లోకి వెళ్లడం, ఫోన్ బుక్ చేయడం చకచకా జరిగిపోయాయి. అమౌంట్ డెబిట్ అయ్యింది. కానీ, వస్తువు బుక్ అయినట్టుగా చూపించడం లేదు. ఆ తర్వాత చెల్లించిన డబ్బు గురించి ప్రయత్నించింది. కానీ, ఆ డబ్బు తిరిగి తన అకౌంట్‌లోకి రాలేదు.

ఆన్‌లైన్‌లో నకిలీ పండగ ఆఫర్ మోసాలు అధికంగా జరుగుతుంటాయి. వాటిలో... ఫ్రీ డెలివరీ నోటిఫికేషన్ స్కామ్, ఫేక్ షాపింగ్ సైట్లు, ఫేక్ గిఫ్ట్ కార్డులు, వోచర్లు, కూపన్లు, ఫేక్ స్వచ్ఛంద సంస్థలు, ఫేక్ ప్రయాణ ఆఫర్లు ఉంటాయి. ఇవన్నీ. డీల్ ఆఫ్ ది డే, ఆఫర్స్ అంటూ ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. తక్కువ ధరకు వస్తువులు, సేవలు లభిస్తాయన్న మన ఆశ స్కామర్ల చేతికి చిక్కేలా చేస్తుంది.

చీట్ ఆఫ్ ది డే

దొంగ డీల్స్!

నకిలీ షాపింగ్ సైట్‌లను గుర్తించ డానికి సులభమైన మార్గాలు

- యుఆర్‌ఎల్ ప్రక్కన ప్యాడ్‌లాక్ ఉన్న //http చెక్ చేయడం ద్వారా సైట్ సురక్షితమైనదో కాదో తెలుసుకోవచ్చు.
- సైట్ యుఆర్‌ఎల్ సందేహంగా నిజమైన రిటైలర్ అధికారిక చిరునామాకు దగ్గరగా ఉండి, కొన్ని అక్షరాలలో తేడా ఉండటం మరొక సంకేతం.
- బ్రౌజ్ చేస్తున్నప్పుడు రిటైలర్ యుఆర్‌ఎల్‌ని మాన్యువల్‌గా టైప్ చేయడం ద్వారా నకిలీ డొమైన్‌లను అడ్డుకోవచ్చు.



ఇ–మెయిల్, టెక్ట్స్ లేదా డైరెక్ట్ మెసేజ్ ద్వారా షార్ట్ లింక్స్ వస్తుంటాయి.

- మీ ఆర్డర్ గురించి మీకు సందేహాలు ఉంటే ఆన్‌లైన్‌లో అమ్మకందారు ఏరియా చిరునామా, ఈ మెయిల్, ఫోన్ నంబర్‌ను నిర్ధారించుకోవాలి. సైట్‌లో కస్టమర్ సర్వీస్, సంప్రదింపు వివరాలు లేనట్లయితే సందేహించాలి.

మీరు షాపింగ్ స్కామ్‌కు గురైతే...

- వెంటనే మీ బ్యాంక్ లేదా క్రెడిట్ కార్డ్ కంపెనీకి ఫిర్యాదు చేయాలి. స్కామర్ మీ అకౌంట్స్‌కి యాక్సెస్ తీసుకున్నట్టు వారికి తెలియజేయాలి.
- మీ బ్యాంక్ అకౌంట్‌పై కంట్రోల్‌కి ఆన్‌లైన్ పాస్‌వర్డ్‌లను మార్చండి. రెండు కారకాల ప్రమాణీకరణను (2-F-A-)ని పాటించాలి.
- అనుమానిత సైట్ నుంచి ఏదైనా డౌన్‌లోడ్ చేసినట్లయితే, స్కామర్‌లు ఇన్‌స్టాల్ చేసిన మాల్వేర్, రిమోట్ యాక్సెస్ సాఫ్ట్‌వేర్ కోసం మీ పరికరాలను స్కాన్ చేయడానికి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి.
- మీరు ఇంతకు ముందెన్నడూ ఆర్డర్ చేయని సైట్‌ని సందర్శిస్తున్నట్లయితే, వెబ్‌సైట్‌లోని ‘అబౌట్’ సెక్షన్‌ని చెక్ చేయాలి. వెబ్‌సైట్ ఎంత పాతదో దానితోపాటు కొన్ని కస్టమర్ రివ్యూలను చూడాలి.
- ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు మీరు స్కామ్‌కు గురైనట్లయితే వెంటనే పోలీసు రిపోర్ట్ ఫైల్ చేయాలి. https://cybercrime.gov.in/ కూ రిపోర్ట్ చేయచ్చు.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్**

సినిమా

మావయ్యగారి బయోపిక్‌లో నటించాలనుంది

‘మామా మశ్చీంద్ర’ - సుధీర్ బాబు



చిత్రం మెంటల్‌గా, ఫిజికల్‌గా నాకు ఓ సవాల్. కంటెంట్ ఉన్న కమర్షియల్ సినిమా ఇది. ఫ్యామిలీతో కలసి హాయిగా చూడొచ్చు” అని హీరో సుధీర్ బాబు అన్నారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా, ఈషా రెబ్బా, మృణాళినీ రవి హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం ‘మామా మశ్చీంద్ర’. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు చెప్పిన విశేషాలు.

● నా కెరీర్‌లో ఇప్పటివరకూ నా వద్దకు వచ్చిన కథల్లో నాకు నచ్చినవి చేశాను. కానీ, ఫలానా జానర్, ఫలానా కథ కావాలంటూ దర్శకులను అడగలేదు. ‘మనం, గుండెజారి గల్లంతయ్యిందే’ చిత్రాలతో మంచి రైటర్‌గా నిరూపించుకున్నారు హర్ష. ఆయనపై ఉన్న నమ్మకంతో కథ తీసుకు రమ్మని చెప్పాను. హర్ష చెప్పిన ‘మామా మశ్చీంద్ర’ కథ చాలా నచ్చింది. హర్ష మంచి రచయిత, నటుడు. మంచి అనుభవం ఉన్న దర్శకుడిలా ఆయన ఈ సినిమా తెరకెక్కించారు. ● ఈ సినిమాలో నేను చేసిన మూడు పాత్రల్లో (దుర్గా, పరశురాం, డీజే) ఒక్కో పాత్ర ఒక్కో యాస (తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయలసీమ) మాట్లాడుతుంది. పరశురాం పాత్ర కోసం బరువు పెరిగాను. దుర్గ పాత్రకు ప్రోస్థటిక్స్ వాడాం. ఈ పాత్ర కోసం నిజంగా బరువు పెరగాలనుకున్నాను. అయితే ఒక్కసారిగా అంత బరువు పెరగడం మంచిది కాదని మహేశ్ బాబుగారితో పాటు సన్నిహితులు చెప్పడంతో ప్రోస్థటిక్ మేకప్‌ని వాడాం. డీజే పాత్ర కోసం డైట్ పాటించాను. ● నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావుగార్లు ఈ సినిమాకి పూర్తి న్యాయం చేశారు. ‘మామా మశ్చీంద్ర’లో మా మావయ్య కృష్ణగారితో ఓ సీన్ చేయించాలనుకున్నాను. కానీ ఆయన దూరమయ్యారు. ఆయన లేకపోతే ఆ సన్నివేశానికి ప్రాధాన్యతే లేదు. అందుకే వేరే వారితో ఆ సీన్ తీయలేదు. నా ప్రతి సినిమా రిలీజ్ రోజు మావయ్య చూసి, ఫస్ట్ ఫోన్‌కాల్ చేసి మాట్లాడేవారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరు. మావయ్యగారి బయోపిక్‌లో నటించే చాన్స్ వస్తే హ్యాపీగా చేస్తాను. ప్రస్తుతం నేను నటించిన ‘మా నాన్న సూపర్ హీరో’ డబ్బింగ్ జరుగుతోంది. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ‘హరోం హర’ షూటింగ్ చేస్తున్నాం. పుల్లెల గోపీచంద్ బయోపిక్ కచ్చితంగా ఉంటుంది.

రెండు భాగాలుగా దేవర



● ఎన్టీఆర్

పాన్ ఇండియన్ ఫిల్మ్ ‘దేవర’ రెండు భాగాలుగా విడుదల కానుంది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘దేవర’. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. కళ్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ బుధవారం వెల్లడించింది. ఇందుకు సంబంధించి దర్శకుడు కొరటాల శివ ఓ వీడియోను షేర్ చేశారు. ఈ వీడియోలో కొరటాల శివ మాట్లాడుతూ– ‘‘దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంలో ‘దేవర’ సినిమా ఉంటుంది. ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. మరింత లోతుగా ఆ పాత్రలను ప్రేక్షకులకు వివరించాల్సిన అవసరం ఉంది. రెండు, మూడు షెడ్యూల్స్ పూర్తయిన తర్వాత డబుల్ హై ఫీలయ్యాం. సినిమా నిడివి కోసం ఒక్క సన్నివేశాన్ని, ఒక్క డైలాగ్‌ను కూడా తీయలేమని అందరికీ అనిపించింది. ఒక్క భాగంలోనే ఈ కథను ముగించేయడం తప్పనిపించింది. అందుకే ‘దేవర’ కథను రెండు భాగాలుగా చెప్పడం కరెక్ట్ అనుకున్నాం. అయితే కథలో మార్పులు లేవు. ఈ చిత్రం తొలి భాగాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేస్తాం’’ అన్నారు.

ఆ రోజులు గుర్తొచ్చాయి - కిరణ్ అబ్బవరం



“‘రూల్స్ రంజన్’ పూర్తి వినోదాత్మక చిత్రం. ట్రైలర్ చూసి నవ్వుకున్నట్లే సినిమా అంతా ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారని కచ్చితంగా చెప్పగలను” అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. రత్నం కృష్ణ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం ‘రూల్స్ రంజన్’. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చెప్పిన విశేషాలు.

● ప్రతి సినిమాలో ఒకే తరహా పాత్ర కాకుండా వైవిధ్యంగా ఉండేలా కథలు ఎంచుకుంటున్నాను. రత్నం కృష్ణ చెప్పిన ‘రూల్స్ రంజన్’ కథ మంచి విజువల్ కామెడీ డ్రామాగా ఉంటుందని నమ్మి, చేశాను. రత్నం కృష్ణ బాగా తీశారు. సినిమా అంతా సరదాగా సాగుతుంది. ‘వెన్నెల’ కిశోర్, నాకు మధ్య వచ్చే సన్నివేశాలు, వైవా హర్ష, సుబ్బరాజు, ఆది ట్రాక్‌లు మంచి వినోదం పంచుతాయి. ● సినిమాల్లోకి రాక ముందు చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేశాను. పల్లెటూరి నుంచి వెళ్లిన నాకు కెఫెటేరియా (క్యాంటీన్) అంటే ఎలా ఉంటుందో కూడా తెలియదు. ఆ వర్క్ కల్చర్, ఆఫీస్ పద్ధతులకు అలవాటు పడటం కష్టమైంది. ఈ చిత్రంలో మనోరంజన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేశాను. షూటింగ్ చేస్తున్నప్పుడు నేను ఉద్యోగం చేసిన రోజులు గుర్తొచ్చాయి. ● నిర్మాతలు ఏఎం రత్నం, దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణగార్లు ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా తీశారు. ఈ చిత్రంలోని ‘సమ్మోహనుడా..’ పాట హైప్ తీసుకు వచ్చింది. ఇది రొమాంటిక్ సాంగ్. అందుకే సవాల్‌గా అనిపించింది. ప్రస్తుతం సీనియర్ డైరెక్టర్స్‌తో రెండు, కొత్త దర్శకులతో రెండు సినిమాలు చేస్తున్నాను.

సమాజానికి ఉపయోగపడే సినిమా - శ్రీకాంత్

‘‘తల్లిదండ్రులు, గురువులు పిల్లలను క్రమశిక్షణతో పెంచకపోతే ఆ పిల్లలు సమాజానికి ఎలా హానికరంగా తయారవుతారనే ‘డర్టీ ఫెలో’ కథ నాకు బాగా నచ్చింది. సమాజానికి ఉపయోగపడేలా మూర్తి సాయి ఈ సినిమాను తీశాడు. శాంతి చంద్రలాంటి వ్యాపారవేత్తలు ఇండస్ట్రీకి రావాలి’’ అన్నారు శ్రీకాంత్ . శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రిత్ బతీజా హీరోయిన్లుగా ఆదారి మూర్తి సాయి దర్శకత్వం వహించిన చిత్రం ‘డర్టీ ఫెలో’. గూడూరు భద్రకాళీ సమర్పణలో రాజ్ జీయస్ బాబు నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ను శ్రీకాంత్ విడుదల చేశారు. ‘‘మా సినిమా సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా ఉంటుంది’’ అన్నారు శాంతి చంద్ర. ‘‘ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి’’ అన్నారు ఆదారి మూర్తి సాయి.



● శ్రీకాంత్, శాంతి చంద్ర

కొడితే కొట్టాలి రా.. హిట్టు కొట్టాలి

కొడితే కొట్టాలి రా కప్పు కొట్టాలి అనే ధ్యేయంతో బరిలోకి దిగుతున్నారు క్రికెటర్లు. క్రికెట్ వరల్డ్ కప్ హంగామా మొదలైపోయింది. ఇటు సిల్వర్ స్క్రీన్ క్రికెట్ కూడా రెడీ అవుతోంది. కొడితే కొట్టాలి రా.. హిట్టు కొట్టాలి అంటూ కొందరు స్టార్స్ క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమాలు చేస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.



● రజనీకాంత్, కపిల్ దేవ్

గ్రౌండ్‌లో డాన్

ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్ క్రికెట్ గ్రౌండ్‌లోకి దిగాడు. ఏం చేశాడనేది వచ్చే ఏడాది వెండి తెరపై చూడాలి. విష్ణువిశాల్, విక్రాంత్ హీరోలుగా సూపర్ స్టార్ రజనీకాంత్, క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘లాల్ సలాం’. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ క్రికెటర్స్‌గా నటించగా, ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్‌గా రజనీ నటించారు. ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. అలాగే రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 170వ చిత్రం ప్రారంభమైంది. అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, రితికా సింగ్, మంజు వారియర్ కీలక పాత్రల్లో సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త. ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.

ముత్తయ్య 800

లెజెండరీ క్రికెటర్, శ్రీలంకన్ ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం ‘800’. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ముత్తయ్య మురళీధరన్‌గా ‘స్లమ్‌డాగ్ మిలియనీర్’ ఫేమ్ మధుర్ మిట్టల్ నటించారు. మురళీధరన్ భార్య మది మలర్ పాత్రను మహిమా నంబియార్ పోషించారు. ఈ సినిమాలో తన క్రికెట్ లైఫ్ గురించి 20 శాతం ఉంటే, తన జీవితంలోని ఆసక్తికర సంఘటనలు 80 శాతం ఉంటాయని మురళీధరన్ ఇటీవల పేర్కొన్నారు. అలాగే మురళీధరన్‌గారిలా నటించేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఆయన అన్ని వీడియోలను చూశానని, తీవ్రంగా బౌలింగ్ సాధన చేశానని, మేకప్ కోసమే మూడు గంటలు పట్టేదనీ మధుర్ మిట్టల్ తెలిపారు. అంతేకాదు.. కొన్నాళ్ల క్రితం తనకు యాక్సిడెంట్ జరగడం వల్ల తన ఎల్బో కూడా ముత్తయ్య తరహాలోకే వచ్చిందనీ మధుర్ మిట్టల్ చెప్పుకొచ్చారు. శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది.



● మధుర్ మిట్టల్

ది టెస్ట్

టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో తమిళంలో ‘టెస్ట్’ సినిమా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మాధవన్, సిద్ధార్థ్, నయనతార లీడ్ రోల్స్ చేస్తుండగా, నిర్మాత శశికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. మోషన్ పోస్టర్‌ను బట్టి ఈ సినిమా టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఉంటుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే ఈ చిత్రంలో మాధవన్, నయనతార, సిద్ధార్థ్‌లలో ఎవరు క్రికెటర్స్‌గా కనిపిస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది.



● సిద్ధార్థ్, మాధవన్

చక్దా ఎక్స్‌ప్రెస్

దాదాపు రెండు దశాబ్దాల పాటు హిట్ క్రికెట్ ఆడారు జులన్ గోస్వామి. ఆమె జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం ‘చక్దా ఎక్స్‌ప్రెస్’. జులన్‌గా అనుష్కా శర్మ నటించారు. నాలుగేళ్ల తర్వాత అనుష్కా శర్మ నటించిన చిత్రం ఇదే. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ కానుందట.



● జాన్వీ కపూర్

క్రికెటర్ మహి

జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటించిన చిత్రం ‘మిస్టర్ అండ్ మిస్సెస్ మహి’. రాజ్ కుమార్ రావు మరో లీడ్ రోల్‌లో నటించారు. శరణ్ శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా కోసం క్రికెట్‌లో ఆరు నెలల పాటు జాన్వీ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

ఇలా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.



● అనుష్కా శర్మ



వందే వన్డే క్రికెట్

నేటి నుంచి ప్రపంచకప్

తొలి పోరులో ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ 'ఢీ' ● ఆదివారం ఆస్ట్రేలియాతో భారత్ మ్యాచ్ ● నవంబర్ 19న ఫైనల్

ఒక్కరోజు చాలు... చరిత్ర మారిపోవడానికి... రికార్డులు బద్దలు కావడానికి... ఒక్కరోజు చాలు... అనామకులు అసాధ్యులుగా మారి అద్భుతాలు చేయడానికి... ఒక్కరోజు చాలు... హీరోలుగా కీర్తించబడినవారు జీరోలుగా మారిపోవడానికి... అభిమానులకు అంతులేని ఆనందం పంచేందుకు, ఎప్పటికీ మరచిపోలేని విషాదం మిగిల్చేందుకు కూడా ఆ ఒక్కరోజు చాలు... యాభై రెండేళ్ల క్రితం బుడిబుడి అడుగులు వేసిన ఒక్కరోజు ఆట 4657 సమరాల తర్వాత కాస్త అలసటకు లోనైనట్లుగా కనిపిస్తోంది. తనకంటే 146 ఏళ్ల క్రితం పుట్టిన ఆట తన పెద్దరికపు హోదాను నిలబెట్టుకుంటూ ఇంకా సజీవంగా సాగిపోతుంటే... తనకంటే 34 ఏళ్లు చిన్నదైన ఆట కూడా రోజురోజుకీ ఎదిగిపోతూ ధూమ్‌ధామ్‌గా వెలిగిపోతుంటే ఒక్కరోజు ఆటకే కొంత కాలంగా చిక్కొచ్చి పడింది. ఇప్పుడు దానికి కొత్త ఊపిరి కావాలి... వినోదాన్ని అందించడంలో నేనూ ఎక్కడా వెనుకబడిపోను అన్నట్లుగా ఒక ఊపు రావాలి... అందుకే సరైన సమయం, వేదిక కావాలి. అలాంటి సమయం వచ్చేసింది... వన్డే క్రికెట్ గొప్పతనాన్ని చూపించేందుకు, ఈ ఫార్మాట్ ముద్ర చూపించేందుకు ప్రపంచకప్‌కంటే సరైన వేదిక లేదు... అవును, ఇట్ టైమ్స్ వన్ డే!

నరాలు తెగే ఉత్కంఠతో ఫలితాన్ని అందించిన గత ప్రపంచకప్ తుది సమరం గుర్తుందా? నాలుగేళ్ల క్రితం నాటి ఆ జ్ఞాపకాలను క్రికెట్ అభిమానులు అంత సులువుగా మరచిపోలేరు. ఆపై రెండు పొట్టి ప్రపంచ కప్‌లు, రెండు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ సమరాల తర్వాత నేనున్నానంటూ మళ్లీ వన్డే విశ్వక్రీడా సంబరం వచ్చేసింది... ఈ నాలుగేళ్ల వ్యవధిలో జట్లు మారాయి, ఆటగాళ్లు మారారు, నిబంధనలూ మారాయి... కానీ విశ్వవ్యాప్తంగా అభిమానుల ఆశలు, అంచనాలు మాత్రం మారలేదు. మరోసారి వారి వినోదానికి భరోసానిస్తూ, గత పన్నెండు మెగా టోర్నీలకు ఏమాత్రం తగ్గకుండా ఈ వరల్డ్‌కప్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. పుష్కర కాలం తర్వాత ఆతిథ్యమిస్తున్న భారత్ సొంతగడ్డపై 12 ఏళ్ల క్రితం నాటి ప్రదర్శనను పునరావృతం చేసే లక్ష్యంతో అమితోత్సాహంతో సిద్ధమైంది. ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా ఖాతాలో ఆరో టైటిల్ చేరుతుందా? ఇంగ్లండ్ తమ జోరును ఇక్కడా నిలబెట్టుకుంటుందా? మూడు దశాబ్దాలుగా దక్కని ద్రాక్ష పాక్‌కు అందుతుందా అనేది ఆసక్తికరం. ఎప్పటిలాగే కివీస్, దక్షిణాఫ్రికా తొలి టైటిల్ ఆశలు నిజమవుతాయా లేక ఇతర సంచలనాలు ఉంటాయా అనేది 46 రోజులు చర్చనీయాంశమే!

అహ్మదాబాద్: ఐసీసీ 13వ వన్డే వరల్డ్ కప్ సమరానికి సమయం వచ్చేసింది. గత టోర్నీ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య నేడు అహ్మదాబాద్‌లో జరిగే తొలి పోరుతో ప్రపంచ కప్ ప్రారంభమవుతుంది. నవంబర్ 19న ఇదే అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. ఈ క్రమంలో 48 లీగ్ మ్యాచ్‌లు, రెండు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ జరుగుతాయి. 2011 తర్వాత భారత్ మరోసారి వరల్డ్ కప్‌కు ఆతిథ్యం ఇస్తోంది. గత రెండు టోర్నీల్లో సెమీస్ చేరిన టీమిండియా స్వదేశంలో ఈసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. గత టోర్నీ ఫార్మాట్ తరహాలోనే బరిలో 10 జట్లు నిలిచాయి. ప్రతీ టీమ్ ఇతర తొమ్మిది జట్లతో తలపడుతుంది. గ్రూప్ దశలో అత్యధిక పాయింట్లు సాధించిన టాప్–4 టీమ్‌లు సెమీఫైనల్ చేరతాయి. వరల్డ్ కప్ తొలి రెండు టోర్నీల్లో జగజ్జేతగా నిలిచి సుదీర్ఘ కాలం క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్ లేకుండా జరుగుతున్న తొలి వరల్డ్ కప్ ఇదే. ఈసారి ర్యాంకింగ్ ద్వారా ఎనిమిది జట్లు నేరుగా అర్హత సాధించగా... క్వాలిఫయింగ్ టోర్నీ ఆడి మాజీ విజేత శ్రీలంక, నెదర్లాండ్స్ అవకాశం దక్కించుకున్నాయి.

10 మ్యాచ్‌లు జరిగే వేదికల సంఖ్య. అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, ధర్మశాల, పుణే, హైదరాబాద్ వేదికలుగా మ్యాచ్‌లు జరుగుతాయి. సెమీస్ మ్యాచ్‌లకు కోల్‌కతా, ముంబై వేదిక కానుండగా, ఫైనల్ అహ్మదాబాద్‌లో జరుగుతుంది. వీటిలో ఒక్క హైదరాబాద్‌లో మినహా మిగతా 9 వేదికల్లో భారత్ తమ మ్యాచ్‌లు ఆడుతుంది.

1 భారత్ తొలిసారి ఈ టోర్నీని పూర్తిస్థాయిలో నిర్వహిస్తోంది. 1987లో పాక్‌తో, 1996లో పాక్, శ్రీలంకలతో, 2011లో శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో కలిసి సంయుక్తంగా ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇచ్చింది.

రూ. 83 కోట్లు టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ. ఇందులో విజేతకు రూ. 33 కోట్లు, రన్నరప్‌కు రూ.16.50 కోట్లు అందిస్తారు.

1 గత వరల్డ్‌కప్‌లోనూ, ఈసారి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఏకైక ఆటగాడు కేన్ విలియమ్సన్. మిగతా అన్ని జట్లకూ సారథులు మారారు.

51 టోర్నీలో మొత్తం మ్యాచ్‌ల సంఖ్య.

ఇంగ్లండ్ X న్యూజిలాండ్

2019 ఫైనలిస్టుల మధ్య టోర్నీ తొలి మ్యాచ్ జరుగుతుంది. 1996లో భారత్ ఆతిథ్యమిచ్చిన వరల్డ్ కప్‌లోనూ ఈ రెండు జట్ల మధ్యే ఇదే అహ్మదాబాద్‌లో టోర్నీ తొలి మ్యాచ్ జరిగింది.

గత విజేతలు

ఆస్ట్రేలియా (5 సార్లు; 1987, 1999, 2003, 2007, 2015). భారత్ (2 సార్లు; 1983, 2011). వెస్టిండీస్ (2 సార్లు; 1975, 1979). పాకిస్తాన్ (1992). శ్రీలంక (1996). ఇంగ్లండ్ (2019).

వన్డే ప్రపంచకప్-2023 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
అక్టోబర్ 5	ఇంగ్లండ్ x న్యూజిలాండ్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 6	పాకిస్తాన్ x నెదర్లాండ్స్	హైదరాబాద్	మ.గం.2 నుంచి
అక్టోబర్ 7	బంగ్లాదేశ్ x అఫ్గానిస్తాన్	ధర్మశాల	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 7	దక్షిణాఫ్రికా x శ్రీలంక	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 8	భారత్ x ఆస్ట్రేలియా	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 9	న్యూజిలాండ్ x నెదర్లాండ్స్	హైదరాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 10	ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	ధర్మశాల	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 10	పాకిస్తాన్ x శ్రీలంక	హైదరాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 11	భారత్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 12	ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	లక్నో	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 13	న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 14	భారత్ x పాకిస్తాన్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 15	ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 16	ఆస్ట్రేలియా x శ్రీలంక	లక్నో	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 17	దక్షిణాఫ్రికా x నెదర్లాండ్స్	ధర్మశాల	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 18	న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 19	భారత్ x బంగ్లాదేశ్	పుణే	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 20	ఆస్ట్రేలియా x పాకిస్తాన్	బెంగళూరు	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 21	నెదర్లాండ్స్ x శ్రీలంక	లక్నో	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 21	ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	ముంబై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 22	భారత్ x న్యూజిలాండ్	ధర్మశాల	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 23	పాకిస్తాన్ x అఫ్గానిస్తాన్	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 24	దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్	ముంబై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 25	ఆస్ట్రేలియా x నెదర్లాండ్స్	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 26	ఇంగ్లండ్ x శ్రీలంక	బెంగళూరు	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 27	పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా	చెన్నై	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 28	ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	ధర్మశాల	ఉ.గం. 10:30 నుంచి
అక్టోబర్ 28	నెదర్లాండ్స్ x బంగ్లాదేశ్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 29	భారత్ x ఇంగ్లండ్	లక్నో	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 30	అఫ్గానిస్తాన్ x శ్రీలంక	పుణే	మ.గం. 2 నుంచి
అక్టోబర్ 31	పాకిస్తాన్ x బంగ్లాదేశ్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 1	న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	పుణే	మ.గం. 2 నుంచి
నవంబర్ 2	భారత్ x శ్రీలంక	ముంబై	మ.గం. 2 నుంచి
నవంబర్ 3	నెదర్లాండ్స్ x అఫ్గానిస్తాన్	లక్నో	మ.గం. 2 నుంచి
నవంబర్ 4	న్యూజిలాండ్ x పాకిస్తాన్	బెంగళూరు	ఉ.గం. 10:30 నుంచి
నవంబర్ 4	ఇంగ్లండ్ xఆస్ట్రేలియా	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
నవంబర్ 5	భారత్ x దక్షిణాఫ్రికా	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 6	బంగ్లాదేశ్ x శ్రీలంక	ఢిల్లీ	మ.గం. 2 నుంచి
నవంబర్ 7	ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	ముంబై	మ.గం. 2 నుంచి
నవంబర్ 8	ఇంగ్లండ్ x నెదర్లాండ్స్	పుణే	మ.గం. 2 నుంచి
నవంబర్ 9	న్యూజిలాండ్స్ శ్రీలంక	బెంగళూరు	మ.గం. 2 నుంచి
నవంబర్ 10	దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి
నవంబర్ 11	ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	పుణే	ఉ.గం. 10:30 నుంచి
నవంబర్ 11	ఇంగ్లండ్ x పాకిస్తాన్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 12	భారత్ x నెదర్లాండ్స్	బెంగళూరు	మ.గం. 2 నుంచి
నవంబర్ 15	తొలి సెమీఫైనల్	ముంబై	మ.గం. 2 నుంచి
నవంబర్ 16	రెండో సెమీఫైనల్	కోల్‌కతా	మ.గం. 2 నుంచి
నవంబర్ 19	ఫైనల్	అహ్మదాబాద్	మ.గం. 2 నుంచి

నోట్: డే-నైట్ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతాయి. డే మ్యాచ్‌లు ఉదయం గం. 10:30 నుంచి జరుగుతాయి.
● సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే కేటాయించారు. ● లీగ్ దశ ముగిశాక టాప్–4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుతాయి. టాప్ ర్యాంక్‌లో నిలిచన జట్టు నాలుగో స్థానంలో నిలిచిన జట్టుతో తొలి సెమీఫైనల్లో... రెండో ర్యాంక్‌లో నిలిచిన జట్టు మూడో స్థానంలో నిలిచిన జట్టుతో రెండో సెమీఫైనల్లో తలపడతాయి. ● మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ చానెల్స్‌లో, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

భళా భారత్...

● ఆసియా క్రీడల చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు
● 81 పతకాలతో 2018 ఏషియాడ్ ప్రదర్శనను దాటిన భారత్
● 11వ రోజు 12 పతకాలతో అదరగొట్టిన భారత క్రీడాకారులు
● టైటిల్ నిలబెట్టుకున్న జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా
● ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ–ఓజస్ జోడీకి స్వర్ణం



నీరజ్ చోప్రా

పతకాల్లో తొలిసారి 'సెంచరీ' దాటాలనే లక్ష్యంతో చైనా గడ్డపై అడుగుపెట్టిన భారత క్రీడా బృందం ఈ క్రమంలో ఆసియా క్రీడల చరిత్రలోనే తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ క్రీడలు ముగియడానికి మరో నాలుగు రోజులు ఉండగా... ఇప్పటికే భారత్ ఖాతాలో 81 పతకాలు చేరాయి. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ అత్యధికంగా 70 పతకాలు సాధించింది. పోటీల 11వ రోజు భారత్ మూడు స్వర్ణాలు, ఐదు రజతాలు, నాలుగు కాంస్యాలతో కలిపి 12 పతకాలు సొంతం చేసుకుంది. మారథాన్ రేసుతో నేడు అథ్లెటిక్స్ ఈవెంట్స్‌కు తెర పడనున్న నేపథ్యంలో... ఆర్చరీ, క్రికెట్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, స్క్వాష్, బ్రిడ్జ్, చెస్ క్రీడాంశాల్లో భారత్ ఎన్ని పతకాలు సాధిస్తుందో వేచి చూడాలి.

హాంగ్జౌ: భారత అథ్లెటిక్స్ 'పోస్టర్ బాయ్' నీరజ్ చోప్రా ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో మెరిశాడు. సహచరుడు కిశోర్ కుమార్ జేనా నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురుకావడంతో నీరజ్ చోప్రా నుంచి ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన బయటకు వచ్చింది. బుధవారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో స్వర్ణ, రజత పతకాలు భారత్ ఖాతాలోకి వెళ్లాయి. డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 88.88 మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. కిశోర్ కుమార్ జేనా జావెలిన్‌ను తన మూడో ప్రయత్నంలో 86.77 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానానికి వచ్చాడు. అయితే నీరజ్ చోప్రా తన నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 88.88 మీటర్ల దూరం విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ త్రో నమోదు చేశాడు. అంతేకాకుండా స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. కిశోర్ నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 87.54 మీటర్ల దూరం విసిరి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందినా నీరజ్ దూరాన్ని దాటలేకపోయాడు. తర్వాతి రెండు ప్రయత్నాల్లో కిశోర్ ఫౌల్ చేసి పాల్గొన్న తొలి ఆసియా క్రీడల్లోనే రజత పతకం గెలిచి సంబరపడ్డాడు. మరోవైపు ఈ ప్రదర్శనతో నీరజ్ వరుసగా రెండు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు గెలిచిన రెండో జావెలిన్ త్రోయర్‌గా గుర్తింపు పొందాడు. గతంలో పాకిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ నవాజ్ (1951, 1954) ఈ ఘనత సాధించాడు. రజత పతకం నెగ్గిన ఒడిశా ప్లేయర్ కిశోర్ కుమార్‌కు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ. ఒక కోటీ 50 లక్షలు నజరానా ప్రకటించారు.


హర్‌మిలన్

61 ఏళ్ల తర్వాత రిలేలో స్వర్ణం

పురుషుల 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో మొహమ్మద్ అనస్, అమోజ్ జేకబ్, అజ్మల్, రాజేశ్ రమేశ్‌లతో కూడిన భారత బృందం స్వర్ణ పతకం గెలిచింది. భారత బృందం 3ని:01.58 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి ఈ విభాగంలో 61 ఏళ్ల తర్వాత భారత్‌కు మళ్లీ పసిడి పతకాన్ని అందించింది. 1962 ఆసియా క్రీడల్లో మిల్కా సింగ్, మఖన్ సింగ్, దల్జీత్ సింగ్, జగదీశ్ సింగ్ బృందం చివరిసారి 4x400 మీటర్ల రిలేలో భారత్‌కు బంగారు పతకాన్ని అందించింది. మరోవైపు ఐశ్వర్య మిశ్రా, శుభ వెంకటేశ్, ప్రాచీ, విత్యా రామ్‌రాజ్‌లతో కూడిన భారత మహిళల జట్టు 4x400 మీటర్ల రిలేలో రజత పతకంతో (3ని:27.85 సెకన్లు) సరిపెట్టుకుంది. పురుషుల 5000 మీటర్ల విభాగంలో అవినాశ్ సాబ్లే (13ని:21.09 సెకన్లు) రజత పతకం గెలిచాడు. మహిళల 800 మీటర్ల ఫైనల్ రేసును భారత అథ్లెట్ హర్‌మిలన్ బైన్స్ 2ని:03.75 సెకన్లలో పూర్తి చేసి రజత పతకం కైవసం చేసుకుంది. 35 కిలోమీటర్ల నడక మిక్స్‌డ్ విభాగంలో మంజు రాణి, రాంబాబు జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	171	94	51	316
జపాన్	37	51	59	147
దక్షిణ కొరియా	33	45	70	148
భారత్	18	31	32	81
ఉజ్బెకిస్తాన్	16	16	22	54
చైనీస్ తైపీ	12	14	20	46
థాయ్‌లాండ్	10	12	24	46
ఉత్తర కొరియా	9	11	8	28
బహ్రెయిన్	9	1	5	17
హాంకాంగ్	7	15	28	50

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.


స్వర్ణ పతకాలతో భారత 4x400 రిలే జట్టు సభ్యులు రాజేశ్, అమోజ్, అజ్మల్, అనస్

సురేఖ-ఓజస్ జోడీకి స్వర్ణం



ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ–ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే (భారత్) జోడీ స్వర్ణ పతకాన్ని సాధించింది. ఫైనల్లో జ్యోతి సురేఖ–ఓజస్ ప్రవీణ్ జంట 159–158తో సో చేవన్–జేహూన్ జూ (దక్షిణ కొరియా) ద్వయంపై గెలిచింది. అంతకుముందు సురేఖ–ఓజస్ సెమీఫైనల్లో 159–154తో కజకిస్తాన్ జోడీపై, క్వార్టర్ ఫైనల్లో 158–155తో మలేసియా జంటపై విజయం సాధించింది. మరోవైపు బ్రిడ్జ్ క్రీడాంశంలో పురుషుల టీమ్ విభాగంలో భారత జట్టు ఫైనల్‌కు చేరి కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకోగా... చెస్‌లో భారత పురుషుల, మహిళల జట్లు రెండో స్థానంలో కొనసాగుతూ పతకాల రేసులో ఉన్నాయి.

'పసిడి'కి విజయం దూరంలో...

ఫైనల్లో భారత పురుషుల హాకీ జట్టు



పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు... ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచేందుకు భారత పురుషుల హాకీ జట్టు విజయం దూరంలో నిలిచింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 5–3 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై కష్టపడి గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ తరఫున హార్దిక్ సింగ్ (5వ ని.లో), మన్‌దీప్ సింగ్ (11వ ని.లో), లలిత్ కుమార్ ఉపాధ్యాయ్ (15వ ని.లో), అమిత్ రోహిదాస్ (24వ ని.లో), అభిషేక్ (54వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. కొరియా తరఫున మన్‌జె జుంగ్ (17వ, 20వ, 42వ ని.లో) 'హ్యాట్రిక్'తో మూడు గోల్స్ చేసినా ఫలితం లేకపోయింది. శుక్రవారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో భారత్ తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో జపాన్ 3–2తో చైనాను ఓడించింది. భారత్ 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించగా... 2018 జకార్తా ఏషియాడ్‌లో కాంస్యంతో సరిపెట్టుకుంది.

స్క్వాష్‌లో రెండు స్వర్ణాలపై గురి



ఆసియా క్రీడల స్క్వాష్ ఈవెంట్‌లో భారత్ రెండు స్వర్ణ పతకాలపై గురి పెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్–హరీందర్‌పాల్ జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లగా... భారత్‌కే చెందిన అనాహత్ సింగ్–అభయ్ సింగ్ జంట సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో సౌరవ్ ఘోషాల్ కూడా తుది పోరుకు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో దీపిక–హరీందర్ ద్వయం 7–11, 11–7, 11–9తో లీ కా యి–వోంగ్ చి హిమ్ (హాంకాంగ్) జంటను ఓడించింది. అనాహత్–అభయ్ జోడీ 11–8, 2–11, 9–11తో అజ్మాన్ ఐఫా–మొహమ్మద్ కమాల్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో సౌరవ్ 11–2, 11–1, 11–6తో చి హిన్ హెన్రీ (హాంకాంగ్)పై గెలుపొందాడు.

క్వార్టర్స్‌లో సింధు, ప్రణయ్



హాంగ్జౌ: ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ ఈవెంట్ సింగిల్స్ విభాగాల్లో భారత స్టార్స్ పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... కిడాంబి శ్రీకాంత్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–16, 21–16తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–12, 21–13తో దిమిత్రీ పనారిన్ (కజకిస్తాన్)ను ఓడించాడు. శ్రీకాంత్ 16–21, 17–21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 24–22, 16–21, 21–12తో లియో రోలీ కర్నాండో–డేనియల్ మార్టిన్ (ఇండోనేసియా) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జంట 15–21, 21–18, 13–21తో కిమ్ సోయోంగ్–కాంగ్ హీయోంగ్ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తనీషా క్రాస్టో–సాయిప్రతీక్ (భారత్) జంట 18–21, 18–21తో తో ఈ వె–చెన్ టాంగ్ జీ (మలేసియా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

13 ఏళ్ల తర్వాత పతకం



ఆసియా క్రీడల రెజ్లింగ్‌లో పురుషుల గ్రీకో రోమన్ శైలిలో 13 ఏళ్ల తర్వాత భారత్‌కు మళ్లీ పతకం లభించింది. 87 కేజీల విభాగంలో సునీల్ కుమార్ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. కాంస్య పతక బౌట్‌లో సునీల్ 2–1తో అతాబెక్ అజీస్‌బెకోవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన జ్ఞానేందర్ (60 కేజీలు), నీరజ్ (67 కేజీలు), వికాస్ (77 కేజీలు) తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. చివరిసారి 2010 గ్వాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత గ్రీకో రోమన్ రెజ్లర్లు రవీందర్ సింగ్ (60 కేజీలు), సునీల్ కుమార్ రాణా (66 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

లవ్లీనా రజతంతో సరి...



ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత పోరాటం ముగిసింది. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా బొర్గొహైన్ రజత పతకంతో సరిపెట్టుకుంది. లీ కియాన్ (చైనా)తో జరిగిన ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ లవ్లీనా 0–5తో ఓడిపోయింది. మహిళల 57 కేజీల విభాగం సెమీఫైనల్లో పర్వీన్ హుడా 0–5తో లిన్ యు టింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయి కాంస్య పతకం సాధించింది. ఈ ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు ఒక రజతం, నాలుగు కాంస్యాలు గెలిచారు. 2018 ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు ఒక స్వర్ణం, ఒక కాంస్యం నెగ్గారు.

సాక్షి బిజినెస్
గురువారం
5-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	286	65,226
నిఫ్టీ ▽	93	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,154	△	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	△	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,653	▽	22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426	▽	22
వెండి (కిలో)	67,446	△	409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.87	102.21
€	యూరో	ఎస్‌బీఐ	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.95	56.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.65	61.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హూడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్చేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడంతోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.

నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్టం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.

- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్లు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు.



అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117–118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.

వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి



న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.

భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత్ టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, డయాజియో, ఎంఆర్‌ఎఫ్, లెండింగ్‌కార్ట్, టీపీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా–కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్డ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్–సర్వ్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు.



సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.

భవిత

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Quiz, Drawing, Essay పోటీలు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే ఈ క్యూఆర్ స్కాన్ చేయండి.. మీ మేధస్సుకు పదును పెట్టి.. ఈ పోటీల్లో పాల్గొనండి.. విజేతలుగా నిలవండి. –ఆల్ ది బెస్ట్..

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు –100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్–2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్–2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్–02, క్లినికల్ సైకాలజిస్ట్–01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్)–01, యోగా ఇన్‌స్ట్రక్టర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–04, స్టోర్ కీపర్–04, జూనియర్ ఇంజనీర్–03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్–01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్–02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, ఆప్టోమెట్రిస్ట్–02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)–16, టెక్నీషియన్(రేడియాలజీ)–02, ఫార్మసిస్ట్–05, ఫైర్ టెక్నీషియన్–02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు–02, స్టెనోగ్రాఫర్–04, లాండ్రీ సూపర్‌వైజర్–01, జూనియర్ వార్డెన్–02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్సిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్టులలో నెట్ నిర్వహణ

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్‌ఎఫ్ పొందొచ్చు. మరో వైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ–నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ–నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్ట్‌లలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ–నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్‌ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1.. 50 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2.. 100 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

పేపర్ ఎంపిక ఎలా

- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్–1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.



కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్-1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్–1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ పేపర్

పేపర్–2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్‌ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్‌ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్, ఎస్‌ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 30, 31 అక్టోబర్ 2023
- **పరీక్ష తేదీలు:** 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

క్లుప్తంగా...

నేటి నుంచి రూ.20 వెల్ఫేర్ స్టాంప్ తప్పనిసరి

గుంటూరు లీగల్: కోర్టులో దాఖలు చేసే పిటిషన్లకు ఇప్పటివరకు వేస్తోన్న రూ.1 స్టాంప్ స్థానంలో రూ.20 న్యాయవాదుల వెల్ఫేర్ స్టాంప్ వేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ జారీ చేసిన ఉత్తర్వులు గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి రానుంది. గత నెల 15న హైకోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ బార్ కౌన్సిల్ ప్రత్యేకంగా రూపొందించిన రూ.20 న్యాయవాదుల వెల్ఫేర్ స్టాంప్‌ను విడుదల చేశారు. ఈ స్టాంప్‌ల వినియోగం అక్టోబర్ 5 నుంచి అమల్లోకి వస్తుందని అప్పట్లో బార్ కౌన్సిల్ ప్రకటించింది. దీంతో స్టాంప్‌లు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లకు చేరాయి. కాగా, వీటి వినియోగంపై న్యాయవాదుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని బార్ అసోసియేషన్లు ఈ స్టాంప్‌ల వినియోగానికి వ్యతిరేకంగా, మరికొన్ని అనుకూలంగా తీర్మానాలు చేశాయి. ఈ స్టాంప్‌ల వినియోగానికి వ్యతిరేకంగా అనంతపురం బార్ అసోసియేషన్ ఈ నెల 14 వరకు కోర్టు విధులను బహిష్కరించాలని తీర్మానించింది.

శతాధిక వృద్ధురాలు లింగాలమ్మ మృతి


లింగాలమ్మ (ఫైల్)

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ దొకులూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గబులంగి లింగాలమ్మ(110) బుధవారం కన్నుమూశారు. ఈమె విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుడు అగ్గిరాజుకు మేనకోడలు. అప్పటిలో పితూరు సమయంలో ఆమె అల్లూరి అనుచరులకు ఆహారం సమకూర్చేవారని స్థానికులు తెలిపారు. లింగాలమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, ఆరుగురు మనవలు, మనవరాళ్లు ఉన్నారు.

అమెరికా ప్రముఖులతో కృష్ణా జిల్లా విద్యార్థి మాటామంతీ

- విద్యార్థికి 'జగనన్న విదేశీ విద్య' కింద రూ.కోటి మంజూరు


కొలంబియా యూనివర్సిటీలో హిల్లరీ క్లింటన్, యూనిసెఫ్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెన్‌రైటాతో కృష్ణకిషోర్

అడపావారిపాలెం(మోపిదేవి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వైనాన్ని.. విదేశీ విద్యకు జగనన్న చేస్తున్న సాయాన్ని అగ్రరాజ్యం అమెరికాకు చెందిన ప్రముఖులకు వివరించాడు కృష్ణా జిల్లాకు చెందిన ఓ విద్యార్థి. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లిన గ్రామీణ ప్రాంత యువకుడు ఆ దేశ ప్రముఖులను కలసి తన విద్యాభిరుచిని తెలియపర్చారు. మోపిదేవి మండలంలోని అడపావారిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, శివప్రసాద్ కుమారుడు కృష్ణకిషోర్‌కు విదేశీ విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల కోటి రూపాయలు మంజూరు చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం ఇటీవల అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి వెళ్లిన కృష్ణ కిషోర్.. తాను చదువుతున్న యూనివర్సిటీకి వచ్చిన అమెరికా మాజీ అధ్యక్షుడు క్లింటన్ సతీమణి హిల్లరీ క్లింటన్, యూనిసెఫ్, యూఎస్ఏఐడీ అడ్మినిస్ట్రేటర్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెన్‌రైటాను కలుసుకున్నారు. పేద విద్యార్థులకు సైతం విదేశాల్లో ఉన్నత విద్యను అందిస్తున్న సీఎం జగనన్నకు తమ కుటుంబం ఎంతో రుణపడి ఉందన్నారు. తనకు సహకరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సామాన్యులకు సైతం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం

- మిథానీ గ్రూప్ చైర్మన్ సంజయ్‌కుమార్ ఝా

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): దేశంలోని మారుమూల గ్రామాల్లో ఉండే సామాన్యులకు సైతం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నామని మిథానీ గ్రూప్ చైర్మన్ సంజయ్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. బుధవారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షార్ కేంద్రం, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో అంతరిక్ష వారోత్సవాలను కూడా వర్చువల్ పద్ధతిలో ఆరంభించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. చిన్న చిన్న ప్రయోగాలు చేసే స్థాయి నుంచి నేడు చంద్రయాన్-3, మంగళ్‌యాన్-1, సూర్యయాన్-1 (ఆదిత్య ఎల్1) లాంటి గ్రహాంతర ప్రయోగాలు చేసే స్థాయికి ఎదిగామన్నారు. రాబోయే 15 సంవత్సరాల్లో ఏడాదికి 25 ప్రయోగాలు చేయాలనే లక్ష్యంతో అందుకు తగినట్టుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నామని షార్ డైరెక్టర్ రాజరాజన్ తెలిపారు.

అసైన్డ్ భూముల యాజమాన్య హక్కులపై

భారీ కసరత్తు

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అసైన్డ్ భూముల వెరిఫికేషన్

- జూలై 31 నాటికి అసైన్ చేసి 20 ఏళ్లు పూర్తయిన భూముల వివరాల తనిఖీ
- అసైన్డ్ భూముల్లో అసైన్డ్‌దారులే ఉన్నారా? వేరే వ్యక్తులు ఉన్నారా? అనే దానిపై నిశిత పరిశీలన
- ఆర్డీవో, జేసీల వెరిఫికేషన్ తర్వాత జిల్లాలవారీగా జాబితాల రూపకల్పన
- ఈ నెలాఖరుకు పూర్తి కానున్న తనిఖీలు



క్షేత్ర స్థాయిలో నిశిత పరిశీలన..

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. అసైన్డ్ రైతులకు హక్కులిచ్చేందుకు అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించిన ప్రభుత్వం దాన్ని అమలు చేసే దిశగా వేగంగా అడుగులేస్తోంది. అందులో భాగంగా జిల్లాల్లో అసైన్డ్ భూముల లెక్కలు తేల్చేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చురుగ్గా వెరిఫికేషన్ జరుగుతోంది. ఈ ఏడాది జూలై 31 నాటికి అసైన్ చేసి 20 ఏళ్లు పూర్తయిన భూముల వివరాలను వీఆర్‌వోలు తనిఖీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమికంగా 27.41 లక్షల ఎకరాలపై హక్కులివ్వాలని ఇప్పటికే నిర్ణయించగా క్షేత్ర స్థాయిలో ఆ భూములను పరిశీలిస్తున్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో అసైన్డ్ భూములు అసైన్‌దారుల చేతుల్లో ఉన్నాయా, లేదా అనే విషయాన్ని వీఆర్‌వోలు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన పట్టాను పరిశీలించి ఆ పట్టాదారు ప్రభుత్వం భూమి కేటాయించిన వ్యక్తా లేక అతని వారసుడా? అనే విషయాన్ని నమోదు చేస్తున్నారు. సంబంధిత భూమి వారి ఆధీనంలోనే ఉందా? రెవెన్యూ రికార్డుల ప్రకారం.. ఆ భూమి లంక భూమా? లేక నీటి వనరులకు సంబంధించిన భూమా? ఆ భూమి అతనికి ప్రభుత్వం ఎప్పుడు అసైన్ చేసింది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి డీకేటీ రిజిస్టర్లు, 1బీ అడంగల్, 22ఏ జాబితా, ఇతర రెవెన్యూ రికార్డులు చూసి వాటికి తగ్గట్టు క్షేత్ర స్థాయి పరిస్థితి ఉందా లేదా?, వాస్తవ పరిస్థితి ఏమిటనే విషయాలను నమోదు చేస్తున్నారు.

4 వేల గ్రామాల్లో పూర్తి..

ఇప్పటివరకు 4 వేల గ్రామాల్లోని 8 లక్షల ఎకరాల్లో వీఆర్‌వోలు వెరిఫికేషన్ పూర్తి చేశారు. తహశీల్దార్లు 2,600 గ్రామాల్లో తనిఖీలు పూర్తి చేయగా, ఆర్డీవోలు వెయ్యికి పైగా గ్రామాల్లో, జేసీలు 150కిపైగా గ్రామాల్లో వెరిఫికేషన్ ముగించారు. దీంతో తనిఖీలు పూర్తయిన గ్రామాల్లో తహశీల్దార్లు అసైన్డ్ భూముల జాబితాలను తయారు చేస్తున్నారు. వీఆర్‌వోలు, తహశీల్దార్ల స్థాయిలో జరిగిన వెరిఫికేషన్‌ను ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి వెరిఫికేషన్‌ను పూర్తి చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అసైన్డ్ భూముల జాబితాలను తయారు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇవన్నీ తయారైన తర్వాత వచ్చే నెలలో పూర్తి స్థాయిలో తనిఖీ చేసి జిల్లా కలెక్టర్లకు పంపనున్నారు. వారి నుంచి జిల్లా రిజిస్ట్రార్లకు 22(ఎ) నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించాల్సిన భూముల జాబితాను పంపడానికి కసరత్తు జరుగుతోంది.

టుడేస్ గ్రాఫిక్



'కృష్ణా' వివాదం బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే

- టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. అంతరాష్ట్ర నదీ జల వివాదాల పరిష్కార చట్టం సెక్షన్ 5(1) కింద ఇప్పటికే కొనసాగుతున్న బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే వివాదాల పరిష్కార బాధ్యతలను కట్టబెడుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం ప్రకటించింది. ఈ మేరకు నదీ జలాల వివాద పరిష్కారానికి విధివిధానాలను ఖరారు చేసేలా టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)కు ఆమోదం తెలుపుతూ బుధవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అంతరాష్ట్ర నదీ జల వివాదాల చట్టం సెక్షన్-3 కింద కృష్ణా జలాల పంపకాలను రెండు రాష్ట్రాల మధ్య కొత్తగా జరపాలని, అందు కోసం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ప్రస్తుత బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కే బాధ్యతలు కట్టబెట్టాలంటూ తెలంగాణ ప్రభుత్వం 2014 జూలైలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. అనంతరం సుప్రీంకోర్టును ఆశ్రయించి కొత్త ట్రిబ్యునల్ కోసం పిటిషన్ వేసింది. సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటే కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై పరిశీలిస్తామని 2020లో కేంద్ర జల శాఖ మంత్రి హామీ ఇచ్చారు. ఈమేరకు తెలంగాణ చర్యలు తీసుకున్న నేపథ్యంలో నూతన టీఓఆర్‌కు ఆమోదం తెలుపుతున్నట్టు తాజాగా కేంద్ర క్యాబినెట్ తెలిపింది. కృష్ణా జలాల వినియోగం, పంపిణీపై ట్రిబ్యునల్ తీసుకోనున్న నిర్ణయం రెండు రాష్ట్రాలకు మేలు చేస్తోందని కేంద్రం పేర్కొంది.

కేంద్రమంత్రి మండలి నిర్ణయంతో 'కృష్ణా' పంచాయితీ మళ్లీ మొదటికి!

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపకంపై కేడబ్ల్యూడీటీ-2కు మరిన్ని విధి విధానాల సూచన

- పునఃపంపిణీ చేయాలన్న తెలంగాణ ప్రతిపాదనను ప్రస్తావిస్తూ కేడబ్ల్యూడీటీ-2 తుది నివేదిక సంతృప్తికరంగా లేదన్న కేంద్రం
- తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ మళ్లీ మొదటికొచ్చిందంటున్న నిపుణులు
- కేడబ్ల్యూడీటీ-1 కేటాయించిన నికర జలాల జోలికి వెళ్లబోమన్న కేడబ్ల్యూడీటీ-2
- నికర జలాల్లో ఏపీ వాటా 512.04 టీఎంసీలు.. తెలంగాణ వాటా 298.96 టీఎంసీలు
- మిగులు జలాలు 194 టీఎంసీల పంపిణీకే పరిమితం కానున్న ట్రిబ్యునల్



సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రానికి కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) కేటాయించిన జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పంపిణీ చేసే ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంపిణీ చేయడానికి కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదించిన మరిన్ని విధి విధానాలను కేంద్ర మంత్రిమండలి బుధవారం ఆమోదించింది. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డీఏ) 1956 ప్రకారం ఏర్పాటై సెక్షన్ 5(1) కింద కొనసాగుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కేడబ్ల్యూడీటీ 2కే కృష్ణా జలాల పంపిణీ బాధ్యతను అప్పగించింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను విభజన చట్టం సెక్షన్ 89 విధి విధానాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై 2016 అక్టోబర్ 19 నుంచి ఇప్పటిదాకా అంటే సుమారు ఏడేళ్లుగా కేడబ్ల్యూడీటీ 2 విచారిస్తోంది. కేంద్ర మంత్రిమండలి తాజా నిర్ణయంతో కృష్ణా జలాల పంపిణీ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తుది నివేదికపై పదేళ్ల తర్వాత అసంతృప్తా?

ఐఎస్ఆర్‌డబ్ల్యూఏ 1956 సెక్షన్ 3 ప్రకారం నదీ జలాల వివాదాలను పరిష్కరించాలని ఆ బేసిన్ పరిధిలోని ఏదైనా రాష్ట్రం కోరితే అదే బేసిన్‌లోని మిగతా రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతుంది. వివాదం పరిష్కారానికి రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తం కాకుంటే పరిష్కరించేందుకు సెక్షన్ 4 ప్రకారం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తుంది. ఆ ట్రిబ్యునల్ విచారణ చేపట్టి మూడేళ్లలోగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలి. ఇందులో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ప్రాథమిక నివేదిక ఇచ్చేందుకు మరో రెండేళ్లు గడువు పొడిగింపు ఉంటుంది. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సెక్షన్ 5(3) ప్రకారం తుది నివేదిక ఇవ్వాలి. దీనిపై ఏవైనా అభ్యంతరాలుంటే మూడు నెలల్లోగా వ్యక్తం చేయాలి. ఆ తర్వాత సెక్షన్ 6(1) ప్రకారం ట్రిబ్యునల్ తుది నివేదికను అవార్డుగా కేంద్రం అమల్లోకి తెస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. వివాదం పరిష్కారమైనట్లు కేంద్రం సంతృప్తి చెందితే సెక్షన్ 12 ప్రకారం ట్రిబ్యునల్‌ను రద్దు చేస్తుంది. లేదంటే పరిష్కారానికి మరిన్ని విధి విధానాలను ట్రిబ్యునల్‌కు సూచిస్తుంది. కృష్ణా జలాలను పంపిణీ చేస్తూ 2013 నవంబర్ 29న కేంద్రానికి కేడబ్ల్యూడీటీ 2 తుది నివేదిక ఇచ్చింది. దీనిపై పదేళ్ల తర్వాత సంతృప్తికరంగా లేదని కేంద్రం ప్రకటించడం గమనార్హం. సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని తెలంగాణ సర్కార్ కోరిన నేపథ్యంలో కేడబ్ల్యూడీటీ-2 తుది నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి మరిన్ని విధి విధానాలను కేంద్ర మంత్రిమండలి ప్రతిపాదించింది.

పంపిణీకి విభజన చట్టం మార్గదర్శకాలివీ..

- సెక్షన్ 89(ఏ): అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం 1956 ప్రకారం ఏర్పాటైన ట్రిబ్యునల్ నిర్దిష్టంగా నీటి కేటాయింపులు చేయని ప్రాజెక్టులకు ఆయా ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలి.
- 89(బీ): నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ప్రాజెక్టుల వారీగా నీటి విడుదలకు ఆపరేషనల్ ప్రోటోకాల్ రూపొందించాలి.
- రాష్ట్ర విభజన జరిగే నాటికి అంటే 2014 జూన్ 2కు ముందు ట్రిబ్యునల్‌లు ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులకు రెండు రాష్ట్రాలు కట్టుబడి ఉండాలి.

నికర జలాలు యథాతథం.. మిగులే పంపిణీ

ఉమ్మడి రాష్ట్రానికి 811 టీఎంసీల నికర జలాలు (75 శాతం లభ్యత) కేటాయిస్తూ 1976 మే 27న కేడబ్ల్యూడీటీ-1 తుది నివేదిక ఇచ్చింది. దాన్ని 1976 మే 31న కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఐఎస్ఆర్‌డబ్ల్యూఏ 1956 చట్టం సెక్షన్ 6(2) ప్రకారం కేడబ్ల్యూడీటీ-1 అవార్డు సుప్రీం కోర్టు డిక్రీతో సమానం. దాన్ని పునఃసమీక్షించడం చట్టవిరుద్ధం. అందుకే కేడబ్ల్యూడీటీ-2 వాటి జోలికి వెళ్లలేదు. 65 శాతం లభ్యత కింద ఉన్న మిగులు జలాలు 194 టీఎంసీలను ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ-2 అదనంగా కేటాయించింది. కేడబ్ల్యూడీటీ-1 ప్రాజెక్టుల వారీగా చేసిన నీటి కేటాయింపుల ఆధారంగానే ఏపీకి 512.04, తెలంగాణకు 298.96 టీఎంసీల చొప్పున పంపిణీ చేస్తూ 2015 జూలై 18-19న కేంద్ర జల్ శక్తి శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక సర్దుబాటుపై రెండు రాష్ట్రాలు సంతకాలు చేశాయి. కేడబ్ల్యూడీటీ 2 కూడా కేడబ్ల్యూడీటీ-1 కేటాయించిన నికర జలాల జోలికి వెళ్లబోమని స్పష్టం చేసింది. అంటే 194 టీఎంసీల మిగులు జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికే కేడబ్ల్యూడీటీ 2 పరిమితం కానుంది.

జల జగడాల క్రమం ఇదీ..:

- 1969 ఏప్రిల్ 10: మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల ప్రతిపాదన మేరకు ఐఎస్ఆర్‌డీఏ కృష్ణా జలాల పంపిణీకి జస్టిస్ బచావత్ అధ్యక్షతన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1)ను ఏర్పాటు చేసిన కేంద్రం
- 1976 మే 27: జల వివాదాలను పరిష్కరిస్తూ కేంద్రానికి తుదినివేదిక ఇచ్చిన కేడబ్ల్యూడీటీ-1
- 1976 మే 31: కేడబ్ల్యూడీటీ-1 అవార్డును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం. 25 ఏళ్ల వరకూ అవార్డును పునఃసమీక్షించాలని కోరకూడదని షరతు.
- 2004 ఏప్రిల్ 2: కేడబ్ల్యూడీటీ-1 అవార్డు కాల పరిధి ముగియడంతో కృష్ణా జలాలను సెక్షన్-3 కింద పునఃపంపిణీ చేయాలని మూడు రాష్ట్రాలు కోరడంతో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన కేడబ్ల్యూడీటీ-2ను ఏర్పాటు చేసిన కేంద్రం
- 2010 డిసెంబర్ 30: మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలను పంపిణీ చేస్తూ సెక్షన్-5(2) ప్రకారం కేంద్రానికి ప్రాథమిక నివేదిక ఇచ్చిన కేడబ్ల్యూడీటీ-2
- 2013 నవంబర్ 29: మూడు రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని కృష్ణా జలాలను పంపిణీ చేస్తూ సెక్షన్-5(3) కింద తుది నివేదికను కేంద్రానికి ఇచ్చిన కేడబ్ల్యూడీటీ-2(ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలో సుప్రీం కోర్టులో సవాల్ చేయడంతో దాన్ని అమలు చేయని కేంద్రం)
- 2014 మార్చి 1: ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తూ చట్టాన్ని ఆమోదించిన కేంద్రం. ఆ చట్టంలో సెక్షన్-89 ప్రకారం ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీళ్లు రెండు రాష్ట్రాలకు పంపిణీ బాధ్యతను ట్రిబ్యునల్‌కు అప్పగించాలని నిర్ణయం
- 2014 మే 15: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేడబ్ల్యూడీటీ-2 కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను అదే ట్రిబ్యునల్‌కు అప్పగించిన కేంద్రం
- 2014, జూన్ 16: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాలని కేడబ్ల్యూడీటీ-2 ఛైర్మన్ బ్రిజేష్‌కుమార్‌ను కోరిన కేంద్రం
- 2020 అక్టోబర్ 6: అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్‌ను కోరిన తెలంగాణ సీఎం కేసీఆర్. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఎస్సెల్పీని ఉపసంహరించుకుని ప్రతిపాదన పంపితే తుది నిర్ణయం తీసుకుంటామన్న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి
- 2021 అక్టోబర్ 6: కృష్ణా జలాలను సెక్షన్-3 కింద పునఃపంపిణీ చేయాలని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఎస్సెల్పీని వెనక్కి తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం
- 2021 అక్టోబర్ 9, 11: కృష్ణా జలాలను సెక్షన్-3 ప్రకారం పంపిణీ చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు తెలంగాణ ప్రభుత్వం లేఖ. దీనిపై నిర్ణయం తీసుకొనే ముందు భౌతికంగా తమ వాదనలు వినాలని ఏపీ ప్రభుత్వం లేఖ
- 2023 అక్టోబర్ 4: రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి కొత్త విధి విధానాలను రూపొందిస్తూ కేంద్ర మంత్రిమండలి నిర్ణయం.

అధ్యయనం చేస్తున్నాం

కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి కేడబ్ల్యూడీటీ-2కు మరిన్ని విధి విధానాలను ప్రతిపాదిస్తూ కేంద్రమంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని అధ్యయనం చేస్తున్నాం. కేంద్ర మంత్రి మండలి ప్రతిపాదించిన విధి విధానాలపై స్పష్టత రావాల్సి ఉంది. వాటిపై స్పష్టత వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించడానికి అన్ని చర్యలు తీసుకుంటాం.
శశిభూషణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ.

కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులు ఇవీ (75 శాతం లభ్యత ఆధారంగా)..

రాష్ట్రం	కేటాయింపులు (టీఎంసీల్లో)
మహారాష్ట్ర	585
కర్ణాటక	734
ఆంధ్రప్రదేశ్	811
మొత్తం	2,130

కేడబ్ల్యూడీ-2 కేటాయింపులు ఇవీ..

రాష్ట్రం	75 శాతం లభ్యత	65 శాతం లభ్యత	మొత్తం
మహారాష్ట్ర	585	81	666
కర్ణాటక	734	173	907
ఆంధ్రప్రదేశ్	811	194	1005
మొత్తం	2130	448	2578

నేటి నుంచి విశాఖలో 'వరల్డ్ స్పేస్ వీక్'

ఉదయం ఆర్కే బీచ్ నుంచి స్పేస్ వాక్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల అధినేత

సీతమ్మధార (విశాఖ ఉత్తర): సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2023ను పురస్కరించుకొని విశాఖలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో కళాశాల చైర్మన్ కలిదిండి రఘు, షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యం పెంపొందించే దిశగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఎగ్జిబిషన్, వివిధ పోటీలు, ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యేక ప్రసంగాలు, సీనియర్ ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యేక వీడియో ప్రసంగాలు, ఇంటరాక్షన్ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రజల్లో అంతరిక్షంపై అవగాహన కలిగిస్తూ ఆర్కే బీచ్ నుంచి స్పేస్ వాక్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు స్పేస్ వీక్ -2023 వేడుకలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎస్‌డీఎస్‌సీఐ షార్, ఐఎస్ఆర్‌ఓ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు ప్రారంభిస్తారని తెలిపారు. 6వ తేదీన ఆరు నుంచి 12వ తరగతి విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 7వ తేదీన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, యూజీ, పీజీ విద్యార్థులకు క్విజ్ ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8వ తేదీన ముగింపు వేడుకలకు డీఆర్‌డీఏ ప్రతినిధులు, జేఎన్‌టీయూ వీసీ, షార్ చీఫ్ జనరల్ మేనేజర్ విజేతలకు బహుమతులు అందిస్తారని చెప్పారు.

తూకాల్లో మోసాలకు అడ్డుకట్ట

- తూనికలు, కొలతల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- గ్రామస్థాయిలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయక సిబ్బంది సేవల వినియోగం
- ఇప్పటికే సిబ్బంది ఎంపిక పూర్తి.. వచ్చే వారంలో శిక్షణ ప్రారంభం



సాక్షి, అమరావతి: వ్యాపార దుకాణాలు, సూపర్ మార్కెట్లు, బంగారు ఆభరణాల విక్రయాల్లో మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. తూనికలు, కొలతల చట్టాన్ని గ్రామస్థాయి నుంచి పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. వినియోగదారుల హక్కులను సంపూర్ణంగా పరిరక్షించడంలో గ్రామ, వార్డు సచివాలయ (జీఎస్‌డబ్ల్యూఎస్) సిబ్బందిని భాగస్వాములను చేయనుంది. దుకాణాల్లో సంప్రదాయ, ఎలక్ట్రానిక్ కాటా యంత్రాలను నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ధ్రువీకరించడం, స్టాంపింగ్ ప్రక్రియలను పర్యవేక్షించేలా బాధ్యతలను వికేంద్రీకరించింది. ఇప్పటికే జీఎస్‌డబ్ల్యూఎస్‌లో సాంకేతిక అర్హత కలిగిన ఇంజినీరింగ్ సహాయక సిబ్బందిని గుర్తించింది. వీరికి వచ్చే వారంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ప్రారంభించనున్నారు.

సిబ్బంది కొరతను అధిగమించేలా..

వాస్తవానికి తూనికలు, కొలతల శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. తూకంలో మోసాలతో పాటు ప్యాకింగ్ ఉత్పత్తులపై ముద్రిత ధర కంటే ఎక్కువకు విక్రయించడం, ఎమ్మార్పీలు ముద్రించకపోవడం వంటి లోపాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో పరిపాలన వికేంద్రీకరణలో కీలక భూమిక పోషిస్తున్న సచివాలయ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకునేలా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే భౌతికశాస్త్రం చదివిన బీఈ, బీటెక్, బీఎస్సీ విద్యార్హత కలిగిన ఇంజినీరింగ్ సహాయకులను ఎంపిక చేసింది. తూనికలు, కొలతల శాఖ అధికారుల పర్యవేక్షణలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయక సిబ్బంది స్థానికంగా వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేసి లోపాలు గుర్తించాలి. తూకాల్లో తేడా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించడం, గ్యాస్, పెట్రోల్ బంకుల్లో మోసాలు వంటి అంశాలపై ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా విధులను కేటాయిస్తూ పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హెచ్.అరుణ్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. వీటితోపాటు గ్రామ, మండల స్థాయిలో ఎప్పటికప్పుడు వినియోగదారులకు అవగాహన కల్పించడంతోపాటు 1967 టోల్‌ఫ్రీ నంబరుపై చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.